www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
07-10-2024
సంపుటి : 01 | సంచిక : 155 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD



## భారత్‌కు చేరుకున్న మాల్దీవుల అధ్యక్షుడు

**ఐదురోజులు పర్యటన..**

**రాష్ట్రపతి, ప్రధానమంత్రులతో భేటీ కానున్న ముయిజ్జు**

దిల్లీ: మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు దిల్లీ చేరుకున్నారు. సతీమణి షాజిదా మొహ్మద్‌తో కలిసి ఆదివారం దిల్లీ ఎయిర్‌పోర్టులో దిగారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు ఇతర సీనియర్ ఉన్నతాధికారులతో భేటీ కానున్నారు. మాల్దీవుల అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ద్వైపాక్షిక చర్చల కోసం ఆయన భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

## 4 మున్సిపల్ కార్పొరేషన్లుగా గ్రేటర్

**పేర్లతో పాటు సరిహద్దుల ఖరారుపై కసరత్తు**

**పెరగనున్న మహానగర పరిధి**

**నిధుల లభ్యత కోసమే నాలుగు కార్పొరేషన్లు**



6

“

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం బాధ్యతగా భావించలేదు..ఏళ్లుగా నిరీక్షించిన మీ కల ఇవాళ సాకారమవుతోంది.. వందలాది మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ ఏర్పడింది.. తెలంగాణ పునర్నిర్మాణంలో మీరు భాగస్వాములు కాబోతున్నారు..ఉద్యోగ నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి..విద్యార్థి, నిరుద్యోగుల త్యాగాలను కేసీఆర్ కవచంగా మార్చుకున్నారు.. కాళేశ్వరం కట్టినవారిని ఆదర్శంగా తీసుకుంటారో... నాగార్జున సాగర్ కట్టిన వారిని ఆదర్శంగా తీసుకుంటారో ఆలోచించుకోండి..‘‘నదుల పేర్లను ఎంతోమంది తమ పిల్లలకు పెట్టారు..మూసీ పేరును ఏ తండ్రి అయినా తమ కుమార్తెకు పెట్టుకున్నారా?..తెలంగాణ ఉద్యమం అనే ముసుగు వల్ల కేసీఆర్ ఎన్నో ఏళ్లు గౌరవం పొందారు.. అది ఆయన గొప్పతనం కాదంటూ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన ‘కొలువుల పండుగ’ కార్యక్రమంలో సీఎం పాల్గొని ఉద్యోగాలకు ఎంపికైన 1,635 మందికి అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడారు.



# గత ప్రభుత్వం బాధ్యతగా భావించలేదు

## ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని ఏళ్లుగా సాగదీసిన బీఆర్ఎస్ సర్కార్



- దసరాకు ప్రతీ కుటుంబంలో ఆనందం చూడాలనే అపాయింట్ మెంట్ ఆర్డర్స్
- విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ఇంజనీర్లు పనిచేయాలి
- మమ్మల్ని గెలిపించింది నిరుద్యోగులే...
- మురికి కూపమైన మూసీని ప్రక్షాళన చేస్తాం
- కేసీఆర్ పొందిన గౌరవం తెలంగాణ ఉద్యమం ఘనతే తప్ప.. ఆయన గొప్పతనం కాదు
- కొలువుల పండుగ కార్యక్రమంలో 1635మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**

గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని సంవత్సరాల కొద్దీ సాగదీసిందని, నోటిఫికేషన్ల దశలోనే కొన్నేళ్ల పాటు ఉంచారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన ‘కొలువుల పండుగ’ కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రభుత్వ వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగాలకు ఎంపికైన 1,635 మందికి నియామక పత్రాలు అందజేశారు. వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు.

మిగతా2లో...

# ఖండాంతరాలు దాటిన బతుకమ్మ ఖ్యాతి

## అమెరికాలోఅధికారిక గుర్తింపు

**ఉత్తర్వులు జారీ..**

**'తెలంగాణ హెరిటేజ్ వీక్' పేరుతో సంబురాలు**

**ప్రకటించిన ఆయా రాష్ట్రాల గవర్నర్లు**

**జపాన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు**


2

“

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు సూచిక.. తెలంగాణకు మాత్రమే సొంతమైన పూల కేళిక.. బతుకమ్మ పండుగ. పూలను పూజించే అత్యంత అరుదైన సంబురం బతుకమ్మ. ప్రకృతిలోనే పరమాత్మన్ని చూసుకుని.. పూలనే గౌరమ్మగా భావించి.. చేసుకునే తొమ్మిది రోజుల మహా ఉత్సవం బతుకమ్మ. అలాంటి బతుకమ్మ పండుగకు అరుదైన గుర్తింపు లభించింది. బతుకమ్మ సంబుర ప్రాశస్త్యాన్ని, పండగలోని పరమార్థాన్ని అమెరికాలో పలు రాష్ట్రాలు గుర్తించాయి. అమెరికాలోని నార్త్ కరోలినా, జార్జియా, వర్జీనియా రాష్ట్రాలు.. బతుకమ్మ పండుగను అధికారికంగా గుర్తించాయి. అంతేకాదు.. బతుకమ్మ సంబరాల వారాన్ని.. బతుకమ్మ పండగ వారంగా, తెలంగాణ హెరిటేజ్ వీక్‌గా ప్రకటించాయి కూడా. ఈ మేరకు.. ఆయా స్టేట్ల గవర్నర్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో.. బతుకమ్మ పండుగ ప్రాశస్త్యం ఖండాంతరాలు దాటినట్టయింది.

## అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

- ఇవి దేశానికే ఆదర్శంగా ఉంటాయి
- పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో చాలా రెసిడెన్షియల్ స్కూళ్లకు సొంత భవనాలు లేవని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలని నిర్ణయించామని చెప్పారు. యంగ్ ఇండియా మిగతా2లో...



## నేత్రపర్వంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**మూడోరోజు బకాసురవధ అలంకారంలో దర్శనం**

**వైభవంగా సింహ వాహన, ముత్యపుపందిరి వాహనసేవలు**

2

## ఉచిత విద్యుత్తు హామీని అమలు చేస్తే..

# బీజేపీ తరపున ప్రచారం చేస్తా

**ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్!**

- బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అంతటా విఫలమయ్యాయి
- హరియాణా, జమ్మూకశ్మీర్‌లో ఆ పార్టీకి ఓటమి తప్పదు
- కాంగ్రెస్‌ని నడిపేది అర్బన్ నక్సల్స్
- ‘జనతా కీ అదాలత్’ బహిరంగ సభలో ఢిల్లీ మాజీ సీఎం


2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 114 | రిటైల్ ₹ 136 |
| స్కిన్ ₹ 197 | స్కిన్ లెస్ ₹ 224 |

## ముంచే రోజులు పోతాయి..

# మంచి రోజులు మళ్లీ వస్తాయి

- అన్నదాతలు ఆత్మస్థయిర్యం కోల్పోవద్దు
- వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా.. ముఖ్యమంత్రికి సోయి లేదు
- పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నారు
- ఎక్స్‌వేదిక కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్


2


2

## ప్రతి ఒక్క ఆసామికి భరోసా

**2024 ఆర్‌వోఆర్ తీసుకురాబోతున్నాం**

**ఈ చట్టం దేశంలోనే ఆదర్శంగా ఉండబోతుంది**

**డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్ల సమావేశంలో మంత్రి పొంగులేటి**

# పాత ప్రసంగాలే చేస్తున్న ప్రధాని

**అవే పునరావృతం చేసినా ఆర్థిక వైఫల్యాలు కప్పిపుచ్చలేరు**

**కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే మండిపాటు**

**దిల్లీ:**

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని ఎప్పుడూ పాత ప్రసంగాలే చేస్తున్నారని.. మళ్లీ మళ్లీ వాటినే పునరావృతం చేసినా దేశ ఆర్థిక వ్యవస్థలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరన్నారు. మేకిన్ ఇండియా విఫలమైందన్న ఖర్గే.. ప్రజలపై గృహ రుణాల భారం, మిగతా2లో...



## పంచాంగం

**7-10-2024, సోమవారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం శుక్లపక్షం
**తిథి:** చవితి ఉ.9.46వరకు తర్వాత పంచమి (పూర్తి)
**నక్షత్రం:** అనురాధ రా.2.16వరకు
**సూర్యోదయం:** ఉ.6.11
**సూర్యాస్తమయం:** సా.5.56
**వర్జ్యం:** ఉ.8.25 నుంచి ఉ.10.08వరకు
**అమృత ఘడియలు:** మ.3.03 నుంచి సా.4.48 వరకు
**దుర్ముహూర్తం:** మ.12.27 నుంచి మ.1.14వరకు తిరిగి మ.2.48 నుంచి మ.3.35వరకు
**రాహుకాలం:** ఉ.7.39 నుంచి ఉ.9.07వరకు

# గత ప్రభుత్వం బాధ్యతగా భావించలేదు

**(మొదటి పేజీ తరువాయి)**

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం బాధ్యతగా భావించలేదు.. గత ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులకు తీరని నష్టం జరిగిందని సీఎం రేవంత్ అన్నారు నోటిఫికేషన్లు ఇచ్చిన ఆనాటి ప్రభుత్వం.. అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వడం బాధ్యతగా భావించలేదని విమర్శించారు.ఉద్యోగాల కోసం నిరీక్షించి నిరీక్షించి.. నిరుద్యోగులు ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

**మమ్మల్ని గెలిపించింది నిరుద్యోగులే...**

నిరుద్యోగ జంగ్ సైరన్ మోగించిన నాడు.. వాళ్ల ఉద్యోగాలు ఊడితేనే మీకు ఉద్యోగాలు వస్తాయని తాను చెప్పానని.. తన మాటపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ ను గెలిపించారని నిరుద్యోగులపై ప్రసంశలు కురిపించారు. మార్పు రావాలి, కాంగ్రెస్ గెలవాలన్న ఆలోచనతో ఆనాడు నేను చేపట్టిన 'విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్'కు మీరంతా మద్దతిచ్చారు. కేసీఆర్, ఆయన కుటుంబంలోని వారి ఉద్యోగాలు పోతేనే పేదలకు ఉద్యోగాలు వస్తాయని ఆనాడు చెప్పాను. నేను చెప్పినట్టే కేసీఆర్ ఉద్యోగం పోయింది.. ఇప్పుడు పేదలకు ఉద్యోగాలు వస్తున్నాయి. కొన్ని సంవత్సరాల నుంచి నియామకాలు జరగక, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక, లక్షలాది మంది నిరుద్యోగ యువకులు నిరాశ చెందారు. తమ మంత్రి వర్గం ఆలోచన చేసి సంవత్సరాల కొద్దీ వాయిదా పడుతున్న ప్రభుత్వ ఉద్యోగాలకు పరిష్కారం చూపించిందన్నారు.

**90 రోజుల్లోనే 30వేల మందికి ఉద్యోగాలిచ్చాం..**

ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే 90 రోజుల్లోనే ప్రమాణ స్వీకారం చేసిన చోటే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. దసరా పండగ నేపథ్యంలో తెలంగాణలో ప్రతీ కుటుంబంలో ఆనందం చూడాలని ఇవాళ మరిన్ని నియామక పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు.1635 మందికి ఇవాళ ఉద్యోగ నియామక పత్రాలు అందించడం సంతోషంగా ఉందని అన్నారు. మీ చప్పట్లలో మీ సంతోషం, మీ కుటుంబ సభ్యుల ఆనందం కనిపిస్తుందని చెప్పారు. ఏళ్లుగా నిరీక్షించిన మీ కల ఇవాళ సాకారమవుతోందని అన్నారు. ఇది కేవలం.. ఉద్యోగం మాత్రమే కాదు.. ఇది భావోద్వేగమన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని నోటిఫికేషన్ లు వేస్తామని ప్రకటించారు.



**వందలాది మంది ఆత్మబలిదానాలతో...**

వందలాది మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ ఏర్పడింది. అలాంటి తెలంగాణ పునర్నిర్మాణంలో మీరు భాగస్వాములు కాబోతున్నారని అన్నారు. ఉద్యోగ నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు.తెలంగాణ ఉద్యమం అనే ముసుగు వల్ల కేసీఆర్ ఎన్నో ఏళ్లు గౌరవం పొందారు. మొన్నటి వరకు ఆయన పొందిన గౌరవం తెలంగాణ ఉద్యమం ఘనతే తప్ప ఆయన గొప్పతనం కాదు'' అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

**ఎవరిని ఆదర్శంగా తీసుకుంటారో...**

లక్షలాది మంది హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజనీర్లను మీరు ఆదర్శంగా తీసుకొని ఇంజనీర్లు పనిచేయాలన్నారు. హైదరాబాద్ లో వందల ఏళ్ల క్రితం నిర్మించిన అద్భుత కట్టడాలు ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉన్నాయన్నారు. వందేళ్ల అనుభవం ఒకవైపు.. పదేళ్ల దుర్మార్గం మరోవైపు.. అంటూ బీఆర్ఎస్ మీద మండిపడ్డారు. నాగార్జున సాగర్, శ్రీరామ్ సాగర్, ఉస్మానియా హాస్పిటల్, ఉస్మానియా యూనివర్సిటీ కట్టిన ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు.కాళేశ్వరం కట్టినవారిని ఆదర్శంగా తీసుకుంటారో... నాగార్జున సాగర్ కట్టిన వారిని ఆదర్శంగా తీసుకుంటారో ఆలోచించుకోండి అని చెప్పారు.''ఇంజనీర్ల కృషి గొప్పతనం ఈ సమాజానికి చాలా అవసరం అన్నారు. 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్ మీ చేతుల మీదుగా నిర్మాణం కాబోతున్నాయి. ఎయిర్‌పోర్టుకు కూతవేటు దూరంలో ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ నిర్మాణం కాబోతున్నాయి. 55 కి.మీ మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలబెడతామన్నారు.

**ఈ నెల 9న బీ రెడీ..**

తన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చుకున్న కేసీఆర్ ... 2015లో నోటిఫికేషన్లు ఇచ్చిన వాళ్ళకు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదు? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమం గొప్పతనాన్ని.. విద్యార్థి నిరుద్యోగుల త్యాగాలను కేసీఆర్ కవచంగా మార్చుకున్నారని ఫైర్ అయ్యారు. ఇవాళ ముసుగు తొలగిపోవడంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అక్టోబర్ 9న 11,063 ఉపాధ్యాయ నియామక పత్రాలు అందించబోతున్నామని కీలక ప్రకటన చేశారు.

**ఈటల అంగి మారింది...**

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అంగి మారింది కానీ.. వాసన మారలేదని సెటైర్లు వేశారు సీఎం రేవంత్ రెడ్డి. హరీష్, కేటీఆర్ మాట్లాడిందే ఈటల మాట్లాడుతున్నారని అన్నారు. ఈటల ఇప్పటికైనా పేదల వైపు నిలబడాలని.. ఇలా వచ్చి అలా వెళ్లడం కాదు... ధైర్యం ఉంటే కేసీఆర్, హరీష్, ఈటల మూసీ పరివాహక నివాసాల్లో వారం రోజులు ఉండలని అన్నారు. అప్పుడే వాళ్ల కష్టాలు, బాధలు తెలుస్తాయన్నారు.

**మూసీపై వెనక్కి తగ్గేదే లేదు..**

మూసీ మురికిని ప్రక్షాళన చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు సీఎం రేవంత్. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మీ చేతుల మీదుగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ జరగబోతుందని తేల్చి చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు మూసీ కంపులోనే బతకాలా? అని ప్రతిపక్షాలను నిలదీశారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఇండ్లు కట్టించి వారికి మంచి భవిష్యత్తును అందిద్దాం అని అన్నారు. ప్రతీదానికి అడ్డుపడటం కాదు.. మూసీ బాధితులను ఎలా ఆదుకుందామో సలహాలు ఇవ్వాలని సూచించారు. ''నదుల పేర్లను ఎంతోమంది తమ పిల్లలకు పెట్టారు. చాలా మందికి గంగ, యమున, కావేరి పేర్లు ఉంటాయి. మూసీ పేరును ఏ తండ్రి అయినా తమ కుమార్తెకు పెట్టుకున్నారా? మూసీ అంటే మురికి కూపమనే పేరు స్థిరపడింది. ప్రజలు నిరాశ్రయులు అవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా? మల్లన్నసాగర్, కొండపోచమ్మ, గంధమల్లు రిజర్వాయర్ల నిర్మాణం వల్ల ఎవరి భూములూ పోలేదా? మల్లన్నసాగర్ పేరుతో రైతులను బలవంతంగా ఖాళీ చేయించారు. మూసీ నిర్వాసితులకు మంచి స్థలంలో ఆశ్రయం కల్పిస్తాం. మూసీ పరివాహక ప్రజలు దశాబ్దాలుగా మురికిలోనే ఉండాలా? నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సలహాలు ఇవ్వండి. భారాస పార్టీ నిధులు రూ.1500 కోట్లు దాటాయి. 2014కు ముందు భారాస ఖాతాలో ఉన్నదెంత.. ఇప్పుడెంత? పదేళ్లలో భారాస ఖాతాలోకి రూ.వందల కోట్లు ఎలా వచ్చాయి?'' అని సీఎం ప్రశ్నించారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

**(మొదటి పేజీ తరువాయి)**

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, కాంప్లెక్స్‌ల అంశంపై ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం, మంత్రులు మీడియాకు వివరాలు వెల్లడించారు. ''ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మించాలని నిర్ణయించాం. వీటిని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతాం. ఇవి దేశానికే ఆదర్శంగా ఉంటాయి. దసరా కంటే ముందే నిర్మాణానికి భూమి పూజ చేస్తాం. గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు భారీగా నిధులు కేటాయిస్తున్నాం. త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతులు సరిగా లేవు. రాష్ట్రవ్యాప్తంగా 1,023 స్కూళ్లు ఉండగా.. వాటిలో ప్రస్తుతం 600కు పైగా సొంతభవనాలు లేవు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి ఈ ఏడాది రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తాం''అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

## ముంచే రోజులు పోతాయి.. మంచి రోజులు మళ్లీ వస్తాయి

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణమని విమర్శించారు. పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నరు, కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారని దుయ్యబట్టారు.ఓవైపు సాగునీటి సంక్షోభం. మరోవైపు రుణమాఫీ ద్రోహం. ఇంకోవైపు రైతుభరోసా మోసం, కౌలు రైతులకూ అందని సాయం, రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం చోటుచేసుకున్నది చెప్పారు. వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా చలనం లేదు. ముఖ్యమంత్రికి సోయి లేదు.. ప్రభుత్వానికి బాధ్యత లేదని ఫైరయ్యారు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన సీఎం రేవంత్ కు రైతన్నల చేతిలో దండన తప్పదని హెచ్చరించారు. అన్నదాతలు ఆత్మస్థయిర్యం కోల్పోవద్దని కోరారు. ముంచే రోజులు తొందర్లోనే పోతాయని, మంచి రోజులు మళ్లీ వస్తాయంటూ ట్వీట్ చేశారు.

## ఉచిత విద్యుత్తు హామీని అమలు చేస్తే.. బీజేపీ తరఫున ప్రచారం చేస్తా

**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీకి ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు దేశంలోని 22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ప్రజలకు ఉచిత విద్యుత్తు హామీని అమలు చేస్తే.. తాను బీజేపీ తరఫున ప్రచారం చేస్తానన్నారు. తమ డిమాండ్‌ను నెరవేర్చేందుకు బీజేపీ సిద్ధమేనా అని మోదీకి సవాల్ విసిరారు. ఢిల్లీలో నిర్వహించిన 'జనతా కీ అదాలత్' పేరిట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అంతటా విఫలమయ్యాయని.. హరియాణా, జమ్మూకశ్మీర్‌లో ఆ పార్టీకి ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్‌ని నడిపేది అర్బన్ నక్సల్స్..**

హరియాణా, జమ్మూకశ్మీర్‌లలో బీజేపీ ప్రభుత్వాల పతనం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అంటే.. ద్రోవ్యోల్బణం, అవినీతి, నిరుద్యోగమేనంటూ మండిపడ్డారు. బీజేపీ ప్రజావ్యతిరేకమన్న కేజ్రీవాల్.. బస్ మార్షల్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లను తొలగించడంతో పాటు ఢిల్లీలో హోమ్‌గార్డుల వేతనాలను నిలిపివేసిందన్నారు. దేశ రాజధానిలో ప్రజాస్వామ్యం లేదని.. అక్కడ ఎల్జీరాజ్యం నడుస్తోందని ఆరోపించారు.

## 13జిల్లాలకు గ్రంథాలయ సంస్థల ఛైర్మన్ల నియామకం

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పలు జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- నిర్మల్- సయ్యద్ అర్జుమండ్ అలీ
- సిరిసిల్ల- నాగుల సత్యనారాయణ గౌడ్
- కరీంనగర్- సత్తు మల్లయ్య
- రంగారెడ్డి- ఎలుగంటి మధుసూధన్ రెడ్డి
- వనపర్తి - జి. గోవర్ధన్
- సంగారెడ్డి- గొల్ల అంజయ్య
- కామారెడ్డి- మద్ది చంద్రకాంత్ రెడ్డి
- మెదక్- సుహాసిని రెడ్డి
- నారాయణ్‌పేట్ - వరాల విజయ్ కుమార్
- నాగర్ కర్నూల్ - జి. రాజేందర్
- వికారాబాద్- శేరి రాజేశ్ రెడ్డి
- మహబూబ్‌నగర్- మల్లు నరసింహారెడ్డి
- జోగులాంబ గద్వాల- నీలి శ్రీనివాసులు




# ఖండాంతరాలు దాటిన బతుకమ్మ ఖ్యాతి

**(విశ్వంభర డెస్క్)**

తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ ఖ్యాతి ఖండాంతరాలను దాటింది. తాజాగా అమెరికాలోని పలు రాష్ట్రాలు బతుకమ్మ పండుగకు అధికారిక గుర్తింపునిచ్చాయి. ఇప్పటికే పలు దేశాల్లో తెలంగాణ ఆడపడుచులు అంగరంగ వైభవంగా బతుకమ్మ ఆడుతున్న విషయం విదితమే. ప్రస్తుతం ప్రతిష్టాత్మక వైట్ హౌజ్, ఆస్ట్రేలియా ఒపేరా హౌజ్, లండన్ బ్రిడ్జ్, ఐఫిల్ టవర్ తదితర చోట్ల వేడుకగా బతుకమ్మ పండుగ నిర్వహిస్తున్నారు. తాజాగా నార్త్ కరోలినా, జార్జియా, చార్లెట్టే రాలేహ్, వర్జీనియా రాష్ట్రాలు బతుకమ్మ పండుగను అధికారికంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశాయి. ఆయా రాష్ట్రాల గవర్నర్లు ఈ వారాన్ని బతుకమ్మ పండగ, తెలంగాణ హెరిటేజ్ వీక్‌గా ప్రకటించారు. బతుకమ్మ వైభవాన్ని, ప్రజలను కలుపుతూ వారి మధ్య పెంపొందిస్తున్న సుహృద్భావ వాతావరణాన్ని వారు కొనియాడారు.గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్, పలు ఇతర సంఘాలు, ప్రవాస తెలంగాణీయులు గత కొంత కాలంగా తెలంగాణ బతుకమ్మకు ఖండాంతరాల్లో గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. తాజా గుర్తింపుతో వారి కృషికి ఫలితం దక్కినట్లయింది. గతంలో సైతం కొన్ని అమెరికా రాష్ట్రాలు బతుకమ్మకు అధికారిక గుర్తింపునిచ్చాయి.

**అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు జరుపుకోవాలి**

బతుకమ్మ పండుగ అనేది ఎంతో ప్రత్యేకమైన, ప్రాముఖ్యత ఉన్న పండుగల్లో ఒకటని.. ఈ ఉత్సవాన్ని 4 కోట్ల తెలంగాణ ప్రజలే కాకుండా అమెరికాలో స్థిరపడ్డ 12 లక్షల మంది ఎన్నారైలు కూడా ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారని జార్జియా, వర్జీనియా రాష్ట్రాల గవర్నర్లతో పాటు నార్త్ కరోలినాలోని ఛార్లెట్, రాలేహ్ మేయర్లలు



దుబాయ్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సినీ దర్శక , నిర్మాత తల్లాడ సాయి కృష్ణ

అభివర్ణించారు. బతుకమ్మ అనేది.. ప్రకృతికి మానవజాతికి మధ్య ఉన్న అనుబంధాన్ని, ఆత్మీయతను తెలియజేసే అద్భుతమైన సంబురమని కొనియాడారు. తెలంగాణ సమాజం నార్త్ కరోలినాకు ఎంతో కంట్రిబ్యూట్ చేసిందని తెలిపారు.ఈ క్రమంలోనే.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా బతుకమ్మ పండుగను అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు అధికారికంగా జరుపుకోవాలని అక్కడి ప్రజలకు సూచించారు.

**బతుకమ్మ ప్రాముఖ్యతను తెలుసుకొని ఈ నిర్ణయం**

ఇప్పటికే.. తెలంగాణలోని ప్రజలు విశ్వవ్యాప్తంగా విస్తరించారు. అమెరికా, లండన్, బ్రిటన్, పారిస్, దుబాయి, సౌదీ అరేబియా ఇలా అన్ని దేశాల్లో తెలంగాణవాసులు స్థిరపడ్డారు. అయితే.. తెలుగు వారు ఎక్కడున్నా వారి సంస్కృతిని సంప్రదాయాలను ఎప్పుడూ మర్చిపోకుండా పాటిస్తుంటారు. ఈ క్రమంలోనే.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రజలు కూడా.. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తుంటారు.ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత.. బతుకమ్మ పండుగ విశ్వవ్యాప్తమైంది. ముఖ్యంగా తెలంగాణ జాగృతితో పాటు తానా, మాటా లాంటి తెలుగు ఎన్నారైల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్గనైజేషన్స్ కూడా ఆయా దేశాల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నాయి. ఈ వేడుకలకు అక్కడ నివసిస్తున్న తెలుగువారి నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో.. అక్కడి ప్రభుత్వాలు కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవటం గమనార్హం.ఈ క్రమంలోనే.. అమెరికాలోని ఆయా రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో తెలుగువారు స్థిరపడగా.. అందులో తెలంగాణ ప్రజలు కూడా గణనీయంగా ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే.. తెలంగాణకు మాత్రమే సొంతమైన బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహిస్తూ.. ఇక్కడి సంప్రదాయాలను అమెరికాలో కూడా పాటిస్తున్నారు ఈ క్రమంలో.. అమెరికాలోని పలు రాష్ట్రాలు.. బతుకమ్మ ప్రాముఖ్యతను తెలుసుకుని ఈ నిర్ణయం తీసుకున్నాయి

**జపాన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు**

జపాన్ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో జపాన్ రాజధాని టోక్యోలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోమట్సుగావా పార్క్‌లో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో సుమారు 150మంది మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. సాంప్రదాయ వస్త్రధారణతో మహిళలు రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆడిపాడారు.జపాన్ రాజధాని నగరం టోక్యోలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న తెలుగు మూలాలున్న ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని సందడి చేశారు. తక్కువ సమయంలోనే సాధ్యమైనంత ఎక్కువమందిని పాల్గొనేలాచేసి వేడుకలను విజయవంతం చేసినట్లు సమాఖ్య వాలంటీర్ మురళీధర్ తెలిపారు.

## ప్రతి ఒక్క ఆసామికి భరోసా

**విశ్వంభర, హైదరాబాద్ :** రాబోయే కొద్ది రోజుల్లో ఆర్‌వోఆర్ 2024 చట్టం తీసుకురాబోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని డిప్యూటీ కలెక్టర్లు, 257 రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారులు, 970 తహసీల్దార్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఇబ్బందులు పడకుండా ఈ చట్టం దేశంలోనే ఆదర్శంగా ఉండబోతుందన్నారు. అధికారుల నుంచి సూచనలు, సలాహాలు ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10,900 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ప్రతి రెవెన్యూ విలేజ్‌కు రెవెన్యూ అధికారిని నియమించాలని అధికారులు కోరుతున్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రితో సమావేశమై ఇంకా అనేక అంశాలు చర్చిస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో 2024 ఆర్‌వోఆర్ తీసుకురాబోతున్నాం. భూములు ఉన్న ప్రతి ఒక్క ఆసామికి భరోసా ఇవ్వాలన్నదే ప్రభుత్వం ఆలోచన అని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మంచి పాలన ఇచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు.

## నేత్రపర్వంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**విశ్వంభర, తిరుమల:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవితో కలిసి బకాసురవధ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం సింహ వాహన సేవ నిర్వహించారు. మలయప్పస్వామి ఆ వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం చేశారు. వాహన సేవను తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి వైభోగాన్ని కనులారా వీక్షించి పునీతులయ్యారు.మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగిన వాహనసేవలో వివిధ కళాబృందాల ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని వాహనసేవలో దర్శించుకున్నారు.

**తిరుమలలో వైభవంగా శ్రీవారి ముత్యపుపందిరి వాహనసేవ**

రాత్రి శ్రీమలయప్పస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జ్యోతిషశాస్త్రం చంద్రునికి ప్రతీకగా ముత్యాలను తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్టు పురాణాల్లో ఉంది. ఆదిశేషుని పడగలను ముత్యాల గొడుగుగా పూనిన స్వామివారిని దర్శించినా, స్తోత్రం చేసినా సకల శుభాలు కలుగుతాయని పురాణ ప్రశస్తి. చల్లని ముత్యాల కింద నిలిచిన శ్రీనివాసుడి దర్శనం తాపత్రయాలను పోగొట్టి, జీవితాలకు చల్లదనాన్ని సమకూర్చుతుందని భక్తుల విశ్వాసం. వాహనసేవలో పెద జీయర్‌స్వామి, చినజీయర్‌స్వామి, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీ శ్రీధర్ పాల్గొన్నారు.

## పాత ప్రసంగాలే చేస్తున్న ప్రధాని

**(మొదటి పేజీ తరువాయి)**



ధరల పెరుగుదల, తయారీ రంగంలోని సమస్యలను లేవనెత్తారు. ''మోదీ ఆర్థిక నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థకు శాపంగా మారాయి. మోదీజీ.. మీరు పాత ప్రసంగాలనే పునరావృతం చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరు. 2013-14 నుంచి నేటి వరకు గృహ సంబంధిత ఖర్చులు 241 శాతం పెరిగాయి. జీడీపీలో గృహ రుణం ఎన్నడూ లేని విధంగా పెరిగింది. కొవిడ్ సమయం నుంచి ప్రజలకు ఆదాయం కంటే ఖర్చు రెట్టింపైంది'' అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. ''గతేడాదితో పోలిస్తే.. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు పెరిగాయి. ధరల పెరుగుదల భాజపా తీసుకున్న నిర్ణయం. అసంఘటిత రంగాన్ని నాశనం చేయడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. యూపీఏ హయాంలో పెరిగిన భారత్ ఎగుమతుల లాభాలను మీ విధానాలతో విస్మరించడం వల్లే 10ఏళ్లలో మేకిన్ ఇండియా ఘోరంగా విఫలమైంది'' అంటూ మండిపడ్డారు.

# నేడు చంద్రబాబు ఢిల్లీ పర్యటన

- సాయంత్రం ప్రధానితో సీఎం భేటీ
- పలువురు కేంద్ర మంత్రులతోనూ సమావేశం
- రైల్వే జోన్, సెయిల్‌లో విశాఖ ఉక్కు విలీనం, వరద నిధులపై చర్చించే అవకాశం

**విశ్వంభర, అమరావతి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ చేరుకొని, సాయంత్రం 4.30 గంటలకు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. అనంతరం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమవుతారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, గడ్కరీ, నిర్మలా సీతారామన్‌తో మంగళవారం భేటీ కానున్నారు. బుడమేరు వరదలపై కేంద్రానికి నివేదిక ఇచ్చిన తర్వాత చంద్రబాబు.. ప్రధానిని కలవడం ఇదే తొలిసారి. రైల్వే జోన్, సెయిల్‌లో విశాఖ ఉక్కు విలీనం, వరద నిధులపై చర్చించే అవకాశముంది. ప్రపంచ బ్యాంకు నుంచి అమరావతి నిర్మాణానికి నిధుల్లో ఆటంకం



లేకుండా చూడాలని చంద్రబాబు కోరనున్నట్టు సమాచారం.

V3 NEWS విశ్వంభర
07-10-2024 సోమవారం www.vishvambhara.com
జనరల్ న్యూస్ GENERAL NEWS


### వరంగల్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ సభ్యుల

# ప్రమాణ స్వీకారం

- అధ్యక్షుడిగా దుబ్బ శ్రీనివాస్



**విశ్వంభర, వరంగల్ :** వరంగల్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా దుబ్బ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గార్లపాటి నాగేంద్ర బాబు, కోశాధికారిగా గందే శ్రీనివాస్ గుప్తా, అన్ని విభాగాల ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మహోత్సవాన్ని హంటర్ రోడ్డు లోని గోల్డెన్ ఫంక్షన్ హాల్లో అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, కార్యదర్శి వంగేటి అశోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నుకోబడిన ఆర్య వైశ్య మహాసభ సంఘ అధ్యక్షులు, కమిటీ సభ్యులు జిల్లా లోని ఆర్య వైశ్యుల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీ నివాస్ నూతన కార్యవర్గ సభ్యులచే, అన్ని విభాగాల కార్యవర్గాలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తాటికొండ కృష్ణమూర్తి, వరంగల్ జిల్లా కన్వీనర్లు చకిలం ఉపేందర్, లీలా శ్రీధర్ రావు, లీగల్ సెల్ జిల్లా సభ్యులు ఐత ప్రసాద్, బాదం నాగరాజు, ఇరుకుళ్ల హరినాథ్, ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఉప్పుల శారద, జనరల్ సెక్రెటరీ కాచం సుష్మా, అడిషనల్ జనరల్ సెక్రెటరీ సామ్రాజ్య లక్ష్మి, ఆర్య వైశ్య మహాసభ వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చొల్లేటి కళావతి, సెక్రెటరీ గార్లపాటి శ్రీలత, కోశాధికారి తాటిపెల్లి రాజమణి, అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ తాటిపెల్లి సుప్రియ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గట్టు ధనలక్ష్మి, సంపూర్ణ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



### యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



**డా . కాచం సత్యనారాయణ**

**విశ్వంభర, నాగోల్ :** క్వాలిటీ వాటర్ సోల్యూషన్స్‌ను V3 న్యూస్ ఛానల్, విశ్వంభర దిన పత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ మమత నగర్, రోడ్ నెం2లో ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. కాచం సత్యనారాయణ మాట్లాడుతూ నేటి యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో మరింతగా ఎదగాలని అన్నారు. నేటి యువత గొప్ప చదువులు చదువుకొని ఉద్యోగాల కోసం నిరంతరం తపన పడుతున్నారని, అలాంటి వారు ఉద్యోగాల కోసమే కాకుండా స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. క్వాలిటీ వాటర్ సోల్యూషన్స్ ద్వారా నాణ్యత గల ప్రమాణాలు పాటిస్తూ వినియోగాదారుల మన్ననలను పొందాలని నాగరాజుకు సూచించారు.




### లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో

# మానవ హక్కులపై అవగాహన సదస్సు



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ పట్టణం లోని అబిడ్స్ సూర్య లాక్ కాంప్లెక్స్‌లో లోకాసమస్త హ్యూమన్ రైట్స్ హైదరాబాద్ పట్టణ మహిళా విభాగ చైర్పర్సన్ కె. సుశీల కుమారి ఆధ్వర్యంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ఫౌండర్, నేషనల్ చైర్మన్ జీపీ నరసింహులు హాజరై భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. సమాజంలో ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సంస్థ విధి విధానాలను సభ్యులకు వివరించి, గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. సమాజంలో ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా ఎవరి వంతు వారు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మరి కొంత మంది సామాజిక సేవకులు సమాజంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన విషయాల గురించి చర్చించారు. కార్యక్రమంలో పల్లె ప్రవీణ్ ఆధ్వర్యంలో గంగరాజు, వరలక్ష్మి ఆలపించిన పాటలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో వావ్ అవార్డ్స్ ఫౌండర్ ఎల్ సందీప్ గౌడ్, లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ఏపీ స్టేట్ కోఆర్డినేటర్ యూ రఘురాములు, ఏపీ, టీఎస్ చైర్మన్ సి. మోహన్ రావు, సామాజిక సేవకురాలు చంద్రప్రభ, సభ్యులు రెడ్డి ప్రసాద్, వంశీ కుమార్ రెడ్డి, జాహ్నవి, కే లక్ష్మీ సాయి నిహారిక, వీరభద్ర, నాగజ్యోతి, సిద్దయ్య, అవినాష్ యాదవ్, సీరియల్ ఆర్టిస్టులు రాధా, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన రంగ్ దే దాండియా నైట్

- నృత్యాలతో ఆకట్టుకున్న యువత
- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయి చంద్



**విశ్వంభర, కర్మన్ ఘాట్ :** తెలంగాణ లో పెద్ద పండగ దసరా పండగ అని మాజీ వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయి చంద్ అన్నారు. కర్మన్ ఘాట్ లోని చంద్ర గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన రంగ్ దే దాండియా నైట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. దేవి నవరాత్రులను పురస్కరించుకొని సంస్కృతి , సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ తొమ్మిది రోజుల పాటు నిర్వహించే నవరాత్రులలో బతుకమ్మను జరుపుకోవటం, అలాగే నవరాత్రుల వేడుకలలో దాండియా నృత్యాలు చేయడం గొప్ప విషయమని అన్నారు. యువతీ యువకులను ఒక్క దగ్గరికి చేర్చి ఇలా సంబరాలు చేయడం సంతోషకరమని అన్నారు. అందరికి ముందుస్తుగా విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసారు. నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్న దంపతులకు, యువతీ, యువకులకు బహుమతులు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిన రంగ్ దే దాండియా నైట్ వారిని ఆమె అభినందించారు. ఈ నైట్ లో గేమ్స్, డాన్స్ మస్తీ, ఎంటర్టైన్మెంట్ ప్రోగ్రామ్స్, చిల్డ్రన్స్ గేమ్స్, పంజాబీ ధోల్, ఫుడ్ స్టాల్ల్స్, ఫోటో బూత్ కార్యక్రమాలు చిన్న, పెద్ద తేడా లేకుండా అందరిని ఆకట్టుకున్నాయి. దాండియా నృత్యాలతో యువతీ , యువకులు అలరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డి. భాను ప్రకాష్, కృష్ణవేణి ఓరుగంటి, ఆర్తం శ్రీవాణి, మహేశ్వరి పాలారపు, కె నగేష్ కుమార్, అభిషేక్ కర్గ, శ్రీ ధన్య, బాలు తదితరులు పాల్గొన్నారు.








దేవి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం న్యూ మారుతి నగర్‌లో జాగారం నిర్వహించారు. ఈ కారిక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దాము మహేందర్ యాదవ్, నవీన్ చారి, రవి ముదిరాజ్, గిరి బాబు, జగదీశ్, శేఖర్ పటేల్, రాకేష్ గుప్త, శేషి రాము, హనుమాన్ దాస్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

- విశ్వంభర, కొత్తపేట్





# ఎర్రమట్టి పులుముకున్న యాదయ్య కవిత్వం

మన సమాజం గుర్తించ నిరాకరించిన అనేక విషయాలను, సమస్యలను బెల్లి యాదయ్య కవితా వస్తువులుగా మలిచి చర్చకు పెడతాడు. మట్టి గురించి, మట్టిలో నుండి అన్నం తీసే రైతుల కష్టాల గురించి రాస్తాడు. ఆయన కవిత్వంలో ఏ పుటను పట్టుకున్నా, ఏ కవితను పట్టుకున్నా మట్టిని గురించిన, మట్టి పరిమళాల గురించిన, మట్టి మనుషుల గురించిన కవిత్వమే వినిపిస్తుంది. ప్రతి కవిత పల్లె వేర్లనల్లుకుని పటిష్టంగా పాఠకుల్ని ప్రభావితం చేస్తుంది. యాదయ్య రాసిన ఎక్కువ కవితల్లో ఏదో ఒక పాదంలో పల్లె గుండె కొట్టుకుంటుంది. జ్ఞాపకాల మల్లె విచ్చుకుంటుంది. వాటిని పగబట్టినట్టు దోచుకుంటున్న ప్రపంచీకరణ పాము పడగపై మట్టిరంగు పులుముకున్న కవిత్వాయుధమై విరుచుకుపడుతుంది. బహుజనులకు రాయడం రాజకీయ అవసరమని తేటతెల్లం చేస్తాడు. బహుజనులు సాహిత్య సృజన చేయడాన్ని కూడా వస్తువుగా మలిచాడు.

"వాయువు ద్వారా ఆయువును/ నది ద్వారా కాలువను/ రైతు ద్వారా ధాన్యాన్ని/ గురువు ద్వారా చూపుడు వేలును/ సూర్యుడి ద్వారా సుప్రభాతాన్ని చేదుకుంటాం/ ఈ సమస్తాన్ని తన కక్ష్యలో ప్రసరించగల బోధివృక్షం ఒక్క ఉద్యమమేనేమో.." అంటూ ఉద్యమమే జ్ఞాన వెలుగులందించే బోధివృక్షం అని చెబుతాడు. ఈయన కవితల్లో కనుమరుగైతున్న ఎన్నో పల్లె పదాలను ఒడిసిపట్టుకోగలం. దుఃఖం గురించి, ప్రకృతి గురించి, అనేక తాత్విక విషయాల గురించి రాశాడు. బుద్ధిజం, మార్క్సిజం పునాదిగా అనేక తార్కిక తాత్విక విషయాలు వెల్లడించాడు.

"పిడికిలి బిగించిన బతుకమ్మ/ బోనం ఎత్తుకున్నది ఐలమ్మ/ ఇక్కడ యుద్ధం ఒక జీవనది/ తెలుగుజాతి మనది/ నిండుగ రెండుగ వెలుగుజాతి మనది/ జై బోలో తెలంగాణ" అంటూ తెలంగాణ గోసను, ఆశను, ఆకాంక్షను ఆగ్రహంతో చెప్పడానికి బదులు అర్థవంతంగా చెప్తాడు. అక్కడి వారికి కూడా అర్థమయ్యేలా విప్పి చెప్పాడు. ఆంధ్రా పెట్టుబడిదారుల్ని, ఆధిపత్య కులాలని, పార్టీలకు అతీతంగా తెలంగాణకు అడ్డుపడుతున్న అగ్రకులాల ఐక్యతను ఎండగడతాడు. అక్కడ ప్రజలు ఇక్కడి ప్రజలు తెలుగుజాతిగా, రెండుగ వెలుగు జాతిగా ఉండాలని కోరుకుంటాడు. అక్కడి అగ్రకుల అధిపత్యాలను విమర్శించడం బహుజన తత్త్వం అయితే పెట్టుబడిదారులను ఎండగట్టడం వర్గ దృక్పథంగా మనకు కనిపిస్తుంది.

> ఈ సమాజం అంతగా పట్టించుకోని కమ్మరి, కమ్మరి జీవితాలను, పెద్దమ్మల వారి బతుకుతెరువును, లంబాడాల కష్టాలను కవిత్వీకరించిన అతి కొద్దిమంది కవుల్లో బెల్లి యాదయ్య ఒకరు. ఆయన అంటరానితనం గురించి, ఆత్మహత్యల పరిస్థితుల గురించి అక్షరీకరిస్తాడు. వారి జీవితాలను నిరాదరణకు, వెలివేతలకు గురి చేసిన భూస్వామ్య, పెట్టుబడిదారి సమాజాలను, వారి జీవితాలను కుచింపజేసిన విధానాలను ఎండగడతాడు.

"అడవుల కవచాన్ని విప్పి/ అణుధార్మికతను తొడుక్కోలేను/ సిల్వర్ మెనో మ్యాజిక్ లో పడి/ సిర్రా సిటికెన పుల్లల్ని కాల్చేయలేను" అంటూ ప్రపంచీకరణ జరుపుతున్న విధ్వంసాన్ని వెంటాడి మరీ తన కవిత్వంతో వేటాడుతున్నాడు యాదయ్య. వీటి మధ్యే మార్గంగా స్వదేశీ జపంతో, హిందూ మతం నెపంతో చేస్తున్న హత్యాకాండను ఎండగట్టాడు. యాదయ్యలో రాయకుండా ఉండలేనితనం, నిలదీయకుండా నిలబడలేనితనం కనిపిస్తుంది.

"పదే పదే మట్టి గురించే మాట్లాడుతాను/ భావితరానికి మట్టి మీద గౌరవం పెరిగేలా గట్టిగా నూరిపోస్తాను/ మట్టి వారసత్వాన్ని నేను" అంటాడు యాదయ్య. వ్యవసాయం అంటే ఉన్నతోన్నత మానవీయత. వ్యవసాయం అంటే నాగరికత ఉత్పత్తి అని నమ్మే మట్టి కలం యాదయ్యది. అందుకే ఆయన కవిత్వంలో మట్టి పరిమళం గుబాళిస్తుంది. మట్టి పదాలు గర్వంగా తలెత్తుకుని నిలబడతాయి. ఈ సంపుటిలో అలా మట్టి పాటల్ని కైగట్టి పాడుతున్న పాటగాళ్లను కూడా నెమరేసుకుంటాడు యాదయ్య. పితృస్మృతిలో కూడా యాదయ్య కవిత్వం రాసాడు. కానీ అది కేవలం తండ్రి జ్ఞాపకాలకు, గొప్పలకు మాత్రమే పరిమితమై రాయలేదు. వ్యవసాయం గురించి, వ్యవసాయంలో గొడ్ల ప్రాధాన్యత గురించి, వ్యవసాయ జీవులు వారి పని పద్దతుల గురించి, వ్యవసాయిక క్రమశిక్షణ గురించి, పని పట్ల ఉండే నిమగ్నత, నిబద్ధతల గురించి వాళ్ళ నాన్న స్మృతిలో వ్యవసాయ కవిత్వం చెబుతాడు. యాదయ్య కవిత్వం చదువుతున్నప్పుడు అవ్వ తన ఒళ్ళో పిల్లల్ని కూర్చోబెట్టుకుని కథలు చెప్తున్నట్టు ఉంటుంది. రేపటి తరాన్ని ఎదురుగా కూర్చోబెట్టుకున్న తాత తన అనుభవాలతో చీకటి పోకడల గుట్టు విప్పి దారి చూపుతున్నట్టు ఉంటుంది. కవిత్వం నడిపే తీరులో ఉండే బిగువు పాఠకున్ని ఉపిరిబిగబట్టి చదివేలా చేస్తుంది. కవి చెప్పాలనుకున్న ప్రధాన విషయాన్ని మొదటి పదంలోనే ఎత్తుగడగా చెప్పి పాఠకుడి మదిలో ఉత్సుకత రేకెత్తిస్తాడు. ఆయన కవిత కథారీతిలో, యదార్థ కథలను కవితాత్మకంగా చెప్తున్నట్టు అనిపిస్తుంది. అలా పాఠకున్ని లీనం చేసే రసాత్మక ఊపులో కవిత్వం చెప్పగల కనికట్టు యాదయ్యకున్నది.

"ఈవురం వేగం/ రెండు బతుకు/ బండికి చక్రాలనేవాడు/ నాన్న పంచెకట్టును/ జోడు చెప్పులను చూసే/ అవి ముస్తాబయ్యేవి" అంటూ యాదయ్య కవిత్వం చదువుతున్నప్పుడు పాఠకుడి కళ్ళముందు భావచిత్రాలు కదిలాడుతుంటాయి.

ముఖ్యంగా కనుమరుగైతున్న వ్యవసాయ పనిముట్లను తన అక్షరాలతో ప్రేమగా నిమురి కవిత్వం చేస్తాడు. కళ్ళముందున్న పనిముట్లను భావచిత్రాలుగా మలిచి మనల్ని ఆశ్చర్యానికి గురిచేస్తాడు. పల్లెల్ని రూపచిత్రాలు చేసి ముల్లుగర్రను చేతికిచ్చి పాఠకులను ముసురు వానలోకి నడిపి తన కవిత్వంతో తడిపేస్తాడు. కొమ్ముల బర్రెను, జోడు చెప్పులను సైతం భావచిత్రాలుగా తీర్చిదిద్ది పాఠకులను మెప్పిస్తాడు. ఆయన వాక్యాలు సరళంగా, సూటిగా, స్పష్టంగా ఉంటాయి. కానీ దీర్ఘ వాక్యనిర్మాణం ఉంటుంది. అయినా కూడా పదాల సంక్లిష్టత ఉండదు. కవితా కూర్పులో బిగువు, కథన నడకలో ఉత్సుకత ఉంటుంది. అయన కవిత్వంలో ఓ పల్లెదనం, ప్రాకృతిక సౌందర్యం చోటుచేసుకుంటుంది. ఓ పక్క సాంప్రదాయ అలంకార సామాగ్రి వాడుకుంటునే, మరో పక్క ఆధునిక సామాగ్రిని ప్రయోగిస్తాడు.

"వంశానికి పెద్దపీట వేసేవాడు/ వారసుల్ని/ మూతికి కట్టుకుని తిరిగేవాడు కాదు/ ఇప్పుడు మాకో బుద్దిస్ట్ కావాలి/ అతని/ మేనిఫెస్టోలో బహుజనతత్వం వేయి స్తంభాల గుడిలా రూపొందాలి" అంటూ బెల్లి యాదయ్య తనదైన శైలిలో ప్రతీకల్ని వాడాడు.

ఆయన ప్రతీకలు వస్తువుకు అదనపు ప్రయోజనాన్ని చేకూర్చాయి. గ్రామీణ ప్రతీకల్నే కాకుండా ఆధునిక, సాంకేతిక ప్రతీకల్ని వాడి యువతరం పఠితలకు దగ్గరయ్యాడు. ప్రతీకలే వస్తువు అన్నట్లు కాకుండా, అవసరమైన సందర్భాల్లో వస్తువాత్మలోంచే ప్రతీక ప్రయోగం చేశాడు. వస్తువును మరింత అందగిస్తూ లోతైన అర్థాలను జతచేశాడు. సమర్ధవంతమైన ప్రతీకలకు ఊపిరిపోసి, వస్తువును ప్రాణప్రదంగా మలిచి, నోరులేని వారి గొంతుగా తానై పలకడం యాదయ్యకు మార్క్సిజం ప్రభావం వలన అబ్బింది. అది సదా వర్ధిల్లాలని ఆశిద్దాం.



- ఎం. విప్లవకుమార్
సెల్: 9515225658



# ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న ఆధునిక సంగీతం

భారతదేశంలో శాస్త్రీయ సంగీతం మనందరికీ ఓ గొప్ప వరం. సంగీత సాగరంలో ఓలలాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యవంతులుగా మన పూర్వీకులు ఉండేవారు. శాస్త్రీయ సంగీతం ఆటిజంతో బాధపడుతున్న చిన్న పిల్లలకు ఒక థెరపీ. ప్రస్తుతం సంగీతం కాస్త రూట్ మార్చి పాశ్చత్య పోకడలతో ఫాస్ట్ బీట్స్, ఫ్యూజిన్, రాక్ బ్యాండ్ సరికొత్తగా డిస్క్ అనే అవతారాలతో ఈ తరం వారి ముంగిట ఉంది. డీజే మనందరినీ అలరారిస్తుందో, అద్భుతాలు చేస్తుందో, అల వైకుంఠపురానికి దారి తీసేలా చేస్తుందో తెలియదుగాని శారీరక , మానసిక కల్లోలాలకి మాత్రం దారితీస్తుంది. ఏదైనా పండగ, జాతర, పెళ్లిళ్లు పేరంటాలు వస్తున్నాయంటే వినసోంపైన సన్నాయి, డప్పులు ,మేళాలు మనసు హత్తుకొనేల ఎంతో ఆనందాన్ని ఇచ్చి సంప్రదాయాన్ని మెరుగులు దిద్దినట్టుగా ఉండేవి.. కానీ ఇప్పుడు చిన్న బారసాలైనా, అన్నప్రాసనైనా, కిట్టి పార్టీలో, ఫ్రెషర్స్ పార్టీలో, ఒకటేమిటి ఇలా చెప్పుకుంటూ పోతూ ఉంటే చివరికి చావులో సైతం డప్పులు మరిచి డీజే వెర్రెత్తి డ్యాన్స్ లు వెర్రెత్తిస్తోంది. ఇదివరకు గణేష్ చతుర్థి, దేవీ నవరాత్రుల ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురు చూసేవాళ్ళం .నలుగురు ఒక మంటపం దగ్గర చేరి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, ఉట్టి కొట్టడం, చిన్న చిన్న ఆటలు ఆడటం, హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణం ,ప్రవచనాలు, కుంకుమ పూజలు వంటి ఎన్నో కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో జరుపుకునే వాళ్ళం. కానీ ప్రస్తుతం ఆ నవరాత్రులలో ఈ డీజే రాకతో అశ్లీల నృత్యాలు జరుగుతున్నాయి. యువత విపరీతమైన పిచ్చి డాన్సులు చేస్తున్నారు. వెర్రి చేష్టలు చేస్తున్నారు. వీటితో తెలియకుండానే ఆ దైవకార్యాలకు నెమ్మది నెమ్మదిగా పెద్ద వారంతా దూరమైపోతున్నారు. ఈ మార్పు సమాజానికి మంచిది కాదు. కేవలం డీజే మన భారతదేశ గౌరవానికి అప్రతిష్ట పాలు చేసే ఒక కారణభూతం అవుతుంది. అంతేకాదు వేడుక జరిగే ఇల్లే కాకుండా చుట్టుపక్కల వీధి వీధంతా దద్దరిల్లేలా డీజే సాంగ్స్ మితిమీరిన ధ్వనితో గుండెలు పగిలేల ఇబ్బంది పడుతున్నాయి. సంగీతంతో ఎన్నో రకాల జబ్బులు తగ్గించవచ్చు. అది ఎప్పుడు సాధ్యం అవుతుంది అంటే చెవి వినగలిగినంత విన సొంపైన సంగీతాన్ని వీనులకు విందుగా, మన మనసును ఆనంద పరచి హృదయ ప్రకంపనలను ,మెదడు కణాలను ఉత్తేజితం చేయటం ద్వారా ఆరోగ్యం బాగు చేయటం సాధ్యం అవుతుంది . మనం చెవి సాధారణంగా వినగలిగే ధ్వని తీవ్రత కేవలం 60 డిసిబుల్స్. కానీ ప్రస్తుతం వివాహాది ఫంక్షన్లో ఉపయోగించి డీజే ఈ పరిమితి దాటి కొన్ని రెట్లు ఎక్కువగా ఉండటం వల్ల భయోత్పాతక ధ్వనుల మధ్య ఎక్కువ సమయం గడపడం వల్ల హృదయ స్పందన రేటు విపరీతంగా పెరిగిపోయి మెదడు నరాలు ఎక్కువ ఉత్తేజితం కావటం వల్ల బ్లడ్ క్లాట్స్ ఏర్పడి, ఒక అవయవంలో వచ్చిన మార్పు శరీరంలో అనేక అవయవాల పెను మార్పులకు దారితీస్తుంది. ఎందరో మరణాలకు కారణం అవుతుంది. కేవలం మనుషులనే కాదు జంతువుల మీద, బిల్డింగ్స్ మీద కూడా ఈ ధ్వని తీవ్రత శబ్ద ప్రకంపనలు ప్రభావితం చూపిస్తున్నాయ్ .ఇటీవల కాలంలో గుజరాత్ లో జరిగిన ఓ సంఘటన దీనికి నిదర్శనం. ఒక ఫంక్షన్ లో ఎక్కువసేపు డీజే డాన్సులతో ఆ ప్రాంతం దగ్గరిల్లిపోవటం వల్ల అక్కడ ఉన్న గోడ కూలి కొంతమంది మరణించారు అంతేకాదు డీజే సాంగ్స్ కి డాన్స్ చేసి తన పెళ్లిలో నవవధువు మరణించి సంగతి విధితమే. అతి సర్వత్ర వర్జయేత్ ఒక దశ వరకు వినసొంపైన సంగీతం ప్రాణ పునర్జీవనం చేస్తుంది అదే ధ్వని శృతిమించితే ప్రాణం కూడా తీస్తుంది. భారతదేశ సాంప్రదాయాల్లో డీజే పెనుమార్పులను తీసుకొచ్చింది ఈ మార్పులు ఒక దశ వరకు మంచిది కానీ శృతిమించటం వల్ల ధ్వని కాలుష్యంతో పాటుగా ఎందరో మరణాలకు కారణభూతం అవుతుంది ఇటువంటి సమయంలో పోలీస్ శాఖ వారు తీసుకున్న ఈ నిర్ణయం అందరూ స్వాగతించాల్సిందే. వేగం కన్నా ప్రాణం మిన్న. అలాగే ఆనందం కన్నా ప్రాణం మిన్న.డీజే ని కాదు చెవిలో బ్లూటూత్ పెట్టుకుని సంగీతం వింటూ ప్రయాణం చేస్తున్న ప్రతి ఒక్కరు తమ విధానాలను మార్చుకోవాలి. దీనిపై కూడా పోలీస్ వారు స్పందించాలి. చెవిలో బ్లూటూత్ పెట్టుకుని డ్రైవ్ చేయడం వల్ల వెనక కొట్టే హారన్ వినపడక, యాక్సిడెంట్ అయిన సందర్భాలు కోకోల్లలు. బ్లూటూత్ వాడకం ఎక్కువ అవ్వటం వల్ల కూడా చెవిలో జ్ఞాన కణాలు నశించిపోయి ఆడిటరీ నర్వ్ దెబ్బతిని చెవిటివారయ్యే అవకాశాలు చాలా ఎక్కువ.



- ఎన్.సి.హెచ్ కృష్ణ జ్యోతి.
సెల్: 9701429880

# అస్థిత్వ కోసం 75 ఏళ్లుగా పోరాటం

## చిన్న దేశమైనా సాంకేతికతతో ముందడుగు వేస్తున్న ఇజ్రాయెల్



పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు వైశాల్యంలో అతి చిన్న దేశమైనప్పటికీ.. సవాళ్లున్నా సాంకేతిక సాయంతో ఇజ్రాయెల్ ముందడుగు వేస్తుంది.దానికితోడు అమెరికా అండదండలు ఇజ్రాయెల్‌ను అభివృద్ధిపథంలో దూసుకుపోయేలా చేస్తున్నాయి.ఏడాది కాలంగా ప్రపంచమంతటా మీడియాలో ప్రధాన శీర్షికల్లో నిలుస్తోంది. తన అస్థిత్వం కోసం 75 ఏండ్లుగా పోరాటం చేస్తున్నది. ఇప్పటిదాకా కొన్ని యుద్ధాలను ఎదుర్కొంది. అయితే దాని ఉనికిని కొన్ని అరబ్ దేశాలు నేటికీ గుర్తించడం లేదు. కానీ సాంకేతిక సాయంతో, అమెరికా అండదండలతో అభివృద్ధిని సాధించింది. ఇరాన్ మినహా దాదాపు తన చుట్టూ ఉన్న అన్ని దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పుకుంది. కానీ ఇరాన్ ప్రోద్బలంతో హమస్, హెజ్బొల్లా, ఇరాక్, సిరియాలోని ఉగ్ర సంస్థలు, హౌతీ తిరుగుబాటుదారులు మాత్రం నిత్యం ఇజ్రాయెల్‌తో ఘర్షణకు దిగుతున్నాయి. గత ఏడాది అక్టోబర్ 7న హమస్ తీవ్రవాదులు ఇజ్రాయెల్‌పై ఆకస్మిక దాడికి పాల్పడటంతో పశ్చిమాసియాలో మొదలైన హింస.. ఈ నెల ఒకటిన ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ 200 వరకు ఖండాంతర క్షిపణులను ప్రయోగించడంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారిపోయాయి.

**మిత్రులే శత్రువులుగా మారారు..**

'నేడు అరబ్బులు తమ ఆయుధాలు విసర్జిస్తే.. హింస అంతమవుతుంది. ఒకవేళ యూదులు (ఇజ్రాయెల్) తమ ఆయుధాలను విసర్జిస్తే.. ఇజ్రాయెల్ దేశమే లేకుండా పోతుంది' అని 1970 దశకంలో ఇజ్రాయెల్ ప్రధాని గోల్డా మెయిర్ వ్యాఖ్యానించారు. ఒకప్పుడు తుర్కియే తరువాత ఇజ్రాయెల్‌ను గుర్తించిన రెండో ముస్లిం దేశం ఇరాన్. కానీ నేడు అది ఇజ్రాయెల్ బద్ధశత్రువుగా మారిపోయింది. దాని ప్రోద్బలంతోనే నేడు లెబనాన్‌లోని హెజ్బొల్లా, ఇరాక్, సిరియాల్లోని ఉగ్రవాదులు, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు నిత్యం ఇజ్రాయెల్‌పై కాలు దువ్వుతూనే ఉన్నారు. వీటికి తోడు పక్కలో బల్లెంలా పాలస్తీనాలోని హమాస్ అవకాశం దొరికినప్పుడల్లా ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతూనే ఉన్నది. శత్రువులను బలహీనపరచడం ద్వారా, మరికొందరు శత్రువులను స్నేహితులుగా మార్చుకోవడం ద్వారా ఇజ్రాయెల్ తన మనుగడ సాగిస్తున్నది. అమెరికా మద్దతు, తన సైనిక బలం, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, పటిష్ఠమైన గూఢచార వ్యవస్థ, నిఘా విభాగం, బలమైన ఆర్థిక వ్యవస్థ ఇజ్రాయెల్‌కు అత్యంత కీలకమైనవి. ఇక ఇజ్రాయెల్ పౌరులు మెరికల్లాంటివారు. ప్రతి ఒక్కరు క్రావ్ మాగా అనే యుద్ధ విద్యలో నైపుణ్యం పొంది ఉంటారు.

**సాంకేతికత సాయంతో ముందడుగు**

ఇజ్రాయెల్ జనాభా 90 లక్షలు మాత్రమే. దేశంలో అత్యధిక భాగం ఎందుకూ పనికిరాని ఎడారి ప్రాంతమే. సముద్రపు జలాలను మంచినీరుగా మార్చే సాంకేతికత, తుంపర సాగుతో బీడు భూములను సాగుకు యోగ్యమైనవిగా మార్చేశారు. ప్రపంచవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ సాంకేతికతను అందిస్తున్న కంపెనీల్లో 40శాతం ఇజ్రాయెల్‌కు చెందినవే ఉన్నాయి. తనకున్న ఇంజినీరింగ్ నైపుణ్యంతో ముడిసరుకు, ఇంధన వనరులు, చిన్న మార్కెట్లు వంటి అన్ని సవాళ్లను ఇజ్రాయెల్ ఎదుర్కోగలిగింది. ప్రపంచవ్యాప్తంగా ఆయుధాలను ఎగుమతి చేస్తున్న 10 టాప్ దేశాల్లో ఇజ్రాయెల్ ఒకటి.

**అమెరికా అండ దండలు...**

ఇజ్రాయెల్ ఏర్పడిన నాటి నుంచి దానికి అమెరికా బలమైన మద్దతుదారుగా ఉన్నది. తనపై ఒకేసారి వందల సంఖ్యలో రాకెట్లు, క్షిపణుల వర్షం పడినాసరే విజయవంతంగా తిప్పికొట్టగల ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థను కూడా అది అమెరికా సాయంతోనే తయారు చేసుకున్నది. అమెరికా ఏటా 3.8 లక్షల కోట్ల డాలర్ల విలువైన సైనిక సాయాన్ని ఇజ్రాయెల్‌కు అందిస్తున్నది. ఈ నెల ఒకటిన ఇరాన్ క్షిపణుల దాడులను అడ్డుకోవడంలో అమెరికా సాయమందించింది.



- ఏలే మహేష్ నేత
సీనియర్ జర్నలిస్ట్,
V3 న్యూస్ ఛానల్,
విశ్వంభర దిన పత్రిక
సెల్ .9705646377

## నానీల చిత్రాలు

కాలమా కాస్తాగు!
బాల్యంలోకి వెళ్లొస్తాను...
జ్ఞాపకాలు
పిలుస్తున్నాయి.

నీవొస్తేనే!.. పిల్లలు
కాగితం పడవలౌతారు
ఏం మాయ చేసావే!
వాన!!...

కిటికీలకు
తలుపుల్లేవు...
ఇంట్లోకొచ్చి సందడి చేశాయి
గాలీ...వాన....

అతడు
తోటమాలి...
అక్కడ పెరిగే మొక్కలకు
అతడే తల్లీ ...తండ్రి...

వీధి చివర
పూదోట!..
అక్కడికెళ్ళగానే
నేనూ ఓ తూనీగనౌత!!

అంత వానలోనూ
ఇంటికొచ్చేసాము
నాకూ చెల్లాయికి
నాన్నే గొడుగు.

నిచ్చల కటాకమే
నిలువుటద్దం...
నిద్రలేచిన
సూర్యుడికి

అమ్మ నీడన
ఎదుగుతున్నావ్!
కడదాకా అమ్మకు
తోడూ... నీడా...
నువ్వే మరి!!

కవితో ఆవాసమే
అతన్ని కవిగా మార్చింది
కవిత్వం
ఓ....ఆల్కెమి.

-ఎ.నాగాంజనేయులు
సెల్: 9959017179.
కర్నూలు.

# బిక్షమయ్య గౌడ్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** గందమల్ల నీటి విడుదలపై మాజీ బీఆంఎస్ ఎంఎల్ఏ లు మాట్లాడడంపై యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి మండిపడ్డారు. మాజీ ఎం ఎల్ ఏ బిక్షమయ్య గౌడ్ మతిభ్రమించి మాట్లాడు తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ ఉంచితే ప్రాజెక్టుకు ప్రమాదం ఉందని డ్యాం సేఫ్టీ నిపుణుల సూచన మేరకు కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రభుత్వాన్ని ఒప్పించి ఆలేరు నియోజకవర్గానికి తపాస్ పల్లి నుండి మరియు మల్లన్న సాగర్ మరియు నవాబ్ పేట రిజర్వాయర్ల నుండి ఆలేరు నియోజకవర్గంలో నీటిని పారిస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించి పిచ్చి లేసి నాలుగు గోడల మధ్య తమ ఉనికిని కాపాడుకోవడం కోసం కేసీఆర్, కేటీఆర్ ల మెప్పు కోసం మాట్లాడుతున్నారన్నారు.నువ్వు ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత తపాస్ పల్లి రిజర్వాయర్ దగ్గరకు వెళ్లి అగ్గిపెట్టే హరీష్ రావు నీళ్లు దొంగతనంగా తీసుకుపోయిన దాన్ని పరిశీలించిన సంగతి, కాలేశ్వరాన్ని సందర్శించింది కూడా మర్చిపోయావా అని ఎద్దేవ చేశారు. నీవు కూడా వాస్తవాలు మాట్లాడకుండా దొంగల గుంపులో చేరి వాళ్లకు వత్తాసు పలకడం మంచిది కాదన్నారు. ఎవరు మంచి పని చేసినా దానిని హర్షించాలి కానీ ఆలేరు నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత ఇలా మాట్లాడితే సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని యాస లక్ష్మా రెడ్డి సూచించారు. పాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కందడి అనంత రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులుగౌడ్, మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, పాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పోతగాని మల్లేశం, కందడి దశరథ రెడ్డి, తండ శ్రీశైలం, బాషబోయినపాపయ్యయాదవ్,ఎలగందులశ్రీను పాల్గొన్నారు.

# అందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు

- రేపటితో ముగియనున్న ఫైలట్ ప్రాజెక్టు వివరాల సేకరణ
- వన్ స్టేట్ - వన్ కార్డ్ ద్వారా రేషన్, ఆరోగ్య సేవలు
- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** భవిష్యత్‌లో తెలంగాణ ప్రభుత్వం అందించే ఏ సంక్షేమ పథకమైనా వన్ స్టేట్ వన్ కార్డ్ ద్వారానే అందిస్తామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. రేపటితో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ఫైలట్ ప్రాజెక్టు ముగింపు ఉండటంతో అధికారులతో మాట్లాడారు. 119 నియోజకవర్గాల్లో 238 గ్రామాలను ఎంచుకుని డిజిటల్ సర్వే నిర్వహించామన్నారు. ఫైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన మహేశ్వరం మండలం పెద్దమ్మతండాలో డిజిటల్ సర్వే రేపటితో ముగియనుందన్నారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి రేషన్, ఆరోగ్య సేవలు, రైతుబంధు, ఫించన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ డిజిటల్ కార్డు ద్వారా అందిస్తామని లక్ష్మారెడ్డి తెలిపారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఆధార్ సహా ఏదైనా గుర్తింపు కార్డులను అధికారులకు చూపితే డిజిటల్ ఫోటో తీసుకుంటారని కే ఎల్ ఆర్ చెప్పారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలుకు ఈ డిజిటల్ కార్డులు దోహదపడతాయని కేఎల్ఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



విశ్వంభర, కూకట్‌పల్లి : దేవి నవరాత్రులులో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసపేట నల్ల పోచమ్మ అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పగుడాల బాబురావు తదితరులు ఉన్నారు.

# మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేస్-2 లో మార్పులు చేయాలి

శ్రీరాములు అందెల



**విశ్వంభర, బడంగ్ పేట్:** మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేస్ 2 లో మార్పులు చేయాలి అని మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగోల్ నుండి ప్రారంభమై ఎల్బీనగర్, మందమల్లమ్మ, చాంద్రాయణగుట్ట, ఆరంగర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కిలోమీటర్లు ఉంటుందని కారిడార్ 9 శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40 కిలోమీటర్లు అనగా 4 , 9 కారిడార్లు కలిపితే 76 కిలోమీటర్లు గా ప్రకటించారు. కారిడార్ 4 , 9 రూటును మార్చాల్సిందిగా దానికి గాను నాగోల్ - ఎల్బీనగర్- మంద మల్లమ్మ - బాలాపూర్ చౌరస్తా - శివాజీ చౌక్ - ఆర్ సి ఐ మీదుగా శంషా బాద్ ఎయిర్పోర్ట్ - మహేశ్వరం గేట్ - కందుకూర్ ఫోర్త్ సిటీ వరకు కొత్త రూట్ మ్యాప్ ను ప్రతి పాదించారు. ఈ కొత్త రూట్ మ్యాప్ ద్వారా 76 కిలోమీటర్లు మెట్రో లైన్ కేవలం 41 కిలో మీటర్లతో పూర్తి చేయవచ్చని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డికి వినతి పత్రం, కొత్త రూట్ మ్యాప్ ను అందజేశారు. దానికి గాను కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగల హేమలత రాజు గౌడ్, తుక్కు గూడ మున్సిపల్ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పెంద్యాల నరసింహ, కౌన్సిలర్ కాంటెకర్ మధుమోహన్, కార్పొరేటర్లు బిక్షపతి చారి బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**విశ్వంభర, రంగారెడ్డి:** షాద్ నగర్ పట్టణంలో జానం పేట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారి ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగత్తులో సర్వ మానావళి పై జగన్మాత ఆశీస్సులు ఉండాలని అన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే భీష్మ కిష్టయ్యలను సన్మానించారు. కొంకళ్ళ చెన్నయ్య, అగ్గనూర్‌బస్వం, చెంది తిరుపతిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్కయ్య, వెంకట్‌రెడ్డి, పోలేపల్లి సందీప్, ప్రదీప్, గంగమోనిసత్తయ్య, లింగారెడ్డి, గూడఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపుల నిర్మూలన చేసిన గ్రామాలకు రూ.10 లక్షలు

## కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**విశ్వంభర, మునుగోడు నియోజక వర్గం:** ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రతి ఒక్కరు తాగుడు ఆలోచన మానుకోవాలని మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా బెల్ట్ షాపులను నిర్మూలించాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆలోచనకు ఆచరణకు గ్రామాలకు గ్రామాలే కదిలి వస్తున్నాయి. గ్రామాలలో బెల్ట్ షాప్ నిర్మూలన కమిటీలు నిర్వహించుకుని బెల్ట్ షాపులు నిర్వహించకుండా చూస్తున్నారు గ్రామస్తులు...బెల్ట్ షాపులు నిర్మూలించిన గ్రామాలకు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారు ఎమ్మెల్యే...మునుగోడు మండలం రావి గూడెంలో బెల్ట్ షాపులు నిర్మూలించినందుకు కమిటీ సభ్యులను మునుగోడు లోని వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో సన్మానించి అభినందనలు తెలిపారు.. వెంటనే రావి గూడెం గ్రామ అభివృద్ధికి పది లక్షల నిధులు మంజూరు చేశారు... బెల్ట్ షాపులను నిర్మూలించిన కమిటీ మెంబర్లైన మహిళల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు... మీరు తీసుకున్న బెల్ట్ షాపుల నిర్మూలన నిర్ణయం వల్ల ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసుకుంటున్నారని తాగుడు జోలికె వెళ్లట్లేదని ఆనందం వ్యక్తం చేశారు... గ్రామాలలో ఎక్కడ పడితే అక్కడ బెల్ట్ షాపులు ఉండడంవల్ల యువత మద్యానికి బానిసై చెడు వైపు వెళ్తున్నారని కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. ఎట్టి పరిస్థితులలో బెల్ట్ షాపులు మూసివేయాల్సిందేనని, ఉదయం నుండి సాయంత్రం వరకు తాగుడు అరికట్టాల్సిందేనని తేల్చి చెప్పారు.

# విబిజీ ఫౌండేషన్ బతుకమ్మ సంబరాలు



**విశ్వంభర, సరూర్‌నగర్:** జ్యోతి క్లబ్ వేదికగా విబిజి ఫౌండేషన్ వనిత విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త. ఈ సందర్భంగా విబిజి ఫౌండేషన్ చైర్మన్ మడిపడిగే రాజు సుజాత గుప్తాను ఘనంగా సన్మానించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం స్పాన్సర్స్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

# కలిసి మెలిసి ఉందాం.. కాలనీ అభివృద్ధికి కృషి చేద్దాం

## రాక్ టౌన్ కాలనీ సొసైటీ సర్వసభ్య సమావేశంలో వక్తలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఆదర్శ కాలనీగా అభివృద్ధి చెందుతున్న రాక్ టౌన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం సొసైటీ కార్యాలయం ప్రాంగణంలో జరిగింది. సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యక్షుడితో పాటు సొసైటీ ఉపాధ్యక్షుడు మణిపాల్ రెడ్డి,సంయుక్త కార్యదర్శి సూర్యనారాయణ, కోశాధికారి జి.నాగరాజు, సలహాదారులు మోహన్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు మాట్లాడారు. వీరితో పాటు పలువురు సొసైటీ కార్యవర్గ సభ్యులు, సాధారణ సభ్యులు కూడా కాలనీ సమస్యలు, సొసైటీ పని తీరుపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు స్వాతంత్ర్య సమరయోధుడు, రిటైర్డ్ డీఎస్పీ చంద్రప్రకాష్, సొసైటీ సభ్యుడైన సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మహానది పత్రిక ఎడిటర్ మామిడి సోమయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు బి. మాధవ రెడ్డి,పి. రాంరెడ్డి,పి. సుదర్శన్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, నవీన్, రాంచంద్రా రెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాతకు ఎమ్మెల్యే దంపతుల పూజలు



**విశ్వంభర, భూపాలపల్లి:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారు త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తుల చేత పూజలు అందుకున్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఆదివారం అసోసియేషన్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దంపతులు హాజరయ్యారు. పండితులు వినయ్ శర్మ ఎమ్మెల్యే దంపతులు చే ప్రత్యేక పూజలు చేయించారు. దుర్గా దేవి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు చల్లగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, ఎండి చోటేమియా, నారగాని దేవేందర్, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పరకాల సన్నీ గౌడ్, సిద్ధార్థ్, సాయికిరణ్, శ్రీకాంత్, రోహన్, సాయిరాజ్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికునికి గాయాలు



**విశ్వంభర,భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణి కార్మికునికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. జయశంకర్ విగ్రహం వద్ద బైక్ పై వెళుతున్న సింగరేణి కార్మికుడు యూటర్న్ తీసుకుంటుండగా అతివేగంగా వస్తున్న ఇసుక లారీ ఢీకొనడంతో బైక్ పై నుండి ఎగిరి పడిన కార్మికునికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో త్రుటీలో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదాన్ని పసిగట్టి బైక్ పై నుండి ఒకేసారి పక్కకు దూకాడు. బైక్ పూర్తిగా లారీ కిందికి దూసుకు వెళ్లింది. బైక్ పై ఉన్న కార్మికుడు ఒక్కసారిగా పక్కకు దూకడంతో ప్రమాదం తప్పింది. సంఘటన స్థలం చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నాంపల్లిలో ఘనంగా దేవి నవరాత్రులు

## అన్నపూర్ణ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

### ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ



**విశ్వంభర,నాంపల్లి** : దేవి శరన్నవరాత్సోవములు సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయము వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని ఆదివారం అన్నపూర్ణాదేవి రూపంలో అలంకరణ చేశారు. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన గుజ్జుం శ్రీను, వినీల దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం దాదాపు వెయ్యి మందికి పైగా భక్తులకి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గోలి కృష్ణ, శిరందాసు నరసింహ, వెంకటేష్, గణేష్, కిరణ్, దినేష్, సాయి నాథ్, భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

# విజయదశమి ఏర్పాట్ల పరిశీలన



**విశ్వంభర, నిర్మల్:** నిర్మల్ జిల్లా కేంద్రంలో విజయదశమి ఏర్పాట్లను బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. నిర్మల్ పట్టణంలోని బంగల్ పేట మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో దసరా ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. నిర్మల్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి రానున్నారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌లకు పలు సూచనలు చేశారు. అధికారులు, బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# లెనిన్ నగర్ హుడా కాలనీ నూతన కమిటీ ఎన్నిక



**విశ్వంభర, మహేశ్వరం:** మీర్పేట్ కార్పొరేషన్ లెనిన్ నగర్ హుడా కాలనీ నూతన కమిటీ కార్యవర్గాన్ని బస్తీ వాసులు ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నికకు కొల్లూరు భీమేష్ సభకు అధ్యక్షత వహించారు. హుడా కాలనీ నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షులుగా గడియాముల కృష్ణ, అధ్యక్షులు గా షాగంటి పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా గంధమల్ల మహేష్, ప్రధాన కార్యదర్శి గా వంగరి నాగరాజు, సహాయ కార్యదర్శి గా ఎర్రగోటి అంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లూర్ శంకర్, కోశాధికారి గా మట్ట నర్సింగ్ రావు, సహాయ కోశాధికారి గా గడ్డమీది దశరథ్, కమిటీ సలహాదారులు గా కారమొల్ల రాకేష్, , మెంబర్స్ గా ఆకుల బాబురావు, కొల్లూర్ భీమేష్, ఎస్ కె షాహిద్, ఆర్గనైజింగ్ షాగంటి నవీన్ కుమార్, రవీందర్, గోపిదీపక్ సలహాదారులు జటావత్ రాజు, ఎన్ శ్రీకాంత్ జటావత్, లక్ష్మణ్ నాయక్, మహేందర్, ఏం నరేందర్, సదుబోతు కుమార్ చారి పాల్గొన్నారు.

# ఘనంగా ఓబన్న వర్ధంతి



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చెరువు మండలం ఇస్నాపూర్ Xరోడ్‌లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న వర్ధంతి కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెడ్డెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పాల్గొని పూలమాలవేసి నివాళులు అర్పించారు. బీసీల అభ్యున్నతికి కృషిచేసేందుకు తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన మన రేనాటి వీరుడు వడ్డే ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న ఆశయాలు అనుసరించడం అవసరం అని నీలం మధు తెలిపారు, రాలు కొట్టి జీవనోపాధి సాగిస్తూ కష్టాని నమ్ముకుని బ్రతికే వడ్డేర సోదరులకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, సబ్బండ వర్గాల అభ్యున్నతికి తను ఎలవేళల కృషిచేస్తానని అన్నారు, వడ్దేరులకు వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి జెరిపాటి జైపాల్ ని చైర్మన్‌గా నియమించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీశైలం, సుంకరి రవీందర్, అలకుంట కృష్ణ, కోడిధాల వెంకటేష్, సూర సతీష్,రమేష్, కుంచం కుమార్, శువరాజు, నరేష్, వైకుంఠం, అంజీ,సైదులు, వెంకన్న, మహేష్, అజయ్, రాఘవేంద్ర, వల్లెపు వెంకటేష్, శ్రీను, దస్తగిరి, మణికంఠ, వడ్డెర సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై నిరసన




**విశ్వంభర, ఉప్పల్:** ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మేకల మధుసూదన్ రెడ్డి నాయకత్వంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై వ్యతిరేఖంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మన అసోసియేషన్ పిలుపు మేరకు వెంటనే స్పందించి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు శ్రీనివాస రావు, శేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శుభాన్, గణేష్, కిషన్, సప్తగిరి రెడ్డి, సాగర్, రాజేషం, నరసింహా రెడ్డి, నరేందర్ చౌదరి, సంగమేశ్వర్ రెడ్డి, శ్రీహరి, అలాగే కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లలితా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో స్థానిక మార్కండేయ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పాఠశాల నుండి వచ్చిన వేద విద్యార్థులు వేద పారాయణాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, కృష్ణయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, పద్మశాలి సంఘం నాయకులు అప్పం శ్రీనివాస్, ఎంగలి యాదగిరి, గాజుల శ్రీనివాస్, మామిడి శెట్టి రవి, దోర్నాల ఈశ్వరయ్య, బావాండ్ల ఆంజనేయులు, గాజుల సత్యనారాయణ, వాస్, ఎంగలి రమేష్, మస్న మురళీధర్, ఎంగలి ప్రసాద్, భావండ్ల భాస్కర్, బోడలింగం, తిరుపతయ్య, అంజయ్య, శివకుమార్, ఎంగలి శ్రీధర్, పూజారులు చెర్కు శివ, అక్షయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఇసుక లారీలతో ప్రజలకు తప్పని తిప్పలు



**విశ్వంభర, భూపాలపల్లి:** పలిమెల మండలం పంకెన, మహాదేవపూర్ మండలం పెద్దంపేట ఇసుక క్వారీల నుండి అంబట్ పల్లి మీదుగా వెళ్తున్న ఇసుక లారీల వలన వచ్చే దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఇసుక లారీలు అధిక లోడుతో వెళుతుంటే రోడ్డు పై గుంతలు ఏర్పడడంతో పాటు లేస్తున్న దుమ్ముతో ప్రజల ఆరోగ్యం చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీ యజమానులకు, అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని, కనీసం ట్యాంకర్ తో నీటిని కొట్టడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాంకర్ ద్వారా నీటిని కొట్టించాలని గ్రామ ప్రజలు కోరారు.

# రావిరాల గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా

## అందెల శ్రీరాములు యాదవ్

**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల గ్రామంలో 402, 403 బూత్ లలో స్థానిక కౌన్సిలర్ శక్తి, ఇంచార్జ్ శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. ఇంటింటికి తిరుగుతూ బీజేపీ సభ్యత్వం నమోదును చేయించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ రావిరాల గ్రామంలో 2018 సంవత్సరంలో జరిగిన ఎమ్మెల్యే ఎలక్షన్ల నుండి 2024 పార్లమెంట్ ఎన్నికల వరకు ప్రతి ఎలక్షన్ లో భారతీయ జనతా పార్టీకి సంపూర్ణమైన మెజారిటీ ఇచ్చినందుకు రావిరాల గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. తుక్కుగూడ మున్సిపాలిటీ ప్రజలందరూ భారతీయ జనతా పార్టీ వైపు ఉన్నారని వారందరినీ భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులుగా సభ్యత్వ నమోదు ద్వారా చేర్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్, బూత్ అధ్యక్షులు లింగం రాజ్ కుమార్, ఉప్పునూతల యాదగిరి, గున్నాల శ్రీనివాస్, గ్రామ పెద్దలు, యువకులు, బీజేపీ బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# గర్భగౌరీ దేవి సన్నిధిలో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు



**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో శ్రీ గర్భగౌరీదేవి శరన్నవరాత్రులు నాలుగోరోజు శ్రీబాల త్రిపురాసుందరీ దేవి అలంకరణ ప్రత్యేక పూజల్లో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆలయ పురోహితులు మాడుగుల చంద్రశేఖర శర్మ. డీఎస్పీ దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించి, సాంప్రదాయ బద్ధంగా సన్మానించి అమ్మ వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత ను పురోహితులు డీఎస్పీ దంపతులకు వివరించారు. సంతానం ఇచ్చే తల్లి గర్భగౌరీదేవి అని, గర్భ గౌరీని పూజిస్తే సంతానం కలుగుతుందని తెలిపారు. అందరి సహాయ సహకారాలతో దేవాలయం నిర్మాణాన్ని పూర్తి చేయాలనే సంకల్పంతో మూడు సంవత్సరాలుగా దుర్గాదేవి శరన్నవరాత్రులు నిర్వహిస్తూవస్తున్నామని గర్భగౌరీ ఆలయ చైర్మన్ మాడుగుల చెంద్రశేఖర శర్మ తెలిపారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మోతం వెంకటేశ్వర్లు, మెరుగు నరసింహస్వామి, మెరుగు లక్ష్మణ్, కారెంగుల బాపురావు పాల్గొన్నారు.

# 4 మున్సిపల్ కార్పొరేషన్లుగా గ్రేటర్



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ నాలుగు ముక్కలు కానుంది. దాని పరిధి కూడా పెరుగుతుంది. ఔటర్ రింగు రోడ్డును సరిహద్దుగా చేసుకొని ఏర్పాటు చేయనున్న హైదరాబాద్ మహానగరాన్ని పరిపాలనా సౌలభ్యం, నిధుల లభ్యత కోసం ఒకటే కార్పొరేషన్ కాకుండా ఒకేసారి 4 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఓఆర్ఆర్ లోపల ప్రస్తు తం జీహెచ్ఎంసీతో పాటు శివారు ప్రాంతాల్లో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలను కలిపి కొత్తగా 4 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పా టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర పురపాలక, పట్టణా భివృద్ధిశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. ఓఆర్ఆర్ లోపల ఉన్న గ్రామ పంచాయతీలను సైతం పక్కనే ఉన్న ము న్సిపాలిటీల్లో విలీనం చేయ డంతో ఈ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. సుమారు 51 గ్రామపం చాయతీలను విలీనం చేసినట్లు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పదవీకాలంతో పాటు శివారు ప్రాంతాల్లోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలకు ఈ ఏడాది చివరి వరకు గడువు ఉండటంతో ఈలోపే గ్రేటర్ హైదరాబాద్‌ను ఎన్ని భాగాలు చేయాలో నిర్ణయిం చనున్నారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌ను 4 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తామని, నలుగురు మేయర్లు వస్తారని ప్రకటించడంతో మరింత స్పష్టత వచ్చింది.

### 4 కార్పొరేషన్ల పేర్లపై కసరత్తు:

ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ పరిధిలోకి ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని మున్సిపాలిటీలను విలీ నం చేసిన తర్వాత 4 కార్పొరేషన్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిం ది. ఓఆర్ఆర్ లోపలి భాగంగా ఉన్న మొత్తం ప్రాంతాన్ని 4 కార్పొరేషన్లు అంటగ%...% ™VÕ²దరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్, శంషాబాద్ పేర్లతో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పా టు చేస్తే అన్ని విధాలా సహేతుకంగా ఉంటుందనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ విస్తీర్ణం 625 చదరపు కి.మీలు ఉండగా, ఓఆర్ఆర్ వరకు విస్తరించడంవల్ల ఒకేసారి దాని పరిధి సుమారు 2500 చదరపు కి.మీ మేర అయ్యే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన డివిజన్లు చేసి, 4 కార్పొరేషన్లలో డివిజన్లు సమానంగా ఉండేలా నిర్ణయించిన తర్వాత ఎన్నికలకెళ్లే అవకాశం ఉంది.

### విలీనంతో ఓఆర్ఆర్ లోపల:

ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ, 7 కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలన్నింటినీ ఒక్కటిగా మార్చ డం ద్వారా ఓఆర్ఆర్ లోపల నివాసముండే జనాభా ఒకేసారి 1.80 లక్షల నుంచి 2 కోట్లకు చేరుకుంటుందని అంచనా. హెచ్ఎండీఏను ట్రిపుల్ఆర్ వరకు విస్తరిస్తే దాని కోసం కొత్తగా మాస్టర్‌ప్లాన్‌ను 2050 పేరుతో రూపొందిస్తే ప్ర ణాళికాబద్ధమైన పట్టణీకరణ హెచ్ఎండీఏ పరిధిలోనూ వస్తుందని ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ మహానగరాన్ని ఆయా ప్రాంతాలను బట్టి ట్రై సిటీస్‌గా అభివర్ణిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడు కొత్తగా మరో 'బాద్'గా శంషాబాద్ పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

# సీపీఎం నందనవనం శాఖ 9వ మహాసభలు



**విశ్వంభర, హైదరాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ నందనవన శాఖ 9 వ మహాసభలు ఆదివారం నందనవనం లో మంతాని యాదయ్య ఇంటి వద్ద జరిగాయి. కుంటిగొర్ల రాములు అధ్యక్షతన ఈ మహాసభలకు జరిగింది. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. నేడు అంతర్జాతీయ మార్కెట్లో డీజిల్ పెట్రోల్ ధరలు తగ్గుతుంటే భారతదేశంలో ధరలు పెరిగాయని తత్ ఫలితంగా నిత్యవసర వస్తువులపై భారం పడిందని అన్నారు. ఈ నెల 15 నుండి అధిక ధరలపై సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ప్రచార కార్యక్రమంలో పార్టీ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరగగానే దేశంలో ధరలు పెంచారని కానీ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా మన దేశంలో ధరలు తగ్గించలేదని ఇది దుర్మార్గమైన చర్య అని, కాకులను కొట్టి గద్దలకేసే చర్య అని చంద్రమోహన్ అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక అవినీతిని చట్టబద్ధం చేసే చర్యలకు పాల్పడిందని ఎన్నికల బాండ్ పేరుతో ప్రైవేట్ కంపెనీ పై ఒత్తిడి చేసి వారి నుండి డబ్బులు అక్రమంగా వసూలు చేశారని పత్రికలు మీడియా కోడైకొస్తుందని దానిపై మోడీ నోరు మెదపరని అన్నారు. తక్షణమే బీజేపీ అనుసరించే ప్రజా వ్యతిరేక చర్యలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం పిలుపునిచ్చింది. మహాసభలలో నూతన కార్యదర్శిగా యాదయ్యను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, శాఖ కార్యదర్శి యాదయ్య, సభ్యులు కమ్మర్ రాములు, రవి, లక్ష్మయ్య, గణేష్ పాల్గొన్నారు.

# వాగు వంకలు మింగేసి రియల్ దందా

## లాంచింగ్‌లో సినీ హీరోల సందడి

## ఏ ఆర్ యు రియాల్టీ, శ్రీ మిత్ర టౌన్షిప్ పై చర్యలేవి..

**వందనపు ఆంజనేయులు**



**విశ్వంభర చింతపల్లి:** చింతపల్లి మండల పరిధిలోని గడియ గౌరారం,వర్కాల గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు వెంచర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ ప్రధాన కార్యదర్శి వందనపు ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడియ గౌరారం, వర్కలా రెండు గ్రామాల పరిధిలో సుమారు 127 ఎకరాలలో ఏర్పాటు ఏ ఆర్ యు రియాల్టీ, శ్రీ మిత్ర టౌన్షిప్ ఏర్పాటు చేసిన వెంచర్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు...వెంచర్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో నాగమ్మ చెరువు మూడు కుంట కట్టల తో పాటు, వాగులు,వంకలు కుంట కట్టలకు కు సంబంధించిన 14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని పేర్కొన్నారు.అట్టి భూమిలో వెంచర్లు ఏర్పాటు చేసి సినీ హీరో శ్రీకాంత్, తరుణ్, తో పాటు మరి కొందరితో ఆదివారం లాంచింగ్ ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. గడియ గౌరారం గ్రామంలోని చెరువుకు ఈ వెంచర్ ప్రాంతం నుండి వాగు ప్రవహిస్తుందని సుమారు 200 ఎకరాల్లో ఉన్న ఈ చెరువు వాగు వంకలు మింగేయడంతో నీరు వచ్చే వీలు లేకుండా పోవడంతో . దీంతో భూగర్భ జలాలు ఎండిపోయి రైతులకు ఇబ్బందులు కలిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు..ఈ వెంచర్ లోపలి భాగంలో ఉన్న కుంట కట్టలను గతంలో తొలగించారని వారిపై కేసులు కూడా నమోదు చేసారని తెలిపారు..జిల్లా అధికారులు స్పందించి ఈ ప్రైవేటు వెంచర్ పై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, కొత్తూరు:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి బీజేపీ అధిక సీట్లు దక్కించుకోవాలంటే ప్రధాన మంత్రి మోడీ పాలనలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథ కాలను ప్రజల్లోకి వెళ్లి అవగాహనా కల్పిం చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య ముదిరాజ్ కోరారు. బీజేపీ సభ్య త్వాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తూరు మండల యువ మోర్చా అధ్యక్షులు శ్రీశైలం ఆధ్వర్యంలో ఎస్బీ పల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్ర మానికి అందే బాబాయ్య శ్రీకారంచుట్టారు. ఇందులో భాగం గా ఇంటింటికి తిరిగి సభ్య త్వాలు ప్రారంభిం చారు. ఆదివారం ఒక్కరో జునే 70 సభ్యత్వా లను నమోదు చేయడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో మంగలి రమేష్, మహేందర్‌రెడ్డి, గణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి పండుగ



**విశ్వంభర,కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రంలోని గానుగుమార్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కానుగుబాయ్ తండాలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్టించి సంవత్సరం అయినా సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున కళశాలతో ఊరేగింపు నిర్వహించి బొడ్రాయికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్క నాయక్, మాజీ ఉపసర్పంచ్ శారద పాండు నాయక్, గ్రామస్తులు నర్సింగ్, శ్రీను, లక్ష్మణ్, రాజు,వినోద్,జాన్యా నాయక్,దేవుల, రతన్,రాజా,సేవ్య,వెంకటేష్,శ్రీను,చందర్, వినోద్,గోపి,బాలు,హర్య,సురేష్,నాగార్జున్, లచ్చు,రవి,శంకర్,శ్రీకాంత్,సిద్ధూ పాల్గొన్నారు.

## శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో అన్నదానం

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల కేంద్రంలో శ్రీ శివగంగ రాజరాజేశ్వరి దేవి నవ రాత్రుల సందర్భంగా 4వ రోజు అన్నపూర్ణ దేవి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీ శివగంగ రాజరాజేశ్వరీ ఆలయ లో మోదీని ప్రభు లింగం, మోదీని సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివగంగ ఆలయ చైర్మన్ అల్లే కుమార్, ఆలయ పంతులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి ప్రయాణ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు



**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్ పల్లి కొత్త బస్టాండ్ లో టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులతో కలిసి బతుక్కమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దేవ రాజ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ఆచరిస్తూ ప్రయాణికులకు ఉల్లాసాన్ని కలిగించాలని ఉద్దేశంతో బస్టాండ్ కి వచ్చిన ప్రయాణికులతో బతుకమ్మ ఆడించడం జరిగిందని అన్నారు. ఇందులో భాగంగా మెట్ పల్లి డిపో మేనేజర్ దేవరాజ్, ట్రాఫిక్ సూపర్ వైజర్ శ్రీనివాస్, టీ సీలు, స్టేషన్ మేనేజర్, కంట్రోలర్‌లు నాగన్న సురేష్, నాగేష్, రాఘవ, రాజేష్ పద్మ, శ్రీనివాస్, ఉద్యోగులు బస్టాండ్‌లో ప్రయాణికులతో కలసి బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం జరిపినందుకు ప్రయాణికులు చాలా సంతోషం వ్యక్తపరిచినారు. ఇలాంటి కార్యక్రమాలు మరి ఎన్నో చేయాలని డిపో మేనేజర్‌కు సూచించారు.డిపో మేనేజర్ దేవరాజ్‌ని ప్రయాణికులు అభినందించారు.

# బీఆర్ఎస్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం

## కప్పాటి పాండురంగా రెడ్డి

**విశ్వంభర, మహేశ్వరం**, కందుకూరు: బీఆర్ఎస్‌కు రాజకీయ ప్రయోజనాలే తప్ప రైతుల ప్రయోజనాలు అవసరం లేదని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అందుగుల సత్యనారాయణ, సయ్యద్ అజీజ్, ఎగ్గిడి క్రిష్ణ, సభావట్ గణేష్ నాయక్ ఏకుల మహేందర్ కురుమ, ఉండల బాబురావు, ఎగిరి శెట్టి నర్సింహ అన్నారు. ఆదివారం కందుకూరు మండలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 22 లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ చేశామని, మరో 20 లక్షల మందికి ఆర్థిక వెసులుబాటు చూసుకుంటూ రుణమాఫీ చేస్తామని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలుపుతున్నా రుణమాఫీపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్పష్టమైన వివరాలు తెలియ చేస్తున్నప్పటికీ బీఅర్ఎస్ నాయకులు రైతులను గందరగోళ పరచి రాజకీయ పబ్బం గడుపు కుంటున్నారని విమర్శించారు. రైతులు బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న వారి సంఖ్య 42 లక్షలు కాగా 22,37,848 మాఫీ జరిగింది. మిగతా 20 లక్షల మందికి రుణమాఫీ చేస్తాం అని చెపుతున్నా రుణ మాఫీ పథకం పూర్తి అయ్యిందని ప్రభుత్వం ప్రకటించిందని బీఅర్ఎస్ నాయకులు అబద్దాలు చెప్పి ప్రజలను తప్పుతోవా పట్టిస్తున్నారని వారు మండి పడ్డారు. బీఅర్ఎస్ ప్రభుత్వం ఏకరానికి ఐదు వేల రూపాయలు రైతుబంధు ఇచ్చి ఐదు పథకాలను బొందపెట్టిందన్నారు. ధరణితో రైతన్నల ఇబ్బందులు పెట్టింది బీఅర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ధరణి వల్ల ఎటువంటి సమస్యలను పరిష్కరించకపోగా మరిన్ని కొత్త సమస్యలను నేటికీ సృష్టిస్తూనే ఉందన్నారు. బీఅర్ఎస్ ప్రభుత్వంలో భూసమస్యల పరిష్కారం కోసం సుమారు 5 లక్షల దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్లో ఉండి, మరో 8.50 లక్షల సాదా బైనామా దరఖాస్తుల స్థితి అదే అని ఈ భూసమస్యలకు పరిష్కారం చెప్పే నాధుడే లేకుండా చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా అన్నారు. ఫార్మ కంపనీల కోసం కందుకూరు మండల రైతుల భూములు సుమారుగా 50 లక్షలకు పైగా ధర పలుకుతుంటే కేవలం కొందరికి 7, కొందరికి 10, ఇంకొందరికి 12 లక్షల పరిహారం ఇచ్చి బలవంతంగా రైతుల భూములు బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్నది మీరు కారా మీకు తెలియదా అని సూటిగా ప్రశ్నించారు. అప్పుడు గుర్తుకు రాలేదా కందుకూరు అని అన్నారు. వందలాది మందికి లక్ష రూపాయల రుణ మాఫీ జరగ లేదని. అప్పుడు గుర్తుకు రాలేదా కందుకూరు. కందుకూరుకు డిగ్రీ కళాశాల ఇవ్వకపోగా వున్న రెండు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు రద్దు చేసినప్పుడు కందుకూర్ గుర్తకు రాలేదా అని అన్నారు.

# బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తాం



**విశ్వంభర, హైదరాబాద్:** ఈ నెల 9న శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం బ్రహ్మ కుమారీస్ నిర్వహణలో సాంస్కృతిక అధ్యాత్మిక కార్యక్రమాలు జరుగనున్నాయని సోదరి బ్రహ్మ కుమారి జయశ్రీ తెలిపారు. చిక్కడపల్లిలోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న ముగ్గురు దేవతలు లక్ష్మి, సరస్వతి, దుర్గాదేవిల చైతన్య ప్రతిష్ఠాపన చేసినతరువాత నృత్య సంగీత ప్రదర్శనలు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. బ్రహ్మకుమారి సభ్యు లు శక్తి స్వరూపం వివరాలు తెలుపుతారని, ప్రముఖుల ప్రసంగాలు వుంటాయని జయశ్రీ తెలిపారు.

## సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు మానుకోవాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమ వేదిక జిల్లా అధ్యక్షులు కొండేటి మురళి విచ్చేశారు. తెలంగాణ ఉద్యమ ఫోరం, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని రైల్వే స్టేషన్ వెనుక ఉన్న 360 ఎకరాల భూమి రైతుల నుండిఅబద్ధపు మాటలతో కొనుగోలు చేశారని, ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాననడం సరికాదని, వీలుంటే డ్రైపోర్ట్, లాజిస్టిక్ పార్కు, గోదాములు ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రామన్నపేట మండల కేంద్రం పరిదిలోని గ్రామాలకు సిమెంట్ ఫ్యాక్టరీ ప్రభావం ఉంటుందని, శబ్ద, వాయు, నీటి కాలుష్యము వల్ల పంట నష్టం, జీవ జాతులు నశిస్తాయని, భవిష్యత్తులో ప్రజలపై తీవ్ర ప్రభావం ఉంటుందని, ప్రజలు అనారోగ్యానికి గురవుతారని, రాజకీయాలకు అతీతంగా రాజకీయ నాయకులు, ప్రజలు చైతన్యవంతులు కావాలని, ఈనెల 23న ప్రజా సేకరణ కార్యక్రమంలో ఫ్యాక్టరీని వ్యతిరేకించాలని, పలువురు కోరారు. దాసరి బుచ్చిరెడ్డి, నోముల శేఖర్, ఒంటెద్దు రమేష్, ఒంటెద్దు మారయ్య, బట్టే చెన్నయ్య, చిందాల వెంకటేశం, నోముల శ్రీను, శ్యామల బుచ్చయ్య, శ్యామల లింగస్వామి, శ్యామల మారయ్య, ఒంటెద్దు బాలకృష్ణ, ఒంటెద్దు మారయ్య, యం. బక్కయ్య, గొరిగి రామకృష్ణ, గొరిగే శంకరయ్య, మల్గ నరసింహ, చందాల మహేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చిత్ర పటానికి పాలాభిషేకం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** ఇటీవల గందమల్ల రిజర్వాయర్ నుండి ఆలేరు పెద్దవాగుకు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య నీళ్లు విడుదల చేశారు. పెద్దవాగు పరివాహక పల్లెపహాడ్ అన్నదాతలు ఆనందంతో ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ సేల్ మండల అధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్య మాట్లాడుతూ గత పాలకుల పనితీరు ఎట్లుంది అంటే దున్నపోతు ఈనిందంటే దొడ్ల కట్టెయ్యి అన్న సామెతగా ఉందని ఎద్దేవ చేశారు. ఆనాడు ఆత్మకూరు(ఎం) మండలానికి రావాల్సిన నీళ్లను అప్పటి మంత్రి హరీష్ రావు తపాస్పల్లి నుండి సిద్దిపేటకు తీసుకపోతుంటే అప్పటి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలేరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తపాస్పల్లికి పోయి మా నీళ్లు మాకు కావాలటే అప్పటి బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదని అన్నారు. అదే విధంగా నవాబ్ పేట రిజర్వాయర్ నుండి అనాటి పాలకుర్తి ఎమ్మెల్యే దయాకర్ రావు నీళ్లు మలుపుకు పోతుంటే ఇక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు కూడా ఏ ఒక్కరు పట్టించుకోలేదని తెలిపారు. అప్పటి ప్రభుత్వ మంత్రులను అడిగే దమ్ము ధైర్యము ఆత్మకూరు(ఎం)మండలం బీఆర్ఎస్ నాయకులకు లేదని అన్నారు. కానీ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలన్న మంత్రులను ఒప్పించి మెప్పించి గంగమ్మను పరుగులు పెట్టిస్తుంటే ఇది చూసి ఓర్వలేక కొంతమంది బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక మనం చేయలేని పని కాంగ్రెస్ పార్టీ చేస్తుందని జీర్ణించుకోలేకపోతున్నారని మండల కాంగ్రెసు పార్టీ ఓబీసీ సేల్ మండల అధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్య మండిపడ్డారు.

## తహశీల్దార్ భవన ప్రారంభోత్సవానికి రానున్న పొంగులేటి



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల నూతన తాహసిల్దార్ కార్యాలయ భవన ప్రారంభోత్సవం సోమవారం జరుగుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్చ నాయక్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు మల్లురవి మరియు నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి వస్తున్నారని బిచ్చ నాయక్ తెలిపారు. నూతన ఎమ్మార్వో భవన ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, పార్టీ కుటుంభ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్చ నాయక్ కోరారు.

# జమ్మి చెట్టు నాటి సంరక్షించాలి

**విశ్వంభర, కడ్తాల్:** గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ మొదలు పెట్టిన ప్రతి దేవాలయం ఆవరణలో జమ్మి చెట్టు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మైసిగండి శివాలయం, రామాలయాల ఆవరణలో ఫౌండర్ ట్రస్టీ లక్ష్మీ శిరోలి పంతునాయక్, ఈవో స్నేహలత, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, మాజీ సర్పంచ్ తులసి రామ్, వేద పండితులు కలిసి జమ్మి చెట్టును నాటారు. ఈ సందర్భంగా లక్ష్మీ నర్సింహా రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు, హిందూ సంస్కృతి సంప్రదాయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న జమ్మి చెట్టును ప్రతి దేవాలయ ఆవరణలో నాటాలనే సంకల్పంతో మొదలు పెట్టిన ఈ కార్యక్రమం తెలంగాణ వ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్త, కర్మ, క్రియ అయిన సంతోష్ కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, గ్రీన్ ఇండియా చాలెంజ్ కోఆర్డినేటర్లు సతీష్, రాజు, మాజీ వార్డు సభ్యులు రామ్ దాస్ నాయక్, మాదారం మహేష్, బాచిరెడ్డి అశోక్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# షార్ట్ ఫిల్మ్స్‌తో అందరిని ఆకట్టుకుంటున్న యువకులు

## జిఎస్ టివి ఎంటర్టైన్మెంట్, విక్టరీ యాక్టింగ్ అండ్ కల్చరల్ అకాడమీ

## ప్రతిభ గల యువకులకు అవకాశం, సినిమా పై ఉన్న మక్కువతో చిన్న చిత్రాలు



**విశ్వంభర, చండూర్:** సినిమాల పై ఉన్న మక్కువతో చండూర్ జిఎస్ టివి ఎంటర్టైన్మెంట్, విక్టరీ యాక్టింగ్ అండ్ కల్చరల్ అకాడమీ అద్భుతాలు సృష్టిస్తున్నారు. జిఎస్ టివి ఎంటర్టైన్మెంట్, విక్టరీ యాక్టింగ్ అండ్ కల్చరల్ అకాడమీ అనే ఒక ప్లాట్ ఫామ్ ను ఎంచుకొని మంచి ప్రతిభను చాటుతున్నారు, గానుగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అద్భుతమైన సందేశాత్మక చిన్న చిత్రాలను అందిస్తూ అందరి మెప్పు పొందుతున్నారు. గంలిజాయి, డ్రలిగ్స్, అలిసాంఘిక కార్యక్రమాలు, ఈవ్‌లి టీసింగ్ , మలిద్యపానం, ధూలిమపానం , రక్తదాన, అవయవ దాన కార్యక్రమాలపై ప్రజలను చైతన్యపరురుస్తూ అవగాహన కల్పించే పాత్రలను తీసి సమాజానికి మంచి సందేశాలను అందిస్తున్నారు. వీరు ఇటీవల తీసిన మిస్టరీ తెలుగు వెబ్ సిరీస్ అందరిని ఆకట్టుకొని ముందుకు సాగుతుంది. మల్టీ టాలెంటెడ్ యాక్టర్ గానుగ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరెన్నో సామాజిక చిత్రాలను రూ పొందించి మంచి సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తామని అన్నారు. ప్రతిభ గల యువకులకు అవకాశం కల్పిస్తూ, వారిలో ఉన్న నటనను వెలికితీయడంలో ముందున్నారు. వీరు తీసిన సిరీస్‌లు మంచి ప్రేక్షక ఆదరణ పొంది దూసుకెళ్తున్నాయి. పోలీస్, రాజకీయ, ప్రజలు వీరిని అభినందిస్తున్నారు.

# కాలంతో పోటీ పడతున్న ఫుడ్ డెలివరీ బాయ్స్

**వేగంగా లక్ష్యాలకు చేరాలంటూ సంస్థల ఒత్తిడి**

**కష్టాల కడలిలో ఫుడ్ డెలివరీ బాయ్స్**

**హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ పరిశోధకుల అధ్యయనం**




**విశ్వంభర, హైదరాబాద్:** మార్నింగ్ టిఫన్ నుంచి రాత్రి భోజనం వరకూ ఇళ్లకు, ఆఫీసులకు నిర్విరామంగా ఫుడ్ డెలివరీ చేస్తున్న వారు సమయంతో పోటీ పడుతున్నారు. వారితో పని చేయించుకుంటున్న సంస్థలు వేగంగా లక్ష్యాలకు చేరాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. దీంతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ ?జామ్ లు, వర్షాల వంటి పరిస్థితుల్లో సమయానికి ఆహారాన్ని గమ్యస్థానాలకు చేర్చలేక పోతున్నారు. దీంతో కమిషన్ వెనక్కి తీసుకుంటున్నారు. పైకి రోజంతా తిరిగే ఉద్యోగమే అయినా, మెట్రో నగరాల్లో ఫుడ్ డెలివరీ బాయ్ ల జీవితాలు కష్టతరంగా మారాయని హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. కోహ్లి సెంటర్ ఫర్ ఇంటెలిజెన్స్ సిస్టమ్స్‌లో ప్రొఫెసర్ నిమ్మి రంగస్వామి, పరిశోధక విద్యార్థి తన్మయి గోయల్‌లు హైదరాబాద్, చెన్నై, ముంబయిలలో వేల మంది ఫుడ్ డెలివరీ బాయ్‌లను కలుసుకుని కష్టాలు అడిగి తెలుసుకున్నారు. వారు గిగ్ వర్కర్ల జాబితాలో ఉన్నా, కార్మిక చట్టాలు డెలివరీ బాయ్స్ కు వర్తించడం లేదని గుర్తించారు. ఈ అధ్యయనం కొద్దిరోజుల క్రితం అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితం కాగా, బార్సిలోనాలో ఇటీవల జరిగిన యూరోపియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ ఆంత్రోపాలజిస్ట్ సదస్సులో ప్రత్యేకంగా దీనిపై ప్రస్తావించారు. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ సంస్థల్లోని డెలివరీ బాయ్స్‌కు కనీస వేతనాలు ఇవ్వ డం లేదని ప్రొ.నిమ్మి రంగస్వామి, గోయల్ గుర్తించారు. ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లో ఒకేలా పరిస్థితులున్నాయని పేర్కొన్నారు. ఆయా సంస్థలు ఒక్కో డెలివరీకి కమీషన్‌తో పాటు ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నారు కానీ, అవి అందుకోవాలిఅంటే పెట్టిన టార్గెట్ పూర్తి చేయాలి. కానీ అది అందుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఒకరోజు గరిష్ఠంగా వందకు పైగా ఆహార పదార్థాలు రవాణా చేస్తే నగదు బహుమతి ఇస్తామంటున్నా, భారీ లక్ష్యం కావడంతో ఏరోజూ దక్కని పరిస్థితి ఏర్పడుతుం ది. వారికి రోడ్డు ప్రమాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు. వినియోగదారుడికి అనుకున్న సమయంలోగా ఆహారం చేర్చాలన్న లక్ష్యంతో ఫుడ్ డెలివరీ బాయ్స్ వేగంగా వెళుతున్నపుడు ప్రమాదాలైనా సంస్థలు పట్టించుకోవడం లేదని వాపోయారు. సకాలంలో ఆర్డర్ ను ఇవ్వనందుకు వినియోగదారులకు మరో ఆర్డర్ పంపిస్తున్నారు తప్ప, వారిని ఆసుపత్రిలో చేర్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులు ఆర్డర్లు రద్దు చేసినపుడు 'మీరు సకాలంలో ఆర్డర్ ఇవ్వలేదు, అందుకే రద్దు చేశారు' అంటూ నెపం వారిపై వేసి జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. డెలివరీ బాయ్స్‌గా ఎక్కువగా మైనర్ల నుంచి ఇరవై ఏళ్లలోపు ఉన్నవారినే ఎంచుకుంటు న్నారని రంగస్వామి చెప్పారు. గిగ్ వర్కర్ల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి కోరారు

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా క్రికెట్ పోటీలు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో ఆదివారం జరిగిన క్రికెట్ ఉత్కంఠ పోరులో గార్ల బయ్యారం పోలీస్ టీం పై బయ్యారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విజయం సాధించింది. బ్యాటింగ్ లో బయ్యారం ఎస్ఐ కొగిల తిరుపతి రాణించారు. చివరి దశలో పోలీస్ టీం చేతులెత్తేసింది. మ్యాచ్ ముగిసిన అనంతరం డీజే డాన్సులతో ఆడి "ఫ్రెండ్లీ పోలీస్" అనే పదానికి నిదర్శనంగా నిలిచిన గార్ల బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సైలు జీనత్ కుమార్, కొగిల తిరుపతి.

## ఒకే రాష్ట్రం.. ఒకే కార్డుతో బహుళ ప్రయోజనాలు

**కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు**

**విశ్వంభర, కోరుట్ల:** ఏ ప్రభుత్వము చేపట్టని విధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని ప్రభుత్వం నుంచి వచ్చే ఫలాలు అర్హులైన పేదలకు మాత్రమే అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి కూడా ప్రజలకు రేషన్‌కార్డులను ఇవ్వలేక పోయిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను తమ ప్రభుత్వం చేయకుండా ప్రజా పాలనను ప్రజలకు అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న కుటుంబ డిజిట్ కార్డులో ఇంటి మహిళే యజమాని అని, ఒకే కార్డులో రేషన్, ఆరోగ్య, ఇతర పథకాల వివరాలు పొందుపరచనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా కొన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాలను ఎంపిక చేసి డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ జరుగుతోందని తెలిపారు. కుటుంబ డిజిటల్ కార్డులో మహిళనే ఇంటి యజమానిగా గుర్తిస్తారని, ఇతర కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలు కార్డు వెనుక ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని అన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఐటీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం హాయంలో అనర్హులకు కూడా రేషన్ కార్డులు మంజూరు చేశారని, దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అర్హులైన పేదలకు మాత్రమే రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న వాటిపై సమగ్ర పరిశీలన జరిపి అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సింగరావు కోరారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ సేవలు ఆదర్శం

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి లయన్స్ భవన్‌లో జరిగిన రీజియన్ మీట్, జోన్ అడ్వైజరీ సమావేశాన్ని రీజియన్ చైర్ పర్సన్ లయన్ తెప్ప సీను, లయన్ జనార్ధన్ రెడ్డి సంపత్ తో కలిసి ప్రారంభించారు. రీజియన్ పరిధిలోని పదకొండు క్లబ్లల అధ్యక్ష్య కార్యదర్శులు తమ క్లబ్‌లు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రీజియన్ పరిధిలోని క్లబ్ లు తమ సభ్యుల సంఖ్యను పెంచాలని లయన్ తెప్ప సీను కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ చేపట్టిన సేవా కార్యక్రమాలను క్లబ్ సభ్యుల సేవలను, అధ్యక్ష్య కార్యదర్శుల కృషి పట్టుదల, సేవలను కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న లయన్స్ క్లబ్ లకు లయన్స్ క్లబ్ ఆమనగల్ ఆదర్శమని అన్నారు. నిరుపేదలకు సేవలు అందించేందుకు చేపట్టిన మెగా హెల్త్ క్యాంపులో తాను పాల్గొన్నానని వారి కృషి పట్టుదల ప్రశంసనీయమన్నారు. 39 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఆమనగల్ క్లబ్ తన రీజియన్ లో ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. జోన్ చైర్ పర్సన్ సంపత్ జనార్ధన్‌ను, క్లబ్ అధ్యక్ష్యులు లయన్ పసుల లక్ష్మా రెడ్డిని, కార్యదర్శి మహేశ్ ను, కోశాధికారి నర్సింహ్మను ఆయన అభినందించారు.క్లబ్ అధ్యక్ష్యులు లక్ష్మా రెడ్డి 2024 – 25 సంవత్సరాలకు చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. వివిధ క్లబ్‌ల అధ్యక్ష్య కార్యదర్శులు ఇతర సభ్యులు జిల్లా చైర్మన్ లయన్ జూలూరి రమేష్, జిల్లా కో ఆర్డినేటర్ కసిరెడ్డి రాంరెడ్డి, బండెల రామచంద్రా రెడ్డి, సభ్యులు వెంకట్ రెడ్డి, సురెందర్ రెడ్డి, నర్సింహ్మా రెడ్డి, క్లబ్ పీఆర్ఓ పాష పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ళ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 సంవత్సరంలో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కూరెళ్ళ చుట్టుప్రక్కల గ్రామాలైన తుక్కాపురం, పనక బండ, రాఘవాపురం, పాలడుగు, నర్సపురం, పుల్లాయగూడెం, రాగి బావి, తదితర గ్రామాల నుండి ఈ బ్యాచ్ లో మొత్తం 114 మంది విద్యార్థులతో పాఠశాలలో అతిపెద్ద బ్యాచ్ గా నెలకొంది. కూరెళ్ళ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగిందని కార్య నిర్వాకులు భాష బోయిన నరేష్, ఈధుల కంటి మహేందర్ రెడ్డి, అష్రఫ్ అలీ, కన్నెబోయిన మచ్చగిరి, కోట శ్రీనివాస్, తదితరులు పేర్కొన్నారు. పూర్వ ప్రధానోపా ధ్యాయులు కుంభం లక్ష్మి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు నగేష్, సైదిరెడ్డి, మల్లేశం, బ్రహ్మం, శర్మ, రఫీక్, కృష్ణయ్య, తదితరులతో పాటుగా 2003-2004 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు పూజలు



**విశ్వంభర, భూపాలపల్లి:** దేవి శరన్నవరాత్రుల సందర్భంగా అష్టాదశ శక్తిపీఠాలలో ఐదో శక్తిపీఠమైన జోగులాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించుకున్నారు. అలంపూర్ వచ్చిన మంత్రి శ్రీధర్ బాబుకి మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న మంత్రి శ్రీధర్ బాబు కి ఆలయ మర్యాదలతో ఈవో పురేందర్, పాలకమండలి చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి శ్రీధర్ బాబు కుటుంబం ముందుగా గణపతి పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయం చేరుకొని కుంకుమార్చనతో పాటు యాగశాలలో ప్రత్యేక యాగం నిర్వహించారు. మంత్రి తో పాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఉన్నారు.

## శరన్నవరాత్రుల సందర్భంగా చీరలు పంపిణీ



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీసాయి సేవా సమితి అధ్యక్షురాలు బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ మండల ప్రజలకు దేవి శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు అందరి మీద ఉండాలని కోరుకున్నారు. దేవి శరన్నవరాత్రులలో ఎవరైతే భక్తి శ్రద్ధలతో పూజిస్తారో వారికి సకల సంపదలు, సంపూర్ణ ఆరోగ్యం, శక్తి లభిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మ వారిని దర్శనం చేసుకొని ఆశీర్వాదం తీసుకోవాలని కోరారు. దేవి శరన్నవరాత్రుల సందర్భంగా లక్కీ డ్రా పెట్టామని లక్కీ డ్రాలో పేర్లు వచ్చిన వారికి శ్రీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గుండేగాని ఐలయ్య గౌడ్, సత్యనారాయణ, శ్రీలత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు .

## ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులుగా దుబ్బ శ్రీనివాస్

**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ నూతన అధ్యక్షులుగా దుబ్బ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గార్లపాటి నాగేంద్ర బాబు, కోశాధికారిగా గందే శ్రీనివాస్ గుప్తా, అన్ని విభాగాల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం హంటర్ రోడ్డు లోని గోల్డెన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, కార్యదర్శి వంగేటి అశోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన ఆర్య వైశ్య మహాసభ సంఘ అధ్యక్షులు, కమిటీ సభ్యులు జిల్లా లోని ఆర్య వైశ్యుల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్ నూతన కార్యవర్గ సభ్యులచే, అన్ని విభాగాల కార్యవర్గాలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తాటికొండ కృష్ణమూర్తి, వరంగల్ జిల్లా కన్వీనర్లు చకిలం ఉపేందర్, లీలా శ్రీధర్ రావు, లీగల్ సెల్ జిల్లా సభ్యులు ఐత ప్రసాద్, బాదం నాగరాజు, ఇరుకుళ్ల హరినాథ్, ఆర్య వైశ్య మహాసభరాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఉప్పుల శారద, జనరల్ సెక్రెటరీ కాచం సుష్మా, అడిషనల్ జనరల్ సెక్రెటరీ సామ్రాజ్య లక్ష్మీ, ఆర్య వైశ్య మహాసభ వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చొల్లేటి కళావతి, సెక్రెటరీ గార్లపాటి శ్రీలత, కోశాధికారి తాటిపెల్లి రాజమణి, అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ తాటిపెల్లి సుప్రియ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గట్టు ధనలక్ష్మీ, సంపూర్ణ, సుప్రియ పాల్గొన్నారు.

## గీత కార్మికులకు సేఫ్టీ మోకులు పంపిణీ



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ జిల్లాలోని భూపాలపల్లి మండలం ఎస్ఎం కొత్తపల్లి తాటి వనంలో ఆదివారం గీతా కార్మీకులకు శిక్షణ ఇచ్చి, సేఫ్టీ మోకులు అందించారు. తెలంగాణ గౌడ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేఫ్టీ మోకు కిట్లను ఎలా వాడాలనే దానిపై ప్రభుత్వ అధికారుల ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రబ్బాని, ఎస్ఎం కొత్తపల్లి సొసైటీ అధ్యక్షులు ఆరెల్లి రఘుపతి గౌడ్, ఉపాధ్యక్షులు నరేష్ గౌడ్, జిల్లా గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు ఏరుకొండ సంపత్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు బత్తిని శివ శంకర్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర నాయకులు కొండపాక సాంబయ్య గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దం రామచందర్ గౌడ్ పాల్గొన్నారు.

## అన్నపూర్ణ దేవి అలంకరణలో రాజరాజేశ్వరి దేవి



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల కేంద్రంలో శ్రీశివగంగ రాజరాజేశ్వరి దేవి నవ రాత్రుల సందర్భంగా 4వ రోజు అన్నపూర్ణ దేవి అలంకరణ సందర్భంగా శివగంగా ఆలయంలో రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో శివగంగ ఆలయ చైర్మన్ అల్లే కుమార్, మోదీని ప్రభు లింగం కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు, వీరేశం పంతులు, రాజు, జగదీష్, మణికంఠ, సాయి గణేష్, చేన్న పంతులు, కార్తీక్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బూడిద బిక్షమయ్య గౌడ్ మాటలు అవాస్తవం

**ఖండించిన గుండాల మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బూడిద బీక్షమయ్య గౌడ్ కాళేశ్వరం ద్వారా ఆలేరు నియోజక వర్గానికి సాగు నిరూ వస్తున్నాయని ఒక వీడియో మాట్లాడి గ్రూపుల్లో పెట్టడం జరిగిందని. అట్టి విషయాన్ని గుండాల మండల కాంగ్రెస్ పార్టీ తరుపున ఖండిస్తున్నామన్నారు. అయ్యా! బిక్షమయ్య పామ్ హౌస్ లో పండుకునే కేసీఆర్ ను పగిలి పోయినా కాళేశ్వరాన్ని పొగుడుతున్నవంటే నీ మతి భ్రమించి పిచ్చి కూతలు కూస్తున్నవని ఆలేరు నియోజక వర్గ ప్రజలకు, మా గుండాల మండల ప్రజలకు అర్ధమవుతున్నది అన్నారు. నేను కూడా రాజకీయాలలో ఉన్నా అనీ చెప్పుతూ నువ్వు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై మాట్లాతున్నావు గురించి మాట్లాడే అర్హత నీకు లేదన్నారు. రాజకీయాలకు నువ్వు పనికి రావు అని ఆలేరు నియోజక వర్గ ప్రజలు నిన్ను రెండు సార్లు ఓడించి ఇంటికి పంపినా నీకు బుద్ధి రాలేదు మండిపడ్డారు. కాళేశ్వరం లక్ష యాభై వేల కోట్లతో కేసీఆర్ నిర్మిస్తే మూడు సంవత్సరాలకే అది పగిలి పోయిన పగుళ్లు, కుంగిపోయిన పిల్లర్లు ,నీ కండ్లకు కనపడుతాలేవా, కాళేశ్వరం నుంచి ఆలేరుకు నీళ్లు వస్తున్నాయనీ అబద్దపు మాటలు ఎందుకు మాట్లాడుతున్నావ్ , బీఆర్ఎస్ ప్రభుత్వంలో తపాస్ పల్లి నుండి రాజాపేట మండలానికి నీళ్లు ఇవ్వకుండా హరీష్ రావు సిద్దిపేటకు నీళ్లు తరలించుకపోయినప్పుడు ఆలేరు నియోజక వర్గంలోని మీ టీఆర్ఎస్ నాయకులే హారతులు పట్టినారు. అప్పుడు నువ్వు వేరే దేశంలో ఉన్నావా నీ హయాంలో గానీ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గానీ గంధమల్ల చెరువులోనికి నీళ్లు తీసుకొని రావడానికి మీకు ఎందుకు చేతకాలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అపర భగీరథుడులా ప్రభుత్వాన్ని, మంత్రులను ఒప్పించి గంధమల్ల రిజర్వాయర్ నింపి దాని ద్వారా ఆలేరు నియోజక వర్గంలోనీ చెరువులు నింపుతూ ఆలేరు బిక్కేరు వాగులో నీళ్ళు వదిలినందున ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మరియు మోత్కూరు మండలాల రైతులకు నీళ్ళు అందించడం ద్వారా రైతుల కండ్లలో ఆనందం కనిపిస్తున్నదని పేర్కోన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా నకిరెకంటి మొగులయ్య



**విశ్వంభర, రామన్నపేట:** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీపసుకున్నది. రాబోవు కన్నికల్లో రాజ్యాధికారమే లక్ష్యంగా పావుల కదుపుతుంది. దీనిలో భాగంగా నకరేకల్ నియోజకవర్గ ఇన్చార్జిగా రామన్నపేటకుచెందిన నకిరెకంటి మొగులయ్యను బీజేపీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. తనకి ఈ అవకాశం కల్పించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డికి, సభ్యత్వ కన్వీనర్ రమచంద్ర రావుకు మొగులయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ నేరాలకు పాల్పడుతున్న కీలక నిందితుల అరెస్టు

**రూ.1.61 కోట్ల నగదు సీజ్**

**విశ్వంభర, హైదరాబాద్:** సైబర్ నేరాలకు పాల్పడుతున్న కీలక నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్‌లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆపరేషన్ చేపట్టారు. ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. 18 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరిపై రాష్ట్రంలో 45కుపైగా కేసులు ఉండగా.. దేశవ్యాప్తంగా 319 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.5 లక్షల నగదు, 26 సెల్‌ఫోన్లు, 16 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు.దేశవ్యాప్తంగా సెక్స్ టార్షన్, కొరియర్, పెట్టుబడి పేరుతో వీరు మోసాలకు పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ.1.61 కోట్ల నగదును సీజ్ చేశారు. తెలంగాణలో నమోదైన కేసుల్లో.. బాధితుల నుంచి ఈ కేటుగాళ్లు రూ.6.94 కోట్లు కాజేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఇండ్ల కూల్చివేతపై ఇంద్రవెల్లిలో నిరసనలు

**విశ్వంభర, ఇంద్రవెల్లి :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమలు కాకముందు నుంచి నివాసం ఉంటున్న గిరిజనేతరులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించి ఆదుకోవాలని గిరిజనేతరుల సంఘం, గిరిజనేతరుల ఐక్య వేదిక జిల్లా నాయకులు జాదే నాగోరావ్, మారుతి పటేల్ డోంగ్రే డిమాండ్ చేశారు.ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో శనివారం అధికారులు ఇండ్లను కూల్చివేయడంపై భగ్గుమన్నారు. ఇందుకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో రిలే దీక్షలు చేపట్టారు. వీరికి సంఘీభావంగా మండల కేంద్రంలోని వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

**కూష్మాండ అలంకారంలో పార్వతి దేవి**



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా పార్వతీ అమ్మవారు సరస్వతి అమ్మవారు కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తల్లి అమ్మవారిని దర్శించుకొని విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి ఆమెకు అమ్మవారి శేష వస్త్రాలు అందించారు. ఆలయ ఈఓ మారుతి, ఆలయ పర్యవేక్ష కులు బుర్రి శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయ కులు కామిడి లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, మెంగని అశోక్, పవన్ శర్మ, మహాదేవపూర్ కాంగ్రెస్ నాయకులు కోట రాజబాబు, వామన్ రావు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గండ్ర



**విశ్వంభర, భూపాలపల్లి:** నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 77 మంది సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.26 లక్షల 70వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీవి స్సార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు. ఆపదలో సీఎం సహాయ నిధి ఆపద్భాందవునిలా ఆదుకుంటుందని తెలిపారు. మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఈ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని, బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగ పరచుకోవాలని సూచించారు.



సంగెం గ్రామంలో వనం కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కేశంపేట మండల మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి. (విశ్వంభర, షాద్ నగర్)

# హైదరాబాద్‌లో దోపిడీ ముఠాల హల్‌చల్

**చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలు**
**సిటీ బస్సుల్లో ప్రయాణిస్తూ దొంగతనాలు**
**సీసీ ఫుటేజీల ఆధారంగా కేటుగాళ్లను గుర్తించే పనిలో పోలీసులు**

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాదులో దోపిడీ ముఠాలు హల్‌చల్ చేస్తున్నాయి. భార్యాభర్తలిద్దరూ అపరిచితులుగా వాహనాల్లోకి చేరి మన పక్కనే కూర్చుంటారు. అనుమానం రాకుండా విలువైన వస్తువులు కొట్టేసి క్షణాల్లో మాయమవుతారు. నగరంలో అంతర్రాష్ట్ర ముఠాలు ఎవరికి అనుమానం రాకుండా ప్రయాణికుల దృష్టిమరల్చి చోరీలకు పాల్పడుతున్నాయి. ఆటోలు, సిటీ బస్సులు, రైళ్లల్లో హల్‌చల్ చేస్తున్నారు. దోపిడీ చేసిన సొమ్మును రిసీవర్లకిచ్చి నగరం దాటిస్తున్నారు. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కేటుగాళ్లను గుర్తించే పనిలో పడ్డారు. మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లడానికి ఓ ప్రైవేటు ఉద్యోగి సిటీబస్సు ఎక్కాడు. టోలిచౌకి వద్ద ఇద్దరు యువకులు బస్సులోకి ఎక్కారు. షేక్‌పేట్ దర్గా వద్దకు చేరగానే బస్సు నుంచి ఆ ఇద్దరూ దిగిపోయారు. గచ్చిబౌలిలో దిగిన ఆ ఉద్యోగి తన పాకెట్?లోని పర్సు, మెడలో గొలుసు మాయమైనట్టు గుర్తించాడు. బేగంపేట్ వద్ద ఆటోలో ప్రయాణించిన భార్యాభర్తలు తన వస్తువులను చోరీ చేసినట్లు ఆటోడ్రైవర్ గుర్తించి ఫిర్యాదు చేశాడు. దిల్లీ, ఏపీ, హైదరాబాద్ ముఠాలు రెప్పపాటులో ఖరీదైన వస్తువులు దోచేసీ మాయమవుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఏపీలోని సత్తెనపల్లి, బాపట్ల, నగరంలోని మాంగార్‌బస్తీలకు చెందిన మహిళలు, పురుషులు ముఠాలుగా మారి ఇలా చేస్తున్నట్టు అంచనా. యూపీ, ఏపీ, తమిళనాడుకు చెందిన ముఠాలు నగర శివారు ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు తీసుకుంటారు. పగటి వేళల్లో ప్రయాణికుల్లా మెట్రోరైళ్లు, బస్సులు, ఎంఎంటీఎస్ రద్దీ ప్రాంతాల్లోకి చేరతారు. తమిళనాడుకు చెందిన ముఠాలు ట్రాఫిక్ కూడళ్లు, బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలను ఎంచుకుంటాయి. టైర్లలో గాలిపోయిందని, ఒంటిపై ఉమ్మిపడిందని దృష్టిని ఏమార్చి వస్తువులు దోచేస్తారు. ఏపీకి చెందిన ముఠాలు గృహిణులు, చిరువ్యాపారులను లక్ష్యంగా చేసుకుంటారు. తవ్వకాల్లో బంగారపు కడ్డీలు దొరికాయని అతి తక్కువ ధరకు ఇస్తామంటూ గాలం వేసి మోసగిస్తారు. యూపీ బ్యాచ్ ప్రయాణికులుగా నటిస్తూ లూటీ చేస్తారు. దిల్లీ ముఠాలు డబ్బును ఎరగా వేస్తారు. తమ వద్ద విదేశీ కరెన్సీ ఉందని ఆశచూపుతారు. నగరంలో ఈ తరహా ముఠాలు సుమారు 10 మందికి పైగా మోసగించినట్టు సమాచారం. ప్రజారవాణా, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించేటపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## అవాస్తవాలు చెప్పడం ఆపి రుణమాఫీ పూర్తి చేయండి..

**హరీశ్‌రావు బహిరంగ లేఖ**



**విశ్వంభర, హైదరాబాద్:** అవాస్తవాలు చెప్పడం మానేసి హామీ ప్రకారం రుణమాఫీ పూర్తి చేయాలని భారాస ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బహిరంగ లేఖ రాశారు. "రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నా రు. ఆయన మోసపూరిత వ్యూహాలు దేశమం తా పాకినట్లు కనిపిస్తోంది. ప్రజలను నమ్మిం చేందుకు సీఎం దేవుళ్లపై ప్రమాణం చేశారు. 31 రకాల షరతులు పెట్టి చాలా మందిని రుణమాఫీకి దూరం చేశారు. ఎస్‌బీఐలోనే 50శాతం రైతుల రుణాలు మాఫీ కాలేదని డేటా చెప్తోంది. రూ.2లక్షలకు మించి ఉన్న మొత్తాన్ని చాలా మంది రైతులు చెల్లించారు. వెంటనే రుణమాఫీని పూర్తి చేయాలి"అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముందుంటా: ఎంపీ కడియం కావ్య




**విశ్వంభర, హన్మకొండ:** హన్మకొండలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ డివిజన్ కార్యాలయంలో లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ 38వార్షిక సదస్సుకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో దేశంలో పేద ప్రజలు పేదలుగానే ఉన్నారని, ధనవంతులు మాత్రం మరింత ధనవంతులు మారుతున్నారని అన్నారు. ఎల్ఐసీ షేర్లను అమ్మడం ఎల్ఐసీనీ ప్రయివేట్ పరం చేయడంలో భాగమేనని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం అంబానీ, ఆధానిలకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇన్సూరెన్స్ చేసుకునేది పేద, మధ్యతరగతి ప్రజలు మాత్రమే నని, అలాంటి పేద ప్రజలు లైఫ్ ఇన్సూరెన్స్ చేసుకోవడానికి ముందుకు రాకుండా జీఎస్టీ విధించడం దుర్మార్గమని అన్నారు. బీజేపీ ఇప్పుడు ఎం చేసే పరిస్థితిలో లేదని, ఏదైనా చేయాలని చూసినా రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని, పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏళ్లవేళలా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారనికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

## వయోవృద్ధులను చిన్న పిల్లలతో సమానంగా చూసుకోవాలి

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**విశ్వంభర, వరంగల్:** కాజీపేట రెహ్మాత్ నగర్ లోని సీఎస్ఐ చర్చి 77సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వయోవృద్ధుల సన్మాన కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వయోవృద్ధులను శాలువాలతో సత్కరించారు. అనంతరం దేవి నవరాత్రి ఉత్సవలలో భాగంగా రెహ్మాత్ నగర్ లో ఏర్పాటు చేసిన దుర్గా మాత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ కన్న తల్లిదండ్రులను, వయో వృద్ధులను చిన్న పిల్లల వలే జగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడే వారిని మరింత శ్రద్ధగా చూసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆ ప్రభువు దీవెనలు ప్రతీ ఒక్కరిపై ఉండాలని, సంతోషామైన, ఆనందకరమైన జీవితాన్ని ఆస్వదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ రాజేశ్వరి దేవిగా అమ్మవారు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గడికోటలో నెలకొల్పిన అమ్మవారి మండపంలో ఆదివారం రాజరాజే శ్వరి దేవిగా అమ్మవారిని అలంకరించి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దేవి నవ రాత్రి ఉత్సవాల భాగంగా గడికోటలో ప్రతి సంవత్సరం మాదిరిగానే కూడా భక్తులు అమ్మవారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే మంటపానికి చేరుకుని ఉపవాసాలు ఉండి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

**సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ఉమ్మడి మెదక్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో సైతం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పెద్ద శంకరంపేటలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు దూసుకుపోతుందన్నారు. తెలంగాణ అభివృద్ధికి సైతం కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందని వివరించారు. సభ్యత్వ నమోదుకు యువత మహిళలు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్చార్జి లక్ష్మీ నరసయ్య నారాయణఖేడ్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి రవిశంకర్, బీజేపీ నాయకులు పత్రి రామకృష్ణ రజినీకాంత్, మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్, శ్రవణ్ కుమార్, సుభాష్, జాదు రమేష్, శివ పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, సంస్థాన్ నారాయణ పురం:** బీజేపీ సీనియర్ కార్యకర్త సదరుపెల్లి వెంకటేష్ అన్న సదరు పెల్లి ఆంజనేయులు అనారోగ్యంతో మరణించడం జరిగింది, వారి కుటుంబాన్ని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గూడూరు మంజు నాథ్ రెడ్డి పరామర్శించి 100 కేజీల బియ్యాన్ని అందజేసీ వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు నా వంతుగా సహాయ సహకారాలు చేయడానికి నేను ముం దుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సదరుపెల్లి వెంకటేష్, మారసాని సాయి, బొంగు మధు, పాలకుర్ల లింగస్వామి, సోమనబోయిన మహేష్, పాలకుర్ల సాయి పాల్గొన్నారు.

## కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి కుటుంబానికి పరామర్శ



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మాత్యులు కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న వారి కుటుంబాన్ని మహబూబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, రాజేశ్వర్ రావు వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరామర్శించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి నివాసంలో ఆదివారం పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాక్షించారు.

## గాజా నుంచి ఇజ్రాయెల్ పైకి రాకెట్లు

**ఇజ్రాయెల్ లో భద్రత కట్టుదిట్టం**

**గాజా సమీపంలో అదనపు భద్రతా బలగాల మోహరింపు**



**బీరూట్:** హమాస్‌తో యుద్ధానికి ఏడాది పూర్తవుతున్న వేళ.. గాజా నుంచి ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు దూసుకురావడం కలకలం రేపింది. మరోవైపు స్థానికంగా కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఇటీవల జఫ్ఫాలో ఇద్దరు సాయుధులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి.. ఆరుగురిని పొట్టన పెట్టుకున్న ఘటన మరువకముందే ఈ దాడి చోటుచేసుకుంది. బీర్‌షెవా సెంట్రల్ బస్‌స్టేషన్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో ఓ మహిళ మృతిచెందగా, దాదాపు 10 మందికి గాయాలయ్యాయి. నిందితుడిని పోలీసులు మట్టుబెట్టారు. ఇది ఉగ్రదాడేనని అధికారులు పేర్కొన్నారు. యుద్ధానికి ఏడాది పూర్తవుతున్న వేళ ముందుజాగ్రత్త చర్యగా.. ఇజ్రాయెల్‌లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. ముఖ్యంగా గాజా సమీప ప్రాంతాల్లో అదనపు దళాలను మోహరించినట్లు వెల్లడించింది. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉన్నామని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ క్రమంలోనే గాజా నుంచి రాకెట్లు దూసుకొచ్చాయి. గతేడాది అక్టోబరు 7నే దక్షిణ ఇజ్రాయెల్‌లోకి చొరబడిన హమాస్ ఉగ్రవాదులు.. దాదాపు 1,200 మందిని బలిగొన్నారు. దాదాపు 250 మందిని బందీలుగా తీసుకెళ్లారు. ఈ ఘటనకు గుర్తుగా సోమవారం స్మారక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇజ్రాయెల్‌వాసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అంతకుముందు.. సెంట్రల్ గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 23 మంది మృతి చెందారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఇజ్రాయెల్ దాడుల్లో ఏడాది కాలంలో గాజాలో దాదాపు 42 వేలమంది ప్రాణాలు కోల్పోయారు. అటు లెబనాన్ రాజధాని బీరుట్‌పైనా వైమానిక దాడులు ముమ్మరం చేసింది. హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. ఇటీవలి జరిపిన దాడుల్లో లెబనాన్‌లో రెండు వేల మంది మరణించారని ఆ దేశ వైద్యారోగ్యశాఖ వెల్లడించింది.

## హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేస్ 2లో మార్పులు చేయాలి

**అందెల శ్రీరాములు**



**విశ్వంభర మహేశ్వరం:** కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్ రెడ్డికి అందెల శ్రీరాములు వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి ని, మెట్రో రైల్ ఎండి కలిసి వినతిపత్రం అందజేస్తామని అందెల శ్రీరాములు అన్నారు. ఇటీవల మెట్రో రైల్ ఎండి ఎన్ వి ఎస్ రెడ్డి మెట్రో రైల్ ఫేజ్ 2 కి సంబంధించిన కొత్త కారిడార్లను ప్రకటించారు. అందులో కారిడార్ 4 విమానాశ్రయ మెట్రో కారిడార్ రూట్ మ్యాప్ ను విడుదల చేశారు. ఇట్టి రూట్ మ్యాప్ నాగోల్ నుండి ప్రారంభమై ఎల్బీనగర్, మందమల్లమ్మ, చాంద్రాయణగుట్ట, ఆరాంగర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కిలోమీటర్లు ఉంటుందని, కారిడార్ 9 శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40 కిలోమీటర్లు అనగా 4, 9 కారిడార్లు కలిపితే 76 కిలోమీటర్లు గా ప్రకటించారు. దీంట్లో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ కారిడార్ 4, 9 రూటును మార్చాల్సిందిగా దానికి గాను నాగోల్ ఎల్బీనగర్ మంద మల్లమ్మ , బాలాపూర్ చౌరస్తా , శివాజీ చౌక్ , ఆర్ సి ఐ మీదుగా శంషాబాద్ ఎయిర్పోర్ట్ మహేశ్వరం గేట్ కందుకూర్ ఫోర్త్ సిటీ వరకు కొత్త రూట్ మ్యాప్ ను ప్రతిపాదించారు. ఈ కొత్త రూట్ మ్యాప్ ద్వారా 76 కిలోమీటర్లు మెట్రో లైన్ కేవలం 41 కిలోమీటర్ల తో పూర్తి చేయవచ్చని కేంద్ర మంత్రివర్యులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డి కి వినతి పత్రం కొత్త రూట్ మ్యాప్ ను అందజేశారు. దానికి గాను కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి కి మెట్రో రైల్ ఎండి కి కూడా ఇట్టి రూట్ మ్యాప్ ను వినతిపత్రం అందజేయాలని శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగల హేమలత రాజు గౌడ్, తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పెండ్యాల నరసింహ, కౌన్సిలర్ కాంటెకర్ మధుమోహన్, కార్పొరేటర్లు బిక్షపతి చారి బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## యువతిని హత్య చేసి.. రేప్ సీన్ క్రియేట్ చేసిన కి'లేడీ' అరెస్ట్



**విశ్వంభర, హైదరాబాద్:** యువతిని హత్య చేసి.. పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు హత్యాచారం జరిగినట్టు రేప్ సీన్ క్రియేట్ చేసిన కిలాడీ లేడీని కూకట్‌పల్లి పోలీసులు కటకటాల వెనక్కి పంపారు. గత నెల 30న దారుణహత్యకు గురైన ప్రియాంక (20) కేసును పోలీసులు ఛేదించారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను బాలానగర్ డీసీపీ సురేష్ వెల్లడించారు. బోధన్ యేడేపల్లి గ్రామానికి చెందిన ప్రియాంక హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో ఉంటూ.. రాత్రిళ్లు ఫుట్‌పాత్‌పై నిద్రించేది. ఆ సమయంలో ఆమెకు మంజుల అనే మహిళతో పరిచయం ఏర్పడింది. ఫుట్‌పాత్‌పై ఉంటున్న తనకు భద్రత లేదని తన వెండి ఆభరణాలు మంజుల వద్ద భద్రపరిచింది. కొద్ది రోజుల తర్వాత తన వెండి ఆభరణాలు తిరిగి ఇవ్వాలని కోరగా.. మంజుల ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అంతు చూస్తానని బెదిరించి వెండి ఆభరణాలు తిరిగి తీసుకుంది. తనకు ప్రియాంకతో ప్రాణహాని ఉందని భావించిన మంజుల.. ఆమెకు సెప్టెంబరు 30న మద్యం తాగించి కేపీహెచ్‌బీ లోధా అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి బ్లేడుతో గొంతుకోసి హత మార్చింది. పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు ప్రియాంకను ఎవరో రేప్ చేసి హత్య చేసినట్టుగా సీన్ క్రియేట్ చేసి అక్కడి నుంచి పరారైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన పోలీసులను డీసీపీ సురేష్ అభినందించారు.

## భవిష్యత్తు కోసం భౌగోళిక వైవిధ్యాన్ని పరిరక్షించుకోవాలి

**దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొ.మణికొండ వేదకుమార్**

**దెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ జియో డైవర్సిటీ డే-24**



**విశ్వంభర, బషీర్ బాగ్** : అంతర్జాతీయ జియో డైవర్సిటీ డే-24 సందర్భంగా 'జియో హెరిటేజ్ ట్రయల్', 'టాక్ ఆన్ జియో డైవర్సిటీ'ని నగరంలోని ఫక్రుద్దీన్ గుట్ట(ఖాజా హిల్స్)లో దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ మణికొండ అధ్యక్షతన నిర్వహించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు కమతం మహేందర్ రెడ్డి, డైరెక్టర్(రిటైర్డ్), రామోజు హరగోపాల్, కొత్త తెలంగాణ చరిత్ర బృందా చక్కిలం వేణుగోపాల్ రావు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్(రిటైర్డ్) జి.ఎస్.ఐ.సోమా రామ్ మూర్తి, సీనియర్ సైంటిస్ట్,(రిటైర్డ్), హైడ్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్ ఎఆర్.రామ్ రాజ్, హైడ్, సకీనా, సేవ్ రాక్స్, జనాబ్ జాజిర్ హుస్సేన్, సభ్యుడు, సాలార్జంగ్ మ్యూజియం, వేముగంటి మురళీకృష్ణ, కెటిసిబి, శోభాసింగ్, కార్యదర్శి, ఎఫ్.బి.హెచ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎం.వేదకుమార్ మాట్లాడుతూ ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి 2022 సంవత్సరం నుంచి అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తున్నామని అన్నారు. దక్కన్ ప్రాంతం ముఖ్యంగా తెలంగాణ గొప్ప భౌగోళిక ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో పాండవుల కొండ(పాండవుల గుట్ట)ను మాత్రమే జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, భారత ప్రభుత్వం అధికారికంగా గుర్తించాయన్నారు. ఇప్పటికీ తెలంగాణలో మరెన్నో ప్రదేశాలు ఇలాంటి గుర్తింపుకు అర్హమైనవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.ప్రసాద్, మహేందర్ రెడ్డి, పర్యాటక శాఖ అసిస్టెంట్ ప్రొ.వై.సుభాష్ రెడ్డి, రెయిన్ వాటర్ హార్వెస్ట్ నిపుణుడు జనబ్ మహమ్మద్ అఫ్జల్, జనాబ్ ఇలియాస్ ఖాన్, సేవ్ నయాఖిల్లా, లయన్ ఎస్.ధనుంజయ, పి.నరహరి, కృష్ణ, మహమ్మద్, ఒమర్ అలీ, మహమ్మద్. సర్ఫరాజ్, బస్వరాజ్, అప్ప, ఎస్.వెంకట నారాయణ, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ డైరెక్టర్ కట్టా ప్రభాకర్, ఆక్స్ ఫర్డ్ పాల్గొన్నారు.



ఊరిలోని అందరి పెద్దల ఆశీస్సులతో ప్రతి సంవత్సరం భక్తుల మనసులు గెలుచుకొని పదిహేను సంవత్సరాలుగా పూజలను అందుకుంటున్న ఆర్కపల్లి గ్రామం మాడుగుల మండలం రంగారెడ్డి దుర్గామాత. నాల్గవ రోజు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని చూసేందుకు భారీగా భక్తులు హాజరయ్యారు.
- విశ్వంభర, మాడ్గుల

# మనది ప్రజాస్వామ్యం ముఖ్యమంత్రి ఎవరైనా కావచ్చు

## మాజీ సీఎం భూపేందర్ హుడా



**న్యూఢిల్లీ:** దేశంలో బీజేపీ హవా క్రమంగా తగ్గిపోతున్నది. గత పదేండ్లలో నాలుగైదు మినహా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కాషాయ జెండా ఎగురవేశాయి. అయితే ప్రభుత్వ వ్యతిరేకత పెరిగిపోతుండటం, మోదీ మేనియా పడిపోవడంతో ప్రతిపక్షాలు పుంజుకుంటున్నాయి. బీజేపీ గద్దెదించడమే అజెండాగా ఒక్కో రాష్ట్రంలో పాగావేస్తూ వస్తున్నాయి. తాజాగా ఎన్నికల ముగిసిన హర్యానా , జమ్ముకశ్మీర్‌లోనూ కమలం పార్టీ ప్రతిపక్షానికి పరిమితమవనుందని ఎగ్జిట్‌పోల్స్ స్పష్టం చేశాయి. హర్యానాలో బీజేపీ హ్యాట్రిక్‌కు బ్రేక్ వేసిన ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీని ఇవ్వనున్నాయని పేర్కొన్నాయి. దీంతో రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేదానిపై చర్చ నడుస్తున్నది. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నాయకురాలు కుమారి సెల్జా పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. సీఎం పీఠంపైసెల్జా కూర్చునేఅవకాశాలు ఎక్కువగా ఉందన్న చర్చనడుస్తున్నది. దానికోసం ఆమె కూడా జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ సీనియర్ నేత భూపిందర్ హుడా ఏమన్నారంటే.. మనది ప్రజాస్వామ్యం. ముఖ్యమంత్రి ఎవరైనా కావచ్చు. అయితే ఆ విషయాన్ని నిర్ణయించేది ఎమ్మెల్యేలు, పార్టీ అధిష్ఠానమని వెల్లడించారు. పార్టీ చెప్పినట్లుఅంతానడుచుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. తాము ఎన్ని స్థానాలు గెలుస్తామన్న దానిపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. అయితే మెజార్టీ సీట్లలో విజయం సాధిస్తామన్న నమ్మ ఉందని చెప్పారు. కాగా, ముఖ్యమంత్రి పదవి కోసం కుమారి సెల్జా, రణ్‌దీప్ సుర్జేవాలా గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇద్దరిలో అధిష్ఠానం ఎవరివైపు మొగ్గుచూపుతుందో చూడాలి మరి. హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. శనివారం ఒక విడతలో అన్ని సీట్లకు పోలింగ్ జరిగింది. హర్యానాను హస్తం పార్టీ చేజిక్కించుకుంటుందని, 44 నుంచి 61 స్థానాలు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు అంచనావేశాయి. ఈ నెల 8న ఓట్లను లెక్కించనున్నారు.

# ఆయుధాలపై ఆంక్షలు విధించడం సిగ్గుచేటు

## మాక్రాన్‌పై నెతన్యాహూ ఆగ్రహం



**జెరూసలెం:** ఇజ్రాయెల్-హమాస్ మధ్య ప్రారంభమైన యుద్ధం క్రమంగా మధ్యప్రాశ్చం మొత్తానికి విస్తరిస్తున్నది. హమాస్, హెజ్‌బొల్లా గ్రూప్‌లను తుదముట్టించడమే లక్ష్యంగా నెతన్యాహూ దళాలు ముందుకు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వేలాది మంద్రి ప్రజలు ప్రాణా లు కోల్పోయారు. ఐడీఎఫ్ దాడుల ధాటికి లక్ష లాది మంది నిరాశ్రయులై ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ఆయుధ విక్రయాలను నిలిపివేయాలంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ పిలుపునిచ్చారు. రాజకీయ పరిష్కారమే కీలకమని భావిస్తున్నట్లు చెప్పారు. గాజాలో పోరాడటానికి ఇజ్రాయెల్‌కు తాము ఆయుధ విక్రయాలను ఆపేస్తున్నామని చెప్పారు. కాల్పుల విరమణ పిలుపును నెతన్యా హు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇది ఇజ్రాయెల్ పొరపాటని, దాని భద్రతపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. యుద్ధం విద్వేషాలకు దారి తీసిందన్నారు. లెబనాన్ మరో గాజాలా మారకూడదని వెల్లడించారు. లెబ నాన్‌లో సరిహద్దులకు దళాలను పంపాలన్న నెతన్యాహు నిర్ణయాన్ని మాక్రాన్ తప్పుపట్టారు. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాక్రాన్ నిర్ణయాన్ని ఖండించారు. ఇరాన్ నేతృత్వంలోని అరాచక శక్తులతో ఇజ్రాయెల్ పోరాడతున్నదని, అందువల్ల ఇజ్రా యెల్ వైపు ప్రపంచం నిలవాలన్నారు. కానీ, మాక్రాన్‌తో సహా ఇతర పాశ్చాత్య నాయకులు ఇజ్రాయెలకుఆయుధ సరఫరాపై ఆంక్షలు విధిం చడం సిగ్గుచేటనిమండిపడ్డారు. హెజ్‌బొల్లా, హమాస్, హౌతీలపై ఇరాన్ ఆయుధ నిషేధం విధిస్తుందా అని ప్రశ్నించారు. గతేడాది అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడుల్లో వేలాది మంది ఇజ్రాయెలి పౌరులు మరణించారు. అందుకే తాము గాజా, లెబనాన్‌లో పోరాడుతున్నామని చెప్పారు. పాశ్చాత్య దేశాలు తమకు అండగా నిలిచినా.. లేకున్నా ఈ యుద్ధం గెలిచే వరకు ఇజ్రాయెల్ పోరాడుతుందని స్పష్టం చేశారు. కాగా, లెబనాన్ రాజధాని బీరుట్‌లోని ఫ్రెంచ్ బహుళజాతి కంపెనీ టోటల్ ఎనర్జీస్ గ్యాస్ స్టేషన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. దీంతో స్టేషన్‌లోభారీ అగ్నిప్రాం తం జరిగింది. ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి.

# మెరీనా బీచ్‌లో ఘనంగా ఐఏఎఫ్ ఎయిర్ షో



**చెన్నై:** చెన్నైలోని మెరీనా బీచ్‌లో భారత వైమానిక దళం ఆదివారం మెగా ఎయిర్ షోను ప్రారంభించింది. అక్టోబరు 8న ఇక్కడ జరగనున్న 92వ వైమానిక దళ దినోత్సవ ఏర్పాట్లలో భాగంగా ఈ షోను నిర్వహిస్తున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. వైమానిక ప్రదర్శనలో రఫేల్, సు-30, మిగ్, జాగ్వార్, తేజస్ మొదలైన 72రకాల విమానాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. హెలికాప్టర్‌ల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా పేర్కొన్నారు. భారత వైమానిక దళం గరుడ్ కమాండోలు విన్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, తమిళనాడు మంత్రులు, సీనియర్ వైమానిక దళ అధికారులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ నుంచి గోవాకు కొత్త రైలు ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



విశ్వంభర, హైదరాబాద్‌: హైదరాబాద్ మహానగరం నుంచి తరచూ గోవా టూర్‌కు వెళ్లే పర్యాటకుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే మరో కొత్త రైలును అందుబాటులోకి తెచ్చింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు రెగ్యులర్ సర్వీసులు సికింద్రాబాద్ నుంచి ఈ నెల 9న, వాస్కోడగామా నుంచి ఈ నెల 10న ప్రారంభమవుతాయి. సికింద్రాబాద్-వాస్కోడగామా (17039) రైలు ప్రతి బుధ, శుక్రవారాల్లో.. వాస్కోడగామా-సికింద్రాబాద్ (17040) రైలు ప్రతి గురు, శనివారాల్లో బయల్దేరుతాయి. ప్రస్తుతం సికింద్రాబాద్-వాస్కోడగామా మధ్య రెగ్యులర్ సర్వీసు (17603) అందుబాటులో ఉంది. అది, మంగళ, బుధ, శుక్ర వారాల్లో ఇది నడుస్తోంది. ప్రయాణికుల నుంచి తీవ్ర డిమాండ్ ఉండటంతో ఈ రైలు ఎప్పుడూకిటకిటలాడుతుంది. హైదరాబాద్ నుంచి వాస్కోడగామాకు మరో రైలు (17021) ఉంది. కానీ ఈ రైలు వారంలో ఒక రోజు మాత్రమే నడుస్తుంది. ఈ రైలులో టికెట్లు దొరకడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో కొత్త రైలు పర్యాటకుల ప్రయాణ అవకాశాల్ని పెంచనుంది. అదనంగా సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

# అకాలీదళ్ నేతతో ఘర్షణ ఆప్ నాయకుడిపై కాల్పులు



**చండీగఢ్:** శిరోమణి అకాలీదళ్ నేత, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇది వారిద్దరి మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఆప్ నాయకుడిపై అకాలీదళ్ నేత కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆప్ నేతను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. పంజాబ్‌లోని ఫజిల్కా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శిరోమణి అకాలీదళ్‌కు చెందిన మాజీ ఎంపీ జోరా సింగ్ మాన్ కుమారుడువర్దేవ్ సింగ్‌నోని మాన్‌శనివారం తన అనుచరులతో కలిసి పాఠశాలకు సంబంధించిన ఫైల్ క్లియర్ చేయమని అడిగేం దుకు బీడీపీవో కార్యాలయానికి వచ్చాడు. అయితే అధికారి నిరాకరించడంతో ఆగ్రహంతో బయటకు వెళ్లాడు. కాగా, బీడీపీవో కార్యాలయం బయట ఉన్న ఆప్ నేత మన్‌దీప్‌సింగ్ బ్రార్‌తో వర్దేవ్ సింగ్ వాగ్వాదానికి దిగాడు. ఈ సందర్భంగా వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలోఆగ్రహించిన వర్దేవ్ సింగ్ తనవద్ద ఉన్న గన్‌తో ఆప్‌నేత మన్‌దీప్ సింగ్, అతడి అనుచ రులపై కాల్పులుజరిపాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆప్ నేతను జలాలాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో లూథియానాలోని జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కాల్పుల్లో మరో ఆప్ కార్యకర్త కూడా గాయపడినట్లు సమాచా రం .మరోవైపు కాల్పుల సమాచారం గురించి తెలుసుకున్న ఫాజిల్కా సీనియర్ పోలీసు అధికారి వరీందర్ సింగ్ బ్రార్, జలాలాబాద్ చేరుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఇకపై ఆన్‌లైన్ బుకింగ్ భక్తులకు మాత్రమే శబరిమలకు అనుమతి..




**తిరువనంతపురం:** ఆన్‌లైన్ బుకింగ్ చేసు కున్న భక్తులను మాత్రమే శబరిమలకు అనుమతించాలని కేరళ ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. వచ్చే నెల నుంచి శబరి మలలో వార్షికమండలం-మకరవి లక్కు యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతనసమావేశం జరిగింది. శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులు ముందుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని సీఎంఓ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి రోజూ 80 వేల మంది భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపింది.

# ముంబైలో భారీ అగ్నిప్రమాదం.. ఒకే కుటుంబంలో ఏడుగురి సజీవ దహనం



**ముంబై:** మహారాష్ట్రలోని ముంబైలో ఘోర ప్రమాదం చోటుచేసుకున్నది. ముంబైలోని బెంబూర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు సజీవదహనమయ్యారు. బాధితుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. బాధితులను సమీపంలోని దవా ఖానకు తరలించేలోపే మృతిచెందారని అధికారులు తెలిపారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కార ణమని చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న షాప్‌లో మంటలు చెలరేగాయని తెలిపారు. క్రమంగా అవి మొదటి అంతస్తుకు వ్యాపించాయన్నారు. ఆ సమయంలో బాధితులంతా గాఢ నిద్రలో ఉండటం తో మరణించారని చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# క్రూరమృగాల దాడి.. ఇద్దరు చిన్నారుల మృతి

**లఖింపూర్:** ఉత్తర్‌ప్రదేశ్ ప్రజల్లో తోడేళ్ల భయం ఇంకా వీడలేదు. తాజాగా ఇప్పుడు చిరుత దాడులు మొదలైనట్లు అనుమానిస్తున్నారు. యూపీలోని లఖింపూర్ ఖేరీ జిల్లాలో వన్యప్రాణుల దాడిలో ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్లుగా పోలీసులు ఆదివారం వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం గంగాబెహర్ గ్రామానికి చెందిన సాజేబ్ (12) శారదానగర్ అటవీ ప్రాంతానికి సమీపంలో సైకిల్‌పై ఎరువుల బస్తాలను గ్రామానికి తీసుకు వెళుతున్నాడు. అదే సమయంలో అక్కడ మాటు వేసిన ఓ అడవి జంతువు బాలుడిపై దాడి చేసింది. అతడిని పొదల్లోకి ఈడ్చుకెళ్లింది. స్థానికులు, కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి గ్రామానికి 500 మీటర్ల దూరంలోని చెరకు తోటలో బాలుడి మృతదేహాన్ని గుర్తించినట్లు వారు చెప్పారు. బాలుడిపై చిరుత పులి దాడి చేసి ఉంటుందని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సంజయ్ బిస్వాల్ అనుమానం వ్యక్తం చేశారు. దానిని గుర్తించేందుకు అటవీశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నామని వెల్లడించారు. కాగా మరో ఘటనలో ఇదే జిల్లాలోని కుర్తైహా గ్రామంలోని ఓ ఇంట్లోకి చిరుత పులి చొరబడి రిజా బానో(3) అనే చిన్నారిని ఎత్తుకెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. బాలిక మృతదేహం ఘఘ్రా నదిలో లభ్యమైనట్లుగా పోలీసులు చెప్పారు. ఈ గ్రామం దుధ్వా టైగర్ రిజర్వ్ బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఇంతకు ముందు ఎప్పుడూ ఈ ప్రాంతంలో క్రూర జంతువుల సంచారం ఉన్నట్లు సమాచారం రాలేదని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

## మరొకరికి తీవ్ర గాయాలు

**విశ్వంభర, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్ లారీని ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పిప్పర్ వాడ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జైనథ్ మండలం కోరాటాకు చెందిన హర్షవర్ధన్ అనే విద్యార్థి మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో పిప్పర్‌వాడకు చేరుకోగానే అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని చికిత్స కోసం రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# గాజాలోని మసీదుపై ఇజ్రాయెల్ దాడి.. 24మంది మృతి



**గాజా:** హెజ్‌బొల్లా అంతమే లక్ష్యంగా లెబనాన్‌లో ఇజ్రాయెల్ద ళాలు భీకర దాడులు చేస్తున్నాయి. మరోవైపు ఆదివారం తెల్ల వారుజామునసెంట్రల్ గాజాలో ఓ మసీదుపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో 24మంది మరణించినట్లుగా పాలస్తీనా వైద్య అధికా రులు తెలిపారు. మృతులంతా పురుషులేనని వెల్లడించారు. కాగా డెయిర్ అల్-బలాహ్‌పట్టణంలోనిఅల్-అక్సా అమరవీరుల ఆసు పత్రికి సమీపంలో ఉన్న ఈ మసీదులో నిరాశ్రయులైన ప్రజలు ఉంటున్నారు. ఆదివారం ఉదయం మసీదుపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేయడంతో 24 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయా రు. అయితే, ఈ దాడిపై ఇజ్రాయెల్ ఎటువంటి ప్రకటనా చేయ లేదు. ఉత్తరలెబనాన్‌లోని శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్‌జరిపిన వైమానిక దాడుల్లో హమాస్ అధికారి, అతడి కుటుంబ సభ్యులు మరణించారనిహమాస్ శనివారం వెల్లడించింది. పాలస్తీనా ఆరో గ్య మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లో సంగీత కార్యక్రమంపై హమాస్ దాడితోమొదలైనఈయుద్ధంలో ఇప్పటి వరకు గాజాలోదాదాపు 42,000 మంది మరణించారు. యుద్ధం ప్రారంభం నుంచీ హమాస్‌కు ఇరాన్ మద్దతిస్తూ వస్తోంది. కానీ ఇటీవల హెజ్‌బొల్లా కీలక నేత లను హతమార్చడంతోపాటు తమ భూభాగంలో కొంత మంది నేతలను ఇజ్రాయెల్ చంపడంతో స్వయంగా క్షిపణులను ప్రయోగించింది. దీంతో ఒక్క సారిగా రెండుదేశాల మధ్య తీవ్రఉద్రిక్తత నెలకొంది. దాదాపు 200 క్షిపణులతో తమపై దాడి చేసిన ఇరాన్ పై భీకరస్థాయిలో విరుచుకుపడతామనిశుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. రానున్న ఏడు రోజుల్లో ఈ దాడి జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం వ్యూహరచన జరుగుతోందని ఐడీఎఫ్ వర్గాలు తెలిపాయి.

# కాలిఫోర్నియా విమానానికి తప్పిన ప్రమాదం

## విమానం ల్యాండ్ అవుతుండగా చెలరేగిన మంటలు



**కాలిఫోర్నియా:** కాలిఫోర్నియాలోని శాన్ డియాగో నుంచి లాస్ వెగాస్ కు వెళుతున్న ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్ విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా విమానంలో మంటలు చెలరేగడంతో దట్టమైన పొగ వ్యాపించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..శాన్ డియాగో నుంచి లాస్ వెగాస్‌కు బయల్దేరిన ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్ విమానం హ్యారీ రీడ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. దీంతో చుట్టూ దట్టమైన పొగ వ్యాపించింది. వెంటనే స్పందించిన విమానాశ్రయ భద్రతా సిబ్బంది ఫైర్ ఇంజిన్ల సహాయంలో మంటలను ఆర్పివేశారు. అయితే ఘటన జరిగిన సమయం లో విమానంలో మొత్తం 190 మంది ప్రయాణికులు, 7మంది సిబ్బంది ఉన్నారు. వారందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని పేర్కొన్నారు. ప్రయాణికులందరినీ బస్సులో టెర్మినల్‌కు తరలించినట్లు చెప్పారు. సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ముప్పు తప్పినట్లుగా విమానాశ్రయ ఉన్నతాధికారులు వెల్లడించారు.

# బోపాల్‌లో రూ.1,800 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల స్వాధీనం





**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత కలకలం సృష్టించింది డ్రగ్స్ తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు రైడ్ చేశారు. రాజధాని నగరం భోపాల్ సమీపంలోని ఓ ఫ్యాక్టరీలో రూ.1,800 కోట్లకుపైగా విలువైన మాదకద్రవ్యాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అధి, కారులు అరెస్ట్ చేశారు. భోపాల్ సమీపంలోని ఫ్యాక్టరీలో మత్తు పదార్థాలు తయారు చేస్తున్నట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో దిల్లీకి చెందిన ఎన్సీబీ, గుజరాత్‌కు చెందిన యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)తో కలిసి సంయుక్తంగా ఆ ఫ్యాక్టరీపై ప్రత్యేక ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఆ ఫ్యాక్టరీలో తయారు చేస్తున్న ఎండీ (మెఫెడ్రోన్) డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫ్యాక్టరీలో అక్రమంగా మత్తు పదార్థాలు ఉత్పత్తి చేస్తున్న ఇద్దరు నిందితులను అధికారులు అరెస్ట్ చేశారు. దీని విలువ దాదాపు రూ.1,800 కోట్లకు పైగా ఉంటుందని తెలుస్తోంది. ఫ్యాక్టరీలో మరింత ముడి సరకును స్వాధీనం చేసుకు న్నారు. కాగా,గుజరాత్ హోం శాఖసహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ ఈ విషయాన్ని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ రైడ్‌కు సంబంధించిన ఫొటోలను కూడా అందులో పోస్ట్ చేశారు. డ్రగ్స్‌పై పోరాటంలో భారీ విజయం సాధించిన గుజరాత్ ఏటీఎస్, ఢిల్లీ ఎన్సీబీని ఆయ న అభినందించారు. "ఏటీఎస్, ఎన్సీబీ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌విజయవంతమైంది. మాదకద్రవ్యాలు,వాటి అక్రమ రవాణాను ఎదుర్కోవడంలో చట్ట సంస్థల అవిశ్రాంత ప్రయత్నాల కు ఈవిజయం నిదర్శనమని పేర్కొన్నారు. మన సమాజం ఆరోగ్యం, భద్రతను కాపాడటంలో వారి సహకార ప్రయత్నాలు చాలా కీలకమనికొనియాడారు. ఆరోగ్యకర సమాజంకోసం అధికారులు ఎంతో శ్రమిస్తున్నారు. అని పేర్కొన్నారు.

# కొంగాల జలపాతంలో యువకుడు గల్లంతు

**విశ్వంభర, ములుగు :** విహారం కాస్త విషాదంగా ముగిసింది. ఈత సరదాడా ఓ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల జలపాతంలోఓ యువకుడు గల్లంతయ్యాడు. మంచిర్యాల జిల్లాకు చెందిన బి.అభినవ్ (17) ఘట్‌కేసర్ అనురాగ్ యూనివర్సిటీలో బిటెక్ మొదటి సంవ త్సరం చదువుతున్నాడు. స్నేహితులతో సరదాగా వచ్చి ఈత కొడుతూ కొంగాల జలపాతంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న వాజేడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

# 23న అమరావతి డ్రోన్ సమ్మిట్'.. లోగో విడుదల చేసిన ప్రభుత్వం

**విశ్వంభర, విజయవాడ:** ఈ నెల 22, 23 తేదీల్లో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ఘనంగా నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజులపాటు జరిగే సమ్మిట్‌కు సీఎం చంద్రబాబు సహా కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఉమ్లున్మాంగ్ పుల్నమ్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి లోగో, వెబ్‌సైట్‌ను రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్, ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ ఎండీ దినేష్ కుమార్ విజయవాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేశ్ కుమార్ మాట్లాడుతూ.. డ్రోన్ సాంకేతికత – వినియోగం, దానివల్ల ఎదురయ్యే సవాళ్లు వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఏ విభాగాల్లో డ్రోన్లు వాడి మెరుగైన సేవలు పొందవచ్చనే విషయాలపై అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి ప్రతిపాదనలు తీసుకున్నామని, వీటి రూపకల్పనపై చర్చిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని డ్రోన్ తయారీ సంస్థలు, డ్రోన్ తయారీ నిపుణులు సమ్మిట్‌లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. సమ్మిట్‌కు వచ్చే వారు 'అమరావతి డ్రోన్ సమ్మిట్' వెబ్‌సైట్‌లో ఈనెల 15 వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. విజయవాడలో హ్యాకథాన్‌ను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 22న దేశంలో ఎక్కడా జరగని విధంగా 5 వేల డ్రోన్లతో విజయవాడ బరం పార్కులో డ్రోన్ షో




నిర్వహిస్తామని తెలిపారు. భారీ డ్రోన్ షోను ప్రజలు ఉచితంగా వీక్షించవచ్చన్నారు. అత్యాధునిక సేవలందించే డ్రోన్లు తయారు చేసిన వారికి ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పారు. ఎంపికైన డ్రోన్‌కు ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష అందిస్తామన్నారు. డ్రోన క్యాపిటల్‌గా ఏపీ మారాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమని, దీన్ని నెరవేర్చడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డ్రోన్ సమ్మిట్‌లో ప్రజలు, విద్యార్థులు, నిపుణలు, తయారీ దారులు ఎవరైనా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనవచ్చన్నారు.

# లలితా త్రిపురసుందరీ అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గ

## భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి



**విశ్వంభర, విజయవాడ:** విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో నాలుగోరోజు ఆదివారం అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. ఆదివారం కావడంతో రద్దీ అధికంగా ఉన్నది. దీంతో అమ్మవారి దివ్యదర్శనానికి రెండు గంటలకుపైగా సమయం పడుతున్నది. కొండపై భాగం నుంచి కింద వరకు భక్తులు క్యూలైన్లో వేచి ఉన్నారు.

## కూష్మాండదుర్గ అలంకారంలో భ్రమరాంబికాదేవి

శ్రీశైలంలో దసరా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నాలుగోరోజుకు చేరుకున్నాయి. సాయంత్రం కూష్మాండదుర్గ అలంకారంలో శ్రీభ్రమరాంబికాదేవి భక్తులకు దర్శనమివ్వనున్నారు. కైలాసవాహనంపై ఆసీనులై దేవాతామూర్తులు ప్రత్యేక పూజలు అందుకోనున్నారు. రాత్రి ఆలయ పురవీధుల్లో ఆది దంపతుల గ్రామోత్సవం జరుగనుంది.

# ఆర్థిక లావాదేవీలే చిన్నారి హత్యకు కారణం

## వీడిన పుంగనూరు హత్య కేసు మిస్టరీ

**విశ్వంభర, పుంగనూరు:** చిత్తూరు జిల్లా పుంగనూరులో ఆరేళ్ల చిన్నారి హత్యకు సంబంధించిన కేసును పోలీసులు చేధించారు. ఈ కేసుపై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మీడియా సమావేశం నిర్వహించారు. చిన్నారి హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని తమ దర్యాప్తులో తేలిందని అన్నారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పాప తండ్రి ఓ మహిళకు మూడున్నర లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. ఆమె అప్పు తిరిగి ఇవ్వకపోవడంతో దూషించాడు. సివిల్ కోర్టులో కేసు వేస్తానని బెదిరించాడు. దాంతో ఆమె పాప తండ్రిపై పగ పెంచుకుంది. ఈ క్రమంలో ఇంటి దగ్గర ఆడుకుంటున్న పాపను ఇంటికి తీసుకెళ్లి అన్నం పెట్టింది. అనంతరం ఆమె తన తల్లి, మరో మైనర్ బాలుడితో కలిసి ఆ చిన్నారి ముక్కు, నోరు గట్టిగా మూసి హత్యకు పాల్పడింది. హత్య తర్వాత చిన్నారిని బైక్ పై తీసుకెళ్లి సమ్మర్ స్టోరేజ్‌లో పడేశారు. ఈ హత్యకు పాల్పడిన రేష్మను, ఆమె తల్లి హసీనాను, హత్యకు సహకరించిన మైనర్ బాలుడు అఖిల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చిన్నారి మిస్ అయిన రోజునే హత్య చేసి సమ్మర్ స్టోరేజ్‌లో పడేశారు. చిన్నారి ఒంటిపై ఎలాంటి గాయం లేదని పోలీసులు చెప్పారు. ఘటనపై చిత్తూరు జిల్లా కలెక్టర్‌సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. చిన్నారి అదృశ్యంఅయిందని తెలిసిన వెంటనే దర్యాప్తునకు ఆదేశించానన్నారు. పక్కా ఆధారాలతో పోలీసులు చిన్నారిని హత్య చేసిన నిందితులను పట్టుకున్నారని పేర్కొన్నారు. మీడియాపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ఛానెల్స్ చిన్నారి మృతిపై తప్పుడు ప్రచారం చేశాయి. కనీసం నిబంధనలుపాటించకుండా చిన్నారి పేరును, ఫొటోలను ప్రసారం చేశారు. ఇలాంటి విషయాల్లో మీడియా బాధ్యతగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు.

### కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన సీఎం



హత్యకు గురైన చిన్నారి కుటుంబాన్ని మంత్రులు వంగలపూడి అనిత, ఫరూక్, రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. సీఎం చంద్రబాబు.. చిన్నారి తండ్రితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయనకు ధైర్యం చెప్పారు. అనంతరం హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ.. ఈ హత్య కేసులో ఐదుగురు అనుమానితులను గుర్తించామన్నారు. వారిని అరెస్టు చేసి, చట్టప్రకారం శిక్షిస్తామని చెప్పారు.

# 98 శాతం వరద బాధితుల ఖాతాల్లో పరిహారం జమ

**విశ్వంభర, అమరావతి:** వరద బాధితుల్లో ఇప్పటి వరకు 98 శాతం మందికి పరిహారం జమ చేసినట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. కేటాయించిన రూ.602 కోట్ల పరిహారంలో రూ.18 కోట్లు మాత్రమే మిగిలినట్లు వెల్లడించింది. సాంకేతిక కారణాలతో వరద సాయం అందని 2 శాతం మంది ప్రజల ఖాతాల్లో సోమవారం నగదు జమ చేయనున్నట్లు తెలిపింది. ఆధార్ అనుసంధానం సహా పలు కారణాలతో ఇప్పటికీ పరిహారం పొందని ఒక్కో కుటుంబానికి నగదు బదిలీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించింది. ఎన్టీఆర్ జిల్లాలో 15 వేలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4,620 కుటుంబాలతో సహా ఇతర జిల్లాల్లో బాధిత ప్రజలకుజిల్లా యంత్రాం గం ద్వారా అకౌంట్లతో డబ్బులు జమ చేయనుంది.

# సెయిల్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను విలీనం చేయాలి

## కార్మికుల మానవహారం

**విశ్వంభర, అమరావతి:** విశాఖస్టీల్‌ను పరిరక్షించాలని, సెయిల్‌లో స్టీల్ ప్లాంట్ విలీనం చేయాలని కోరుతూ ఆదివారం ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ రన్ చేయాలని కోరుతూ అగనంపూడి నుంచి గాజువాక వరకు మానవహారం నిర్మించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలో ' చేయి చేయి కలుపుదాం.. ఉక్కు పరిశ్రమను కాపడుతామంటూ ' నినాదాలు చేశారు.కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంతవరకు పోరాటం కొనసాగిస్తామని కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. కేంద్రం ప్లాంట్‌ను రక్షించడం కంటే పరిశ్రమను ఎలా నాశనం చేయాలనే చూస్తుందని ఆరోపించారు. దుర్మార్గమైన చర్యలు తీసుకుంటున్న కేంద్రం నిర్ణయాన్ని ఆంధ్రప్రజలు ఖండిస్తున్నారని వెల్లడించారు.ఈ నెల 8వ తేదీన ఢిల్లీలో జరుగనున్న సమావేశంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనలను తీవ్రం




చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా విశాఖలోని కూర్మన్న పాలెం గ్రామంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేపట్టిన రిలే దీక్షలు 1,333 రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని సీపీఐ , సీపీఎం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

# ఉద్యోగ భద్రత కల్పించండి..

## పవన్‌ను కలిసిన ఏపీఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్ ఉద్యోగులు



విశ్వంభర, అమరావతి: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ పలువురు ఉద్యోగులు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (%ఖుఝుఅ ఖుశ్రీఝుఅ%)ను కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ నీటిసరఫరా విభాగంలో పనిచేస్తున్న ఇంటర్నల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబరేటరీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం మంగళగిరి కేంద్రకార్యాలయంలో ఉపముఖ్యమంత్రిని కలిశారు. రాజకీయ ఒత్తిళ్లతో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని, 3 నెలలుగా జీతాలు ఇవ్వలేదని పవన్ దృష్టికి తెచ్చారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని, పెండింగ్ జీతాలు క్లియర్ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని పవన్ హామీ ఇచ్చారు. ఉద్యోగం తిరిగి ఇప్పించి ఆదుకోవాలంటూ సుజన కుమారి అనే దివ్యాంగురాలు పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. కడప జిల్లా కమలాపురం ల్యాబ్‌లో గత పదేళ్లుగా హెల్పర్‌గా పని చేస్తున్న తనను 3 నెలల క్రితం విధులు నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టుకతో ఒక కిడ్నీ లేదని, బరువు పనులు చేయలేనని తెలిపారు. ఏ ఆధారం లేని తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. వెంటనే అధికారులతో ఈ విషయమై మాట్లాడతానని ఉపముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# రుణమాఫీ కాలేదని ఆగిన రైతు గుండె



**విశ్వంభర, మహబూబ్‌నగర్:** రుణమాఫీకాలేదని మహబూబ్ నగర్‌లో ఓ రైతు గుండె ఆగింది. వివరాల్లోకి వెళ్తే.. మహబూ బ్‌నగర్ జిల్లా నవాబ్ పేటమండలం ఊరంచుతాండ గ్రామానికిచెందిన సోమ్లా(59) అనే రైతు 2023 డిసెంబర్ 9 కంటే ముందు బ్యాంకులో రుణంతీసుకున్నారు.ఆరుణం కాస్తవడ్డీతో రూ.87,300 అయింది. అర్హతఉన్నా రుణమాఫీ కాకపోవ డంతో నిత్యం అదే ఆలోచించేవాడని, ఈక్రమంలో గుండె పోటుతోమృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోమ్లా మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఫైనాన్స్ కట్టలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య



**విశ్వంభర, ఖమ్మం:** అప్పుల బాధతో ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం చొప్పకట్ల పాలెం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.గ్రామానికి చెందిన అమ ర బోయిన పాపారావు(32) కొద్ది నెలల క్రితం ఫైనాన్స్‌లో ఆటో కొన్నాడు. నెలకు రూ.10 వేలు కిస్తీ కట్టాల్సి ఉండగా, ఆటో నడవకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. శుక్రవారం రాత్రి 1 గంట సమయంలో ఇం టికి వెళ్లిన పాపారావు.. భార్యతో గొడవ పడి, భార్యాపిల్లల్ని బలవంతంగా బయటకు పంపించాడు. ఆటో స్టార్ట్ చేసే తాడుతో ఉరివేసుకుని బలవన్మ రణానికి పాల్పడ్డాడు. పాపారావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# 2 కేజీల బంగారం, 287 సెల్‌ఫోన్ల రికవరీ..

## బాధితులకు అప్పగించిన విశాఖ పోలీసులు



**విశ్వంభర, వైజాగ్:** విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెప్టెంబరులో జరిగిన చోరీలకు సంబంధించి భారీ మొత్తంలో రికవరీ చేసినట్లు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. రూ.44 లక్షల విలువైన 287 సెల్‌ఫోన్లు, 2.2 కేజీల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 73 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. రికవరీ చేసిన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, నగదును విశాఖ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ లోఫిర్యాదుదారులకు అందజేశారు. రూ.1.84 లక్షల నగదు చోరీ కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించి, బాధితుడికి తిరిగి ఇచ్చినట్లు బాగ్చి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రికవరీ చేసిన వస్తువులను ఫిర్యాదుదారులకు తిరిగి ఇవ్వడానికి కొన్ని చట్టపరమైన ఇబ్బందులు ఉండేవన్నారు. ఇప్పుడు ప్రభుత్వ చొరవతో ఫిర్యాదు దారులకు వాటిని వెంటనే అందించే వీలు కలుగుతోందని చెప్పారు.

# తెలంగాణలో రెండు రోజులు వర్షాలు..

## ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో మరో రెండురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరు పులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# బాబు పాలనలో మహిళలు, పిల్లలకు రక్షణ లేదు

## మాజీ మంత్రి రోజా



**విశ్వంభర, అమరావతి :** ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు లో చిన్నారి అతిదారుణంగా హత్యకు గురికావడం దారుణమని మాజీ మంత్రి రోజా సెల్వమణి ఆరో పించారు. రాష్ట్రంలో మహిళలకు, పిల్లలకురక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. అసలు రాష్ట్రంలో పోలీసులున్నారా ? అంటూ అనుమా నం వ్యక్తం చేశారు.వారంరోజుల క్రితం రాత్రి చిన్నారి అదృశ్యమైతే పోలీసుల నిర్లక్ష్యం వల్ల నాలుగురోజుల క్రితం వాటర్ సంప్ లో శవమై తేలిందని పేర్కొన్నారు. చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకుఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆరోపించారు. ఏపీలో దారుణాలు జరుగుతున్నా సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులను కేవలం కక్షసాధింపు చర్యలకు మాత్రమే వాడుతున్నారని దుయ్యబట్టారు.రెడ్‌బుక్‌లో రాసుకున్న వారిపై తప్పుడు కేసులు, కొట్టాలా అనే విషయంపై శ్రద్ధ వహిస్తున్నారని ఆరోపించారు. బాత్‌రూంలో కెమెరాలు పెట్టారని గుడ్లమల్లేరు కళాశాలకు చెందిన మూడు వందల మంది విద్యార్థినులు గగ్గోలు పెడితే ప్రభుత్వం పట్టించుకోకుండా విద్యార్థులను ఇళ్లకు పంపించారని విమర్శించారు. లోకేష్ నియోజకవర్గంలో ఒకేరోజు ముగ్గురు మైనర్లపై అత్యాచారం జరగడం సిగ్గుచేటని అన్నారు.

# విశాఖ డెయిరీ పాలక మండలిని రద్దు చేయాలి

## జనసేన నేత మూర్తి యాదవ్




**విశ్వంభర, వైజాగ్:** విశాఖ డెయిరీని ఆసంస్థ ఛైర్మన్‌ఆడారి ఆనంద్ కుటుంబం దోచుకుంటోందని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆరోపించారు. వెంటనే ఆ సంస్థ పాలకవర్గాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో మూర్తియాదవ్ మాట్లాడారు. "లాభాల్లో ఉన్న విశాఖ డెయిరీ తొలిసారి నష్టాల్లోకి వెళ్లింది. పాడి రైతుల కష్టాన్ని ఆడారి ఆనంద్ దోచుకుంటున్నారు. విశాఖ డెయిరీ ఆస్తులను కొట్టేశారు. డెయిరీ పాలకవర్గం సభ్యులపై ఈడీ, సీబీఐలతో విచారణ చేయించాలి. గత ఎన్నికల్లో ఈ డెయిరీ నిధులను జగన్‌కు అందించారు. విశాఖ డెయిరీ వ్యవహారాలపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టాలి" అని మూర్తియాదవ్ కోరారు.

# తమ్ముడిని కత్తితో నరికి చంపిన అన్న

**విశ్వంభర, తాళ్లరేవు:** కాకినాడ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. తమ్ముడిని అన్న కత్తితో నరికి చంపాడు. తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో ఈ ఘటన జరిగింది. కుటుంబ కలహాలతోనే ఈ హత్యకు పాల్పడినట్లు సమాచారం. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్థల వివాదంలో సొంత బాబాయ్ హత్య

**విశ్వంభర, రేపల్లె :** కుటుంబంలో నెలకొన్న స్థలవివాదాల నేపథ్యంలో సొంత బాబాయ్‌పైనే కొందరు కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన బాపట్ల జిల్లా నగరం మండలం దాసరిపాలెం శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూషయ్య(48), ఆయన ఇద్దరు సోదరుల కుమారులకు మధ్య ఇంటి స్థలం విషయంలో గత కొంతకాలంగా గొడవ జరుగుతోంది. వీటితోపాటు ఇరుకుటుంబాల మధ్య చిన్న మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి భూషయ్యకు, ఆయన సోదరుల కుమారులకు మధ్య మాటామాటా పెరిగింది. దీంతో కోపోద్రిక్తులైన వారు కర్రలతో భూషయ్యపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిజాంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పోలీసులు కొట్టారనే మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

విశ్వంభర,అమరావతి : ఏపీలోని ప్రకాశం జిల్లాలోపోలీసులు కొట్టారనే మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలోని పొన్నూరు మండలంలో రొయ్యల హ్యాచరీలో పనిచేస్తున్న పర్చూరు గ్రామానికి చెందిన రాజా ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హ్యాచరీలో డబ్బులు దొంగిలించాడని యజమాని ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పీఎస్‌లో తనను పోలీసులు కొట్టారని యువకుడు మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు.



## పంత్ తెలివితేటలతో ప్రపంచ కప్ గెలిచాం..

**- రోహిత్ శర్మ**

**విశ్వంభర, క్రిడావిభాగం :** 2024 టీ20 వరల్డ్‌కప్ టైటిల్ దక్కించుకోవడానికి ఫైనల్ మ్యాచ్‌లో టీమ్ఇండియా అమలుచేసిన స్ట్రాటజీని కెప్టెన్ రోహిత్ శర్మ తాజాగా వెల్లడించాడు. ఈ స్ట్రాటజీలో వికెట్ కీపర్ రిషభ్ పంత్ స్మార్ట్‌గా వ్యవహరించాడని రోహిత్ అన్నాడు. తన చాకచక్యంతో సౌతాఫ్రికా బ్యాటర్ల రిథమ్ బ్రేక్ చేశాడని చెప్పాడు.

'ఛేజింగ్‌లో సౌతాఫ్రితాకు 30 బంతుల్లో 30 పరుగులు కావాలి. వాళ్లకు ఇంకా చాలా వికెట్లు ఉన్నాయి. మేమంతా కంగారు పడుతున్నాం. కానీ, కెప్టెన్ కంగారు పడినట్లు కనిపించకూడదు. అప్పుడు గేమ్‌ను స్లో చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే అప్పటికే ప్రత్యర్థి బ్యాటర్లు ఫామ్‌లో ఉన్నారు. ఆ రిథమ్‌లోనే వాళ్లు మ్యాచ్ కంప్లీట్ చేయాలన్న ఆలోచనలో ఉంటారు. ఎలాగైనా ఆ రిథమ్ బ్రేక్ చేయాలి. అప్పుడే నేను ఫీల్డింగ్ సెట్ చేస్తూ, బౌలర్లతో మాట్లాడుతున్నా. ఆ మూమెంట్‌లో రిషభ్ తన టాలెంట్‌తో ఆటను కాసేపు నిలిపివేసి, వాళ్ల ఫ్లో దెబ్బతీశాడు. తన మోకాలికి ఏదో అయినట్లు కింద పడిపోయాడు. వెంటనే ఫిజియో వచ్చి బ్యాండేజ్ వేస్తున్నాడు. దీంతో గేమ్ స్లో అయ్యింది. ఇక మ్యాచ్ ఎప్పుడు స్టార్ అవుతుందని క్రీజులో ఉన్న క్లాసెన్ వెయిట్ చేస్తున్నాడు. దీనివల్ల మేం గెలిచాం అని అనడం లేదు. కానీ, అక్కడ పంత్ తెలివిగా వ్యవహరించడం కలిసొచ్చింది' అని రోహిత్ తాజాగా పాల్గొన్న ఓ కామెడీ షో లో చెప్పాడు.

అయితే అప్పటికే క్రీజులో ఉన్న హెన్రీచ్ క్లాసెన్ (27 బంతుల్లో 52 పరుగులు) ఫుల్ స్వింగ్‌లో ఉన్నాడు. అలా ఆటను కాసేపు నిలిపివేయడం వల్ల సౌతాఫ్రికా ఫ్లో దెబ్బతింది. గేమ్ తిరిగి ప్రారంభమైన వెంటనే తొలి బంతికే క్లాసెన్‌ను హార్దిక్ ఔట్ చేశాడు. ఆ తర్వాత ఓవర్లో మార్కో జాన్సన్ పెవిలియన్ చేరడం వల్ల భారత్ తిరిగి పుంజుకుంది. ఇక సౌతాఫ్రికాకు అవకాశం ఇవ్వకుండా కట్టుదిట్టంగా బంతులేసి కట్టడి చేసింది. టీమ్ఇండియా నిర్దేశించిన 177 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా ఓవర్లన్నీ ఆడి 169 పరుగులకు పరిమితమైంది. ఫలితంగా భారత్ 7 పరుగుల తేడాతో నెగ్గి రెండోసారి పొట్టి కప్‌ను ముద్దాడింది.

## ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్?



**విశ్వంభర, క్రిడావిభాగం :** బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 20తో కైవసం చేసుకుంది. వర్షం ఆటంకం కలిగించినా చరిత్రలో నిలిచి పోయేలా గొప్పగా పోరాడి ఆఖరి టెస్టును గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. బంగ్లాదేశ్‌పై సుదీర్ఘ ఫార్మాట్ సిరీస్ గెలిచిన టీమిండియా.. ఇక పొట్టి ఫార్మాట్ సిరీస్‌పై కన్నేసింది.

ఈ నేపథ్యంలో మీడియా సమావేశంలో మాట్లాడిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్‌లో కెప్టెన్సీ పగ్గాలు అందుకుంటున్నానని పరోక్షంగా పేర్కొన్నాడు. సూర్య ప్రకటనతో ముంబై ఇండియన్స్ అభిమానుల్లో గందరగోళం మొదలైంది. మరోవైపు హార్దిక్ పాండ్య కెప్టెన్సీ పగ్గాలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

భవిష్యత్‌లో ఐపీఎల్ కెప్టెన్సీపై సూర్య ఇలా స్పందించాడు. ''మీరు గూగ్లీ బౌలింగ్ చేశారు. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చూద్దాం. దాని గురించి మీరు తప్పక తెలుసుకుంటారు. ఇక ఈ కొత్త బాధ్యతలను (టీమిండియా కెప్టెన్‌గా) ఆస్వాదిస్తున్నా. రోహిత్ శర్మ సారథ్యంలో ముంబై ఇండియన్స్‌కు ఆడే సమయంలో నాకు అనిపించే సూచనలు అందిస్తూ ఉండేవాడిని''

''ఇటీవల శ్రీలంక సిరీస్‌కు నాయకత్వం వహించా. అంతకుముందు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లకు కెప్టెన్సీ వహించా. జట్టును ముందుకు ఎలా తీసుకువెళ్లాలో ఇతర కెప్టెన్ల నుంచి నేర్చుకున్నాను'' అని సూర్య పేర్కొన్నాడు. గత సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యకు కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించిన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మ సారథ్యంలో హార్దిక్ ముంబై పగ్గాలు చేపట్టాడు. టీమిండియా భవిష్యత్ కెప్టెన్ హార్దిక్ అవుతాడనే ఉద్దేశంతో ముంబై ఫ్రాంచైజీ ఈ నిర్ణయం తీసుకుంది.

కానీ భారత టీ20 జట్టుకు సారథిగా సూర్యకుమార్ యాదవ్‌ను నియమించారు. వచ్చే టీ20 వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకొని బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో హార్దిక్‌ను సారథిగా ముంబై ఫ్రాంచైజీ కొనసాగిస్తుందా లేదా అనే సందేహాలు మొదలయ్యాయి. అయితే సూర్య తాజా ప్రకటనతో హార్దిక్ కెప్టెన్సీ ప్రమాదంలో పడిందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సూర్యకే ముంబై ఫ్రాంచైజీ జట్టు పగ్గాలు అందించే అవకాశం ఉందని అంటున్నారు.

## ఉత్కంఠ పోరులో..
# చిరకాల ప్రత్యర్థిని చిత్తు చేసిన భారత్

- సెమీస్‌కు ఆశలు సజీవం
- 6 వికెట్ల తేడాతో భారత్ విజయభేరి
- రాణించిన తెలుగమ్మాయి అరుంధతి



**దుబాయ్ :** యూఏఈ వేదికగా జరుగుతున్న మహిళల టీ20 వరల్డ్ కప్ లో తొలి మ్యాచ్ లో ఓటమిపాలై... సెమీస్ అవకాశాలను క్లిష్టంగా మార్చుకున్న భారత అమ్మాయిలు... చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్ లో అదరగొట్టారు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరుగుతోన్న మ్యాచ్‌లో భారత మహిళల టీమ్ అన్ని రంగాల్లో అధిపత్యం కనబర్చుతూ విజయం సాధించింది. పాక్‌పై ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుని సెమీస్‌పై ఆశల్ని సజీవంగా ఉంచుకుంది.

భారత బ్యాటర్లలో షెఫాలీ వర్మ (32), జెమీమా రోడ్రిగ్స్ (23), హర్మన్ ప్రీత్ కౌర్ (29), కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును గట్టెక్కించారు. స్మృతి మంధాన (7), దీప్తి శర్మ (7) పరుగులు స్కోర్ చేశారు. ఇక పాక్ బౌలర్లలో ఫాతిమా 2 వికెట్లు తన ఖాతాలో వేసుకోగా, సాదియా, ఒమైనా చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు పాకిస్థాన్ 8 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది.

మహిళల టీ20 వరల్డ్ కప్‌లో తొలి మ్యాచ్‌లోనే ఓటమి. రెండో మ్యాచ్‌లో గెలిస్తే తప్ప సెమీస్ చేరే అవకాశం లేదు. ఏరకంగా చూసినా టీమిండియాకు చావోరేవో మ్యాచ్. అలాంటి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసిన భారత అమ్మాయిలు.. అతికష్టమ్మీద గట్టెక్కారు. ఓపెనర్ షఫాలీ వర్మ(35), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(29)ల అద్భుత పోరాటంతో ఆదుకున్నారు. మిడిల్ ఓవర్లలో జెమీమా రోడ్రింగ్స్(23) కీలక ఇన్నింగ్స్ ఆడింది. విజయానికి రెండు పరుగులు అవసరం అనగా హర్మన్‌ప్రీత్ రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్ చేరినా.. సజన(4) లాంఛనం పూర్తి చేసింది.

ఉత్కంఠ పోరులో 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించి తొలి టీ20 ప్రపంచ కప్ వేటలో భారత మహిళల జట్టు తొలి విజయం నమోదు చేసింది. న్యూజిలాండ్‌పై భారీ ఓటమి నుంచి తేరుకున్న టీమిండియా దాయాది పాకిస్థాన్‌పై అద్భుతంగా ఆడి బోణీ కొట్టింది. స్వల్ప ఛేదనలో టీమిండియా ఇన్నింగ్స్ నిదానంగా సాగింది. తొలి మ్యాచ్‌లో మాదిరిగానే ఈసారి కూడా భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే ఓపెనర్ స్మృతి మంధానా(7)ను వెనక్కి పంపింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన జెమీమా రోడ్రిగ్స్(23) చకచకా డబుల్స్ తీసి స్కోర్ బోర్డును నడిపించింది. కాస్త కుదురుకున్నాక షఫాలీ వర్మ (35) భారీ షాట్లు ఆడలేకపోయింది. పాక్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో 10 ఓవర్లలో భారత్ 50 రన్స్ మాత్రమే చేసింది.

డ్రింక్స్ బ్రేక్ తర్వాత షఫాలీ గేర్ మార్చింది. బౌండరీలతో చెలరేగే క్రమంలో భారీ షాట్ ఆడిన ఆమె బౌండరీ వద్ద అలియా రియాజ్‌కు చిక్కింది. దాంతో రెండో వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యానికి తెర పడింది. ఇక ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(29) అండగా రోడ్రిగ్స్..ధనాధన్ ఆడాలని చూసింది. కానీ, 16వ ఓవర్‌లోపాక్ సారథి సనా ఫాతిమా వరుస బంతుల్లో జెమీమా, రీచా ఘోష్(0)లను ఔట్ చేసి ఒత్తిడి పెంచింది. అప్పటికీ భారత జట్టు విజయానికి 26 బంతుల్లో 25 పరుగులు చేయాల్సి ఉంది.

### హర్మన్‌ప్రీత్ రిటైర్డ్ హర్ట్

18 ఓవర్‌తొలి బంతికే అంపైర్ దీప్తిని ఎల్బీగా ఔట్ ఇచ్చింది. అంతే.. భారత డగౌట్‌లోని అందరిలో టెన్షన్.. కానీ, రివ్యూ తీసుకోవడంతో దీప్తి బతికిపోయింది. నాలుగో బంతికి బౌండరీ కొట్టిన హర్మన్‌ప్రీత్ పాక్ ఆశలపై నీళ్లు చల్లింది. ఆ బౌండరీతో భారత విజయాన్ని తేలిక చేసిన ఆమె క్రీజులో పడిపోయి మెడనొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. ఆ వెంటనే క్రీజులోకి వచ్చిన సంజన(4 నాటౌట్) బౌండరీతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. దాంతో.. మెగా టోర్నీలో పాకిస్థాన్‌పై తన ఆధిపత్యాన్ని చాటుకున్న టీమిండియా సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది.

ఆచితూచి ఆడిన దార్, సనా

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న పాక్‌కు మొదటి ఓవర్లోనే రేణుకా సింగ్ షాక్ ఇచ్చింది. ఓపెనర్ గుల్ ఫిరోజ్ (0)ను బౌల్డ్ చేసి ప్రత్యర్థిని వణికించింది. ఆ తర్వాత అరుంధతీ రెడ్డి(3/19), దీప్తి శర్మ కూడా వికెట్ల వేట కొనసాగించడంతో పవర్ ప్లేలోనే 33 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఓవైపు వికెట్లు పడుతున్నా మునీబా(17) ధాటిగా ఆడే ప్రయత్నం చేసింది. కానీ.. శ్రేయాంక పాటిల్(2/12) తన మొదటి ఓవర్లోనే డేంజరస్ మునీబాను బోల్తా కొట్టించి పాక్‌ను మరింత కష్టాల్లోకి నెట్టింది. ఆ తర్వాత మాజీ కెప్టెన్ నిదా దార్ (28) ఆచితూచి ఆడుతూ అలియా రియాజ్(4), ఒమైమ్ సొహైల్(3)లతో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దింది. భారత పేలవ ఫీల్డింగ్ కూడా వాళ్లకు కలిసొచ్చింది. రియాజ్ ఔటయ్యాక వచ్చిన కెప్టెన్ ఫాతిమా సనా(13) ఉన్నంతసేపు ధనాదన్ ఆడింది. శోభన వేసిన ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో స్కోర్ 70 దాటింది. అయితే.. ఐదో బంతికి వికెట్ కీపర్ రీచా స్టన్నింగ్ క్యాచ్ పట్టడంతో ఆమె వెనుదిరిగింది. 71 వద్ద ఏడో వికెట్ పడగా.. ధార్, అరూబ్ షా(14 నాటౌట్)లు ధాటిగా ఆడారు. ఆఖరి ఓవర్లో దార్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన నష్ర సంధు ఓ బౌండరీతో జట్టు స్కోర్ 100 దాటించింది. దాంతో, టీమిండియాకు పాక్ 106 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

### సెమీస్‌పై ఆశలు

పాకిస్తాన్ తరఫున కెప్టెన్ ఫాతిమా సనా రెండు వికెట్లను పడగొట్టగా, సాదియా ఇక్బాల్, ఒమైమా సోహైల్ చెరో వికెట్ తీశారు. ఇక భారత్ తరఫున అరుంధతి రెడ్డి మూడు వికెట్లు తీయగా, శ్రేయాంక పాటిల్ రెండు వికెట్లను పడగొట్టారు. అయితే సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే భారత్ ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలనుకున్న తరుణంలోనే విజయం సాధించింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు ఈసారి 16వ సారి తలపడ్డాయి. ఇంతకు ముందు ఆడిన 15 మ్యాచ్‌ల్లో భారత మహిళలు 12 3తో పాకిస్తాన్‌పై పైచేయి సాధించారు. అంటే భారత్ 12 మ్యాచ్‌లు గెలిస్తే, 3 మ్యాచ్‌లు పాకిస్తాన్ జట్టుకు దక్కాయి.

## టీమిండియా బెస్ట్ కెప్టెన్ అతడే..

**- క్రిస్ గేల్**



**విశ్వంభర, క్రిడావిభాగం :** భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ అని వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ అన్నాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు కూడా సారథులుగా టీమిండియాకు గొప్పగానే బాధ్యతలు నిర్వర్తించారని, కానీ ధోనీనే అత్యుత్తమ కెప్టెన్ అని యూనివర్సల్ క్రిస్ గేల్ తెలిపాడు. ఓ ఇంటర్వ్యూకు హాజరైన గేల్ ఆసక్తికర సమాధానలు చెప్పాడు. అత్యంత సవాలైన బౌలర్ గురించి గేల్ ఫన్నీగా సమాధానం ఇచ్చాడు. అలాగే ఐపీఎల్ ఫ్రాంచైజీలకు మెంటార్‌గా బాధ్యతలు నిర్వర్తించడం ఆసక్తిగా ఉందని తెలిపాడు. ఐపీఎల్‌లో తనకు అపారమైన అనుభవం ఉందని, అది యువ ఆటగాళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని గేల్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో క్రిస్ గేల్ 142 మ్యాచ్‌లు ఆడాడు. 39.72 సగటు, 148.96 సగటుతో 4965 పరుగులు చేశాడు.

''భారత్ తరఫున అత్యంత విజయవంతమైన కెప్టెన్ ఎంఎస్ ధోనీ. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి కూడా కెప్టెన్లుగా బాగానే పనిచేశారు. కానీ ధోనీ ఓవరాల్‌గా ట్రెండ్ సెట్ చేశాడు. ఇక అత్యంత సవాలైన బౌలర్ గురించి చెప్పాలంటే.. అతను ఇంకా పుట్టాడా? లేదా బతికే ఉన్నాడా? అని నాకు తెలియదు. నా దృష్టిలో ప్రతి బౌలర్ సవాలే. వికెట్ తీయడానికి ప్రయత్నిస్తుంటారు''

''ప్రతి బౌలర్ ఓ మంచి బంతితో టాప్‌లోకి వెళ్లొచ్చు. అయితే అదే సమయంలో టాప్ క్లాస్ ఫాస్ట్ బౌలర్లు, స్పిన్నర్లను ఎదుర్కోవడం సరదాగా ఉంటుంది. ప్రతి బౌలర్ మంచి సవాలైనవాళ్లే. కానీ ఈ యూనివర్సల్ బాస్ వాళ్ల కంటే మరింత సవాలైనవాడు. ఇక ఐపీఎల్‌లో పాల్గొనడం ఎంతో బాగుంటుంది. నా దగ్గర అపారమైన అనుభవం ఉంది. అంతేగాక ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయించాను. నా అనుభవాన్ని పంచుకోవటాన్ని నేను ఆస్వాదిస్తాను'' అని క్రిస్ గేల్ పేర్కొన్నాడు.

## సిక్సర్లతో విరుచుకుపడ్డ సురేశ్ రైనా..



**విశ్వంభర, క్రిడావిభాగం :** టీమిండియా మాజీ క్రికెటర్ సురేష్ రైనా 2020 ఆగష్టు 15న అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. రిటైర్మెంట్ ఇచ్చి నాలుగేళ్లు గడిచినా.. విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరెగి తనలో ఏ మాత్రం దూకుడు తగ్గలేదని నిరూపించాడు. అమెరికా వేదికగా జరుగుతున్న నేషనల్ క్రికెట్ లీగ్‌లో న్యూయార్క్ లయన్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న సురేశ్ రైనా.. లాస్ ఏంజెల్స్ వేవ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. లాస్ ఏంజెల్స్ కెప్టెన్, బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌ను సురేశ్ రైనా చెడుగుడు ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైనా.. భారీ షాట్లు ఆడే సత్తా తనలో ఇంకా ఉందని రైనా చాటి చెప్పాడు.

షకీబ్ అల్ హసన్ బౌలింగ్‌లో సురేశ్ రైనా రెండు భారీ సిక్స్‌లతో పాటు ఒక ఫోర్ కొట్టి 18 పరుగులు పిండుకున్నాడు. సురేశ్ రైనా భారీ షాట్లతో విరుచుకుపడటంతో షకీబ్ అల్ హసన్ మళ్లీ బౌలింగ్ చేయలేదు. ఇక రైనా విధ్వంసకర బ్యాటింగ్‌కు అతని ఫ్యాన్స్, సీఎస్‌కే అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

దూకుడైన బ్యాటింగ్‌తో సురేశ్ రైనా 28 బంతుల్లో 53 పరుగులు చేశాడు. ఇందులో మూడు సిక్స్‌లతో 4 ఫోర్లు ఉన్నాయి. దాంతో లయన్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 126 పరుగులు చేసింది. ఈ టోర్నీ 60 బాల్ ఫార్మాట్‌లో జరుగుతోంది. సురేశ్ రైనాకు అండగా.. శ్రీలంక బ్యాటర్ ఉపుల్ తరంగా(23 బంతుల్లో 40) రాణించాడు. అనంతరం వేవ్స్ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు 107 పరుగులే చేసి ఓటమిపాలైంది. టీమ్ డేవిడ్ పోరాడినా ఫలితం లేకపోయింది. షకీబ్ అల్ హసన్(13) కూడా విఫలమయ్యాడు.

# గ్వాలియర్‌లో గళ్ల ఎగిరేసిన భారత్



- బంగ్లాదేశ్‌తో తొలి టీ20లో గ్రాండ్ విక్టరీ
- చెలరేగిన పాండ్యా, సూర్య

**గ్వాలియర్:** బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌లోనూ టీమిండియా శుభారంభం చేసింది. ఆదివారం గ్వాలియర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. బంగ్లాదేశ్ విధించిన 128 పరుగుల లక్ష్యాన్ని 11.5 ఓవర్లలోనే చేధించింది. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా(16 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 127 పరుగులకు కుప్పకూలింది. మెహిదీ హసన్ మీరాజ్(32 బంతుల్లో 3 ఫోర్లతో 35 నాటౌట్), నజ్ముల్ హొస్సేన్ షాంటో(25 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 27) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి(3/31), అర్ష్‌దీప్ సింగ్(3/14) మూడేసి వికెట్లతో బంగ్లాదేశ్ పతనాన్ని శాసించగా.. మయాంక్ యాదవ్(1/21), హార్దిక్ పాండ్యా(1/26), వాషింగ్టన్ సుందర్(1/12)తలో వికెట్ తీసారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లకు 132 పరుగులు చేసి గెలుపొందింది. సంజూ శాంసన్(19 బంతుల్లో 6 ఫోర్లతో 29), సూర్యకుమార్ యాదవ్(14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 29) దూకుడుగా ఆడారు. హార్దిక్ పాండ్యాతో కలిసి తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి(16 నాటౌట్) అజేయంగా నిలిచాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిదీ హసన్ మీరాజ్, ముస్తాఫిజుర్ రెహ్మాన్‌లు తలో వికెట్ తీసారు.

భారత ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మ ధాటిగా ప్రారంభించాడు. భారీ సిక్సర్‌తో పాటు 2 బౌండరీలతో దూకుడు కనబర్చాడు. కానీ దురదృష్టవశాత్తు నాన్‌స్ట్రైకర్‌గా ఉన్న అతను టౌహిడ్ హృదయ్ స్టన్నింగ్ త్రోకు రనౌటయ్యాడు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు.

అతన్ని ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఔట్ చేయగా.. సంజూ శాంసన్ క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతన్ని మెహిదీ హసన్ ఔట్ చేయగా.. నితీష్ కుమార్ రెడ్డితో కలిసి హార్దిక్ పాండ్యా విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు. భారీ సిక్సర్‌తో తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు. ఈ గెలుపుతో భారత్ మూడు టీ20ల సిరీస్‌లో 10తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 బుధవారం(అక్టోబర్ 9) ఢిల్లీ వేదికగా జరగనుంది.

### అమెరికా అధ్యక్ష ఎన్నికను
## మలుపు తిప్పే స్వింగ్ రాష్ట్రాలు

**అందరి దృష్టీ ఈ రాష్ట్రాలపైనే కేంద్రీకృతం**

**స్వింగ్ రాష్ట్రాల్లో సర్వశక్తులూ ఒడ్డుతున్న ట్రంప్, కమల**



**వాగింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నిక దగ్గరపడుతున్న కొద్దీ... అభ్యర్థులతో పాటు అందరి దృష్టీ కొన్ని రాష్ట్రాలపై కేంద్రీకృతమైంది! అవే స్వింగ్ రాష్ట్రాలు! తటస్థ ఓటర్లతో అధ్యక్ష ఎన్నికను ప్రభావితం చేయగల రాష్ట్రాలు కావటమే వీటి ప్రత్యేకత! అంటే అధ్యక్ష ఎన్నికను మలుపు తిప్పగల సామర్థ్యమున్న రాష్ట్రాలని అర్థం! అందుకే డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌లిద్దరూ... స్వింగ్ రాష్ట్రాలను గెల్చుకోవటానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. 2020లో ఏడు రాష్ట్రాలకుగాను ఆరింట జో బైడెన్ పైచేయి సాధించి 306232 ఓట్ల తేడాతో అధ్యక్ష పీఠం అధిష్ఠించారు. ఒక్క నార్త్ కరోలినాలో మాత్రమే అప్పుడు ట్రంప్ ఆధిక్యంలో నిలిచారు. ఈసారి స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్, హారిస్ మధ్య పోరు పోటాపోటీగా ఉందంటున్నారు. అమెరికాలో ఓటర్ల రాజకీయ అనుబంధం బహిరంగం! అంటే చాలామంది తాము ఏ పార్టీకి మద్దతిస్తామో ముందే వెల్లడించేస్తారు. రిపబ్లికన్లుగా, డెమోక్రాట్లుగా గుర్తింపు పొందుతారు కూడా! తద్వారా ఏయే రాష్ట్రాల్లో రిపబ్లికన్లకు, డెమోక్రాట్లకు మద్దతుందనేది దాదాపుగా తెలిసిపోతుంది (అలాగే ఓటు వేయాలని నియమం ఏమీ లేదు.) అయితే కొన్ని రాష్ట్రాల్లో ప్రజలు మాత్రం పార్టీల సిద్ధాంతాలకు కట్టుబడకుండా తటస్థంగా ఉంటారు. ఏ పార్టీకీ గుడ్డిగా మొగ్గు చూపరు. ఇవే ఎన్నికలో కీలకంగా పరిణమించి... ఫలితాలను మార్చేస్తుంటాయి. వీటినే స్వింగ్ రాష్ట్రాలుగా పరిగణిస్తారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో నవంబరు 5న ప్రజలు వేసే ఓట్లతో ఆయా రాష్ట్రాల నుంచి ప్రతినిధులను ఎంచుకుంటారు. వీరిని ఎలక్టోరల్ కాలేజీ అంటారు. ఆయా రాష్ట్రాల జనాభా ఆధారంగా ఈ సీట్లుంటాయి. అన్ని రాష్ట్రాల్లో కలిపి 538 ఎలక్టోరల్ కాలేజీ స్థానాలున్నాయి. వీటిలో 270 నెగ్గినవారు అధ్యక్షులవుతారు. ఈసారి ఎన్నికల్లో స్వింగ్ రాష్ట్రాలుగా భావిస్తున్న పెన్సిల్వేనియా, ఆరిజోనా, జార్జియా, మిషిగన్, నెవడా, నార్త్ కరోలినా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో కలిపి 93 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లున్నాయి. ఇవే అధ్యక్ష పీఠాన్ని మలుపుతిప్పుతాయన్నది భావన! అందుకే వాటిపై పట్టుకోసం హారిస్, ట్రంప్ హోరాహోరీగా ప్రయత్నిస్తున్నారు.

## ఇజ్రాయెల్‌కు ఆయుధ విక్రయాలు స్టాప్

**ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ నిర్ణయం**

**మండిపడ్డ నెతన్యాహు**



**ప్యారిస్:** ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య యుద్ధంలో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది నిరాశ్రయులై వలస వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ఆయుధ విక్రయాలను నిలిపివేయాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ పిలుపునిచ్చారు. అయితే ఈ నిర్ణయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఖండించారు. ఫ్రాన్స్ అధినేత తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. 'రాజకీయ పరిష్కారమే కీలకమని నేను భావిస్తున్నాను. ఇజ్రాయెల్‌కు ఆయుధ విక్రయాలను ఆపేస్తున్నాం. కాల్పుల విరమణ పిలుపును పట్టించుకోవడంలేదు. ఇది ఇజ్రాయెల్ పొరపాటు.. దాని భద్రతపై కూడా ప్రభావం చూపుతుందనుకుంటున్నా. యుద్ధం విద్వేషాలకు దారి తీసింది. లెబనాన్ మరో గాజాలా మారకూడదు' అని మెక్రాన్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా లెబనాన్‌లోని సరిహద్దుల్లో దళాలను పంపాలన్న నెతన్యాహు నిర్ణయాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ పరిణామాలపై నెతన్యాహు మండిపడ్డారు. ''ఇరాన్ నేతృత్వంలోని అరాచక శక్తులతో ఇజ్రాయెల్ పోరాడతున్నందున ప్రపంచం ఇజ్రాయెల్ వైపు నిలవాలి. కానీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో సహా ఇతర పాశ్చాత్య నాయకులు ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరాపై ఆంక్షలు విధించడం సిగ్గుచేటు. ఇరాన్ హెజ్‌బొల్లా, హమాస్, హూతీలపై ఆయుధ నిషేధం విధిస్తుందా?. అక్టోబరు 7 నాటి దాడుల్లో వేల మంది ఇజ్రాయెలీలు మరణించారు. అక్టోబరు 7నాటి దాడికంటే పెద్ద మారణకాండను ఉత్తర సరిహద్దుల్లో హెజ్‌బొల్లా ప్లాన్ చేసింది. ఈ పాశ్చాత్య దేశాలు మద్దతుగా నిలిచినా.. లేకున్నా ఇజ్రాయెల్ ఈ యుద్ధం గెలిచే వరకు పోరాడుతుంది'' అని నెతన్యాహు ఓ వీడియోలో పేర్కొన్నారు. తమ దేశం ప్రస్తుతం ఏడు యుద్ధరంగాల్లో పోరాడుతోందని నెతన్యాహు తెలిపారు. ''ఇజ్రాయెల్ ప్రస్తుతం ఏడు చోట్ల శత్రువులకు వ్యతిరేకంగా పోరాడుతోంది. గాజాలో హమాస్‌తోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, యెమెన్‌లోని హూతీలు, వెస్ట్ బ్యాంక్‌లోని ఉగ్రమూకలు, ఇరాక్, సిరియాలోని మిలీషియాలు, ఇరాన్ నుంచి తనను తాను రక్షించుకుంటోంది'' అని చెప్పారు.

# జానీ మాస్టర్ జాతీయ అవార్డు తాత్కాలికంగా నిలిపివేత



టాలీవుడ్‌లోనే కాకుండా నార్త్, సౌత్ సినీ ఇండస్ట్రీల్లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ . ఇప్పటికే పలు అవార్డులు అందుకున్న ఆయన ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా ఈ ఏడాది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. 'తిరు చిత్రంబలం' చిత్రానికి గాను ఆయనకు ఈ అవార్డు వరించింది. అయితే ఇప్పుడా అవార్డును తాత్కాలికరంగా నిలిపివేస్తున్నట్లు నేషనల్ ఫిల్మ్ అవార్డ్ సెల్ ప్రకటించింది. జానీ మాస్టర్ పై పోక్సో కేసు నమోదు కావడంతో ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఈ కేసులో జానీ మాస్టర్ నిర్దోషిగా బయటకు వస్తే ఆ అవార్డుని జానీ మాస్టర్‌కు అందజేస్తారు. అయితే జానీ మాస్టర్‌కు అవార్డును నిలిపేస్తున్నట్లు ప్రకటన వచ్చింది. అప్పటి నుంచి నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

వృత్తిగత జీవితానికీ, వ్యక్తిగత జీవితానికీ మధ్య లింకేంటని చాలామంది ప్రశ్నిస్తున్నారు. జానీ బెస్ట్ డాన్స్ మాస్టర్ అనేది ఓ కమిటీ నిర్ణయించింది. దాని ద్వారానే అవార్డు ప్రకటించింది. మధ్యలో ఈ కేసు వివాదం బయటకు వచ్చింది. ఒకవేళ అప్పటికే జానీ మాస్టర్‌కు అవార్డు ఇచ్చేస్తే ఆ తరవాతే కేసు సంగతి బయటకు వస్తే అప్పుడు అవార్డు వెనక్కి లాక్కునేవారా? ఇప్పటి వరకూ ఇచ్చిన అవార్డుల్లో అలా జరిగిందా? జాతీయ అవార్డు కమిటీ వెనక్కి లాక్కోగలిగిందా? ఇక మీదట జాతీయ అవార్డులకు నామినేషన్లు పంపేటప్పుడు క్లీన్ చిట్ పత్రాలు కూడా జత చేయాలా? ఆ అవసరాన్ని ఇప్పుడు జాతీయ అవార్డు కమిటీ కల్పించిందా? ఇవన్నీ ఇప్పుడు ఎదురవుతున్న ప్రశ్నలు. జాతీయ అవార్డుకు అర్హులు కావాలంటే ఈ రూల్స్ అన్ని ఉండాలా? అని సినీ ప్రియులు ప్రశ్నిస్తున్నారు.

సినిమా రంగం వాళ్లనే ఇలా ఎందుకు టార్గెట్ చేస్తారు? సినిమా వాడిని ఎవరైనా, ఎలాగైనా ఎక్కడైనా కార్నర్ చేయగలరు. అందుకు జానీ ఉదంతం ఓ నిదర్శనం. జానీ మాస్టర్ ఎంత కష్టపడితే ఈ జాతీయ పురస్కారానికి ఎంపికై ఉంటాడు. అతని టైమ్ బావుండి అవార్డును ప్రకటించారు. ఇప్పుడు ఓ కేసులో ఇరుక్కున్నాడు కాబట్టి అవార్డును తాత్కాలికంగా నిలిపేశారు. నిర్దోషి అని తేలితే అప్పుడేం చేస్తారు? అప్పుడు మళ్లీ అవార్డు ఇస్తాం అంటే ఇప్పటి కళ, ఇప్పటి గౌరవం అప్పుడు ఉంటుందా? ఒకవేళ మళ్లీ ఆహ్వానం అందితే ప్రకటించినప్పుడు ఉన్న సంతోషంతో అప్పుడు జానీ వెళ్ళగలడా? అంటూ జాతీయ అవార్డు కమిటీకి చురకలు అంటిస్తున్నారు. ఎన్నికల్లో గెలిచిన నాయకులకు ఈ ఆప్షన్ ఎందుకు లేదు? వాళ్లపై కేసులు నమోదైతే.. కోర్టుల చుట్టూ తిరుగుతుంటే, నిజాయతీ నిరూపించుకొన్న తరవాతే పదవుల్లోకి రండి, ప్రజల్ని పరిపాలించండి అని ఎందుకు చెప్పలేకపోతున్నారు? సినిమా వాళ్లకు ఓ రూలు, రాజకీయాలకు మరో రూలా? అని ప్రశ్నిస్తున్నారు.

ఇదే విషయంపై కొరియోగ్రాఫర్ 'ఆట' సందీప్ స్పందించారు. "ఎంతో కష్టపడితే గానీ నేషనల్ అవార్డు దక్కదు. అలాంటి జానీ మాస్టర్‌కు అవార్డు వరించింది. ఏదో కేస్ మధ్యలో వచ్చిందని అవార్డును క్యాన్సిల్ చేయడం కరెక్ట్ కాదు. ఈ మధ్యలో చట్టాలన్నీ అమ్మాయిలకు అనుకూలంగా ఉండడంతో ప్రతి విషయంలోనూ కేసులు పెడుతున్నారు' అని ఆట సందీప్ అన్నారు. జానీ మాస్టర్‌కు మద్దతుగా యానీ మాస్టర్ కూడా స్పందించారు.

# ప్రభాస్ సినిమాలో విలన్‌గా చేస్తా : గోపిచంద్



పాన్ ఇండియా నటుడు ప్రభాస్, నటుడు గోపిచంద్‌ల ఫ్రెండ్‌షిప్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. వర్షం సినిమా టైంలో మొదలైన వీరిద్దరి స్నేహం ఇప్పుడు ఇంకా బలంగా మారింది. అప్పుడప్పుడు గోపిచంద్ సినిమాలకు వచ్చి తనను సపోర్ట్ చేస్తుంటాడు ప్రభాస్. అయితే వర్షం తర్వాత ఈ ఇద్దరి కాంబినేషనల్‌లో మళ్లీ సినిమా రాలేదు. ఈ ప్రభాస్, గోపిచంద్‌ల కాంబోలో సినిమా వస్తే చూద్దామని అటు రెబల్ అభిమానులతో పాటు ఇటు గోపిచంద్ ఫ్యాన్స్ కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ విషయంపై తాజాగా స్పందించాడు గోపిచంద్. గోపిచంద్ కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం విశ్వం. ఈ సినిమాకు శ్రీను వైట్ల దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా గోపిచంద్ మళ్లీ విలన్‌గా నటిస్తారా అని రిపోర్టర్ అడుగగా.. విలన్ రోల్ చేయాలని లేదు. కానీ ప్రభాస్ సినిమాలో అయితే విలన్ రోల్ అయితే తప్పకుండా చేస్తాను అంటూ గోపిచంద్ చెప్పుకోచ్చాడు. దీంతో వీరిద్దరి కాంబో ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్నామని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.

## విడుదల తేదీ ప్రకటించిన అశోక్ గల్లా

# 'దేవకీ నందన వాసుదేవ'

టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం దేవకీ నందన వాసుదేవ . జాంబిరెడ్డి, హనుమాన్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథనందిస్తుండగా.. గుణ 369 ఫేం అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం విడుదలకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను నవంబర్ 14న విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాలో అశోక్ గల్లా సరసన హీరోయిన్‌గా మాజీ మిస్ ఇండియా (2020) మానస వారణాసి నటిస్తుంది. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబికా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ (ఎన్ఆర్ఐ) ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తుండగా.. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రానికి ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రాఫర్ కాగా తమ్మిరాజు ఎడిటర్. ఇక కార్తికేయ హీరోగా అర్జున్ జంధ్యాల చివరగా డైరెక్ట్ చేసిన గుణ 369 బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ఈ సారి ఎలాగైనా మంచి హిట్టు కొట్టాలని చూస్తున్నాడు అర్జున్ జంధ్యాల.

# శరీరాన్ని వస్తువుగా భావించను

గ్లామర్ రోల్స్, స్కిన్ షో చేయడంపై అసహనం వ్యక్తం చేశారు తమిళనటి ప్రియా భవానీ శంకర్ . ప్యాషన్ పేరుతో శరీరాన్ని చూపించడం తనకు ఇష్టం లేదన్నారు. 'కళ్యాణం కమనీయం'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె కోలీవుడ్‌లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన తదుపరి సినిమా 'బ్లాక్' గురించి మాట్లాడారు. ''నా శరీరాన్ని ఒక వస్తువుగా భావించను. ప్రేక్షకులను రప్పించడం కోసం గ్లామర్‌గా కనిపించడం నాకు నచ్చదు. అలాంటి వాటిని అంగీకరించను. కెరీర్ పరంగా ఎప్పుడైనా వెనక్కి తిరిగి చూసుకుంటే ఏ విషయంలోనూ బాధపడకూడదనుకుంటాను. అందుకు అనుగుణంగానే ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటా. నెగెటివ్ రోల్ చేయడానికీ వెనుకాడను. ఎందుకంటే అది నా వృత్తి. అలాగే, ఒక హీరోయిన్‌గా ఫ్యాషన్ పేరుతో కొన్నింటిని ప్రమోట్ చేయలేను'' అని అన్నారు. గ్లామర్ పాత్రలు గురించి ఆమె గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు.''అతి తక్కువ సమయంలో పామ్‌లోకి వెళ్లి, ఫేం తెచ్చుకోవడానికి గ్లామర్ అనేది అడ్డదారి అని చాలామంది భావిస్తుంటారు. నిజం చెప్పాలంటే అది చాలా కష్టమైన పని. దానిని నేను సౌకర్యవంతంగా భావించలేను. అదీకాక ప్రేక్షకులు నన్ను గ్లామర్ పాత్రల్లో చూడటానికి ఇష్టపడరు'' అని అన్నారు. ఇక తాజా చిత్రం 'బ్లాక్' విషయానికి వేస్త.. జీవా హీరోగా నటించిన ఈ చిత్రానికి బాల సుబ్రమణి దర్శకత్వం వహించారు. హారర్ జానర్‌లో రూపొందిన ఈ చిత్రాన్ని. అక్టోబర్ 11న విడుదల కానుంది.






## శ్రీను వైట్ల, గోపిచంద్

# విశ్వం ట్రైలర్ రిలీజ్

టాలీవుడ్ దర్శకుడు శ్రీనువైట్ల దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం విశ్వం. గోపిచంద్ కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా విడుదల తేదీ దగ్గరపడటంతో వరుస ప్రమోషన్స్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే టీజర్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. శ్రీనువైట్ల మళ్లీ తన కామెడీతో అలరించబోతున్నట్లు తెలుస్తుంది. కవ్యా థాపర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, సంగీతం: చేతన్ భరద్వాజ్, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి, దర్శకత్వం: శ్రీను వైట్ల.

# 'శివ'కు 35 వసంతాలు

నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన 'శివ' చిత్రం ఓ ట్రెండ్ సెట్టర్. హీరోగా నాగార్జునకు.. దర్శకుడిగా వర్మకు ఒక ఫేమ్ క్రియేట్ చేసిన సినిమా ఇది. 1990లో విడుదలైన ఈ సినిమా యాక్షన్ చిత్రాలకు టాలీవుడ్‌లో ఒక బెంచ్ మార్క్ క్రియేట్ చేసింది. శివ విడుదలై 35 ఏళ్లు అయింది. ఈ సందర్భంగా చిత్రబృందం, అభిమానులకు ధన్యవాదాలు చెబుతూ ఓ పోస్ట్ చేశారు. ''శివ విడుదలై 35 ఏళ్లు అవుతోంది. సినిమా విడుదలైన తర్వాత మా నాన్నతో కలిసి కారులో ప్రయాణించిన క్షణాలను మర్చిపోలేను. ''నిన్న రాత్రి శివ చూశా. మార్నింగ్ ఇదొక బిగ్ హిట్ అని విన్నాను. తెలుగు చిత్రపరిశ్రమలో ఇదొక బిగ్గెస్ట్ హిట్ మూవీ అవుతుందని నేను నమ్ముతున్నా'' అని ఆయన నాతో అన్నారు. ఆ మాటలు నిజమయ్యాయి. ఇన్నేళ్లు అయినా మా సినిమాపై అభిమానం చూపిస్తున్న సినీ ప్రియులకు.. శివ రూపొందించడంలో భాగమైన వారికి ధన్యవాదాలు'' అని నాగార్జున పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిపై రాంగోపాల్ వర్మ స్పందించారు. ''లైఫ్ టైమ్ గుర్తుండిపోయే బ్రేక్ ఇచ్చినందుకు థాంక్యూ. మీ అమితమైన నమ్మకం, సపోర్ట్ లేకపోతే 'శివ', నేను ఉండేవాళ్లం కాదు'' అని రిప్లై ఇచ్చారు.






# జుట్టు సమస్యలకు చెక్ పెట్టండిలా!

**విశ్వంభర, ఫీచర్:** జుట్టు సంరక్షణ అనేది నేడు చాలా మందికి ఆందోళన కలిగిస్తుంది. ముఖ్యంగా యువ కమ్యూనిటీకి, జుట్టు యొక్క అందాన్ని కాపాడుకోవడం మరియు తెల్ల జుట్టు రాలకుండా నిరోధించడం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటారు. ఈ రోజుల్లో అకాల గ్రేయింగ్ మరియు చుండ్రు వంటి సమస్యలు సర్వసాధారణం. మీరు ఆల్ ఇన్ వన్ సొల్యూషన్ కోసం చూస్తున్నట్లయితే, గూస్బెర్రీ మీకు సహాయం చేస్తుంది. మీ జుట్టుకు ఉసిరికాయను ఉపయోగించడం ద్వారా, మీరు ఈ సమస్యలను కొంతవరకు నివారించవచ్చు. జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా, దృఢంగా ఉండేందుకు గూస్బెర్రీని పురాతన కాలం నుంచి ఉపయోగిస్తున్నారు. దీన్ని ఉపయోగించడం వల్ల జుట్టు రాలడం, చుండ్రు వంటి సమస్యలు పరిష్కారమవుతాయి. జుట్టుకు గూస్బెర్రీ వల్ల కలిగే ప్రయోజనాలు మరియు దానిని ఉపయోగించే కొన్ని మార్గాల గురించి ఇక్కడ తెలుసుకుందాం. గూస్బెర్రీ అనేది మీ జుట్టును సుసంపన్నం చేయడానికి అవసరమైన ఖనిజాలు మరియు విటమిన్లను కలిగి ఉన్న పోషకాలు అధికంగా ఉండే సూపర్ ఫుడ్. ఉసిరికాయలోని అమైనో ఆమ్లాలు మీ జుట్టును బలపరుస్తాయి మరియు నష్టాన్ని సరిచేస్తాయి. ఉసిరికాయలో యాంటీఆక్సిడెంట్లు మరియు ఫైటోన్యూట్రియెంట్లు అధికంగా ఉంటాయి. ఉసిరికాయను రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల జుట్టు సహజ రంగును కాపాడుకోవచ్చు.

**ఉసిరికాయ హెయిర్ ప్యాక్**

సహజంగానే, ఈ ప్యాక్ చాలా శక్తివంతమైనది మరియు ప్రభావవంతమైనది. ఇది దురద స్కాల్ప్, బలహీనమైన జుట్టు మరియు చుండ్రు చికిత్సలో అద్భుతాలు చేయగలదు.

**ఎలా చేయాలి?**

మీకు కావలసిందల్లా 7-8 మీడియం సైజు ఉసిరికాయలు మరియు కొంచెం నీరు. విత్తనాలను తీసివేసిన తరువాత, గూస్బెర్రీని ముక్కలుగా కట్ చేసుకోండి. కొంచెం నీళ్లు పోసి కలపాలి. దీన్ని మెత్తగా పేస్ట్‌లా చేసి ఒక గిన్నెలోకి మార్చుకోవాలి. స్ప్రే బాటిల్‌తో మీ జుట్టును తడి చేయండి. ఈ పేస్ట్‌ను మీ చేతులను ఉపయోగించి తలపై మరియు జుట్టుకు రాయండి. 15-20 నిమిషాల తరువాత, మీ జుట్టును నీటితో కడగాలి.

**ఉసిరికాయ పొడి హెయిర్ ప్యాక్**

గూస్బెర్రీ సీజనల్ ఫ్రూట్. ఇది సంవత్సరంలో నిర్దిష్ట సమయాల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. అందుచేత ఉసిరికాయను ఎండబెట్టి మెత్తగా నూరి ఏడాది పొడవునా ఉపయోగించడం ఉత్తమం. ఆమ్లా పొడి మీ జుట్టుకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది మరియు జుట్టు రాలడం, బూడిద జుట్టు, చుండ్రు మరియు పొడి వంటి వివిధ జుట్టు సమస్యలను పరిష్కరిస్తుంది. డీప్ కండిషనింగ్ ట్రీట్‌మెంట్‌గా పనిచేసే తేనెతో ఆమ్లా పొడిని ఉపయోగించి బేసిక్ హెయిర్ ప్యాక్‌ను ఎలా తయారు చేయాలో చూద్దాం.

**ఎలా చేయాలి**

ఒక గిన్నెలోఆమ్లా పొడి - 1 కప్పు మరియు తేనె - 2 స్పూన్లు జోడించండి. కొద్దిగా నీరు పోసి మెత్తగా పేస్ట్ చేయడానికి బాగా కలపండి. మీ జుట్టును తడి చేసి, ఈ పేస్ట్‌ను తలపై అప్లై చేయండి. 1 గంట పాటు జుట్టును గుడ్డతో కప్పి, తేలికపాటి క్లెన్సర్ మరియు నీటితో ప్యాక్‌ను కడగాలి.

**ఉసిరికాయ మరియు గుడ్డు హెయిర్ ప్యాక్**

గూస్బెర్రీ మరియు గుడ్డు హెయిర్ మాస్క్ పొడిబారడం, విరగడం మరియు జుట్టు నష్టంతో పోరాడటానికి ఒక గొప్ప చికిత్స. గుడ్డు సొనలో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి డ్యామేజ్‌ని రిపేర్ చేస్తాయి మరియు జుట్టు నిర్మాణాన్ని మెరుగుపరుస్తాయి. గుడ్డు మరియు గూస్బెర్రీ కలయిక మీ జుట్టుకు అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఫోలికల్స్‌ను బలోపేతం చేయడంతో పాటు, ఉసిరికాయ మరియు గుడ్డు మీ జుట్టును సిల్కీ స్మూత్‌గా మార్చుతాయి.

**ఎలా చేయాలి?**

దీనికిఆమ్లా పొడి - 3 స్పూన్లు మరియు గుడ్డు పచ్చసొన - 1. ఒక గుడ్డు పచ్చసొన సరిపోతుంది. మృదువైన అనుగుణ్యతను పొందడానికి దానికి కొన్నిఆమ్లా పొడిని వేసి బాగా కలపాలి. దీన్ని మీ జుట్టు మరియు తలపై అప్లై చేయండి. 40 నిమిషాల తర్వాత చల్లటి నీటితో జుట్టును కడగాలి.

**ఉసిరికాయ మరియు పెరుగు**

ఉసిరికాయ మరియు పెరుగు జుట్టు రాలడం మరియు చుండ్రుకు మంచి నివారణ. పెరుగు మరియు ఉసిరికాయలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు దురద మరియు స్కాల్ప్ ఇరిటేషన్‌ను తగ్గిస్తాయి. ఈ రెండు పదార్థాలలోని కొవ్వు ఆమ్లాలు మీ జుట్టును లోతుగా పోషించి మృదువుగా చేస్తాయి. ఈ హెయిర్ మాస్క్ పొడి మరియు చుండ్రుకు గురయ్యే జుట్టు ఉన్నవారికి సరిపోతుంది.

**ఎలా చేయాలి ?**

ఆమ్లా పొడి - 2 టీస్పూన్లు మరియు పెరుగు - 3 టీస్పూన్లతో మెత్తని పేస్ట్ చేయండి. ఈ మిశ్రమాన్ని మీ జుట్టు మరియు తలకు అప్లై చేయండి. 30 నిమిషాలు వదిలివేయండి. తర్వాత ప్యాక్‌ని చల్లటి నీటితో కడగాలి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com